# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 12 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 157 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


మేడిన్ ఇండియా ఎయిర్‌బస్




2

అప్పుడు గుహలు.. ఇప్పుడు బంకర్లు



2

వారు గృహిణులు మాత్రమే కాదు..

# జాతి నిర్మాతలు

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

**ఢిల్లీ, జూన్ 11:** కుటుంబాన్ని నడిపే మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదని.. ఈ దేశాన్ని నడిపించే జాతి నిర్మాతలని సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఆమె కేవలం ఇంటి పనులు మాత్రమే చేయడం లేదని, భావి తరాలను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంది. ఓ ప్రమాద కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.



''గృహిణి అంటే ఇంటిపెద్దపై ఆధారపడే వ్యక్తిగా పరిగణించడం విడ్డూరంగా అనిపిస్తోంది. ఎందుకంటే వాస్తవానికి ఓ కుటుంబమంతా నిత్యం ఆమెపైనే ఆధారపడుతోంది. కానీ, ఆమె విలువకు తగిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాల్లో మహిళలు విజయం సాధిస్తున్నప్పటికీ.. ఇంటి పనుల విషయంలో ఆమెను ఇప్పటికీ తక్కువగానే అంచనా వేస్తున్నాం. కానీ, ఆమె లేకపోతే ఇంట్లో ఎన్నో పనులు ఆగిపోతాయి. ఆమె చేసే పని వెలకట్టలేనిది. కానీ, ఒకవేళ దాన్ని ఆర్థికంగా లెక్క కడితే.. నెలకు కనీసం రూ.30వేల కంటే ఎక్కువే అవుతుంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

జీతం లేకుండా మహిళలు చేసే ఇంటి పనులు దేశ జీడీపీలో 15-17 శాతం వాటాకు సమానమనే అంచనాలున్నాయి. అయినప్పటికీ ఆమెకు మనం ఎలాంటి వేతనం చెల్లించడం లేదు సరికదా వారికి సరైన గుర్తింపు కూడా లభించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా వివాహ వ్యవస్థలో అనాదిగా వస్తోన్న ఆచారాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ''పెళ్లంటే పనుల కోసం ఓ మనిషిని నియమించుకోవడం కాదు. ఇంటి పనుల బాధ్యత ఆడవాళ్లదే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటోంది. కానీ, ఇందులో దంపతులిద్దరికి సమాన బాధ్యత ఉంటుంది. వివాహం జరిగిందన్న కారణంతో ఓ మహిళ తన కలలను, లక్ష్యాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదు. పెళ్లి అంటే మహిళ గుర్తింపునకు ముగింపు కాదు'' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిహారం కోరుతూ ఆమె భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సమయంలో ఆమె కుటుంబానికి రూ.2.42లక్షల పరిహారం ఇవ్వాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాధిత కుటుంబం పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించింది. అనంతరం ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది.




# హైదరాబాద్‌కు ఐఐఎం ఇవ్వండి

## అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

- పీఎంవో ఆధ్వర్యంలో ఎం-6 టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి
- ఐఐటీలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నం
- విద్యా-నైపుణ్యాభివృద్ధి విప్లవం
- ఏ రాష్ట్ర సీఎం వచ్చినా సంతోషంగా సందర్శించవచ్చు
- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 11, ( మనం బ్యూరో ) :** దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలన్నా దేశంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద సేవలు అందించాలని సూచించారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలన్నా దేశంలోని ప్రతి పౌరుడికి, విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామనీ, రాష్ట్రంలో అంతర్జాతీయ వర్సిటీలు, హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పుకొచ్చారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం ...మిగతా 2లో

రాష్ట్ర ప్రాజెక్టులకు

# సహకరించండి

- మహారాష్ట్రతో చర్చలకు చొరవ చూపండి
- ట్రిపుల్ ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలకు వెంటనే అనుమతివ్వండి
- ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, జూన్ 11 ( మనం బ్యూరో ) :** తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. గురువారం నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలనీ, ఇదే ఫేజ్‌లోని 7 కారిడార్లలో 122.9 కి.మీ.ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని ...మిగతా 2లో

# అద్దెకు చెల్లు చీటీ

- ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,జూన్11(మనం న్యూస్):** రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు.మొదటి దశలో అద్దె భావనాలల్లో, ...మిగతా 2లో




‘టీఆర్‌ఎస్’లో

# టైటిల్ వార్

- కవిత టీఆర్‌ఎస్‌పై 700 అభ్యంతరాలు
- బీఆర్‌ఎస్ శ్రేణుల నుంచి ఫిర్యాదులు
- సోలాపూర్ నేత దరఖాస్తుతో కొత్త ట్విస్ట్
- టీఆర్‌ఎస్... ఉంటుందా, ఊడుతుందా..!
- రాజకీయ వర్గాలలో చర్చోపచర్చలు

**హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ టీఆర్‌ఎస్ పార్టీ పేరు చుట్టూ ‘టైటిల్ వార్’ నడుస్తోంది. టీఆర్‌ఎస్ పేరు వచ్చేలా తెలంగాణ రక్షణ సేన పేరుతో కవిత ప్రకటించిన పార్టీ పేరుపై పెద్ద ఎత్తున ...మిగతా 2లో

బెంగాల్లో అగ్నిప్రమాదం..

# 4,000 ఈవీఎంలు దగ్ధం!



**కోల్‌కతా,జూన్ 11:** పశ్చిమ బెంగాల్లోని ఓ ప్రభుత్వ భవనంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు కాలిపోయాయి. బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ ఈ విషయాన్ని వెల్లడించారు. కోల్‌కతాలోని అలీపుర్ ప్రాంతంలో ఉన్న తొమ్మిది అంతస్తుల భవనంలో బుధవారం మంటలు చెలరేగాయి. ఈ భవనంలో ఆయా ప్రభుత్వ విభాగాలతోపాటు దక్షిణ 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యాలయం కూడా ఉంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బందికి 24 గంటలకుపైగానే సమయం పట్టిందట.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి కౌశిక్ మాట్లాడుతూ.. ''అగ్ని ప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు కాలిపోయాయి. ఈ ఈవీఎంలను ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 నియోజకవర్గాల్లో ఉపయోగించారు. ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా కనిపించడం లేదు. ఏదైనా కుట్ర జరిగిందా? అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం. భవనంలోని రెండో, మూడో అంతస్తుల్లో మొదట మంటలు కనిపించాయి. మధ్యలో ఉన్న అంతస్తులపై ఎలాంటి ప్రభావం చూపకుండా.. తొమ్మిది, పదో అంతస్తులకు అవి ఎలా వ్యాపించాయనేది స్పష్టంగా తెలియరాలేదు. దీనిపై విచారణ జరుగుతోంది. ఫోరెన్సిక్ నివేదిక అనంతరం స్పష్టత వస్తుంది'' ...మిగతా 2లో

## ఫార్మాసిటీకి 17 ఎకరాలు ఇచ్చా

2

- రియల్ ఎస్టేట్‌కు వాడితే ఊరుకుంటామా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



## ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం

టీఆర్‌ఎస్ చీఫ్ కవిత

3

అన్నంత పని చేసిన ట్రంప్..

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు



- అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన
- హర్మూజ్ మూసివేత..
- బహ్రెయిన్, కువైట్‌పై ప్రతిదాడులు
- దీటుగా స్పందించిన ఇరాన్

**వాషింగ్టన్,జూన్ 11:** ఇరాన్‌పై భారీస్థాయిలో దాడులు చేస్తామని ట్రంప్ చెప్పిన కొద్దిసేపట్లోనే ఆ హెచ్చరికలు వాస్తవ రూపం దాల్చాయి. దీంతో పశ్చిమాసియాలో యుద్ధపు మంటలు తీవ్రమయ్యాయి. ఇరాన్‌లలోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇవి ట్రంప్ ఆదేశాల మేరకు కేవలం ఆత్మరక్షణ కోసం చేశామని పేర్కొంది. ఇరాన్లోని దక్షిణ ప్రాంతంలో భారీగా పేలుళ్లు జరిగాయి. మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్ ప్రాంతాలపై అమెరికా దృష్టిసారించింది. మరోవైపు కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతినిధులు ప్రాధేయపడ్డారని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిని ఇరాన్ కొట్టిపారేసింది. ఈ విడతలో దాడులు ముగిసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే రేపు రాత్రి దాడులు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు ఆ దేశ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. దీనికి తగినట్లే ఇరాన్‌లోని స్థావరాలను లక్ష్యంగా చేసుకొంది. మొత్తం 49 తోమహాక్ క్షిపణలను ఈ దాడుల్లో వినియోగించినట్లు పేర్కొంది. ఇరాన్‌కు 64 కిలోమీటర్ల దూరంలోని కొన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. దీంతోపాటు ఫైటర్ జెట్లు కూడా దాడుల్లో పాల్గొని పర్షియన్ గల్ఫ్ వద్ద ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను దెబ్బతీసినట్లు వెల్లడించింది.

అమెరికా దాడులకు ఇరాన్ దీటుగా స్పందించింది. హర్మూజ్ జలసంధిని అన్నిరకాల నౌకలకు మూసివేసినట్లు ప్రకటించింది. రెండు చమురు ట్యాంకర్లపై కూడా ఐఆర్జీసీ దళాలు దాడులు చేశాయి. వాటికి అమెరికా యుద్ధనౌకలు సాయపడుతున్నట్లు ఆరోపించాయి. మరోవైపు కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అలీ అల్సలీమ్ ...మిగతా 2లో

## రష్యా సైనిక, ఇంధన కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు

**కీవ్, జూన్ 11:** ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణులతో రష్యాలోని పలు కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారు చేసే ఓ కర్మాగారం సహా పలు సైనిక, ఇంధన స్థావరాలపై తమ బలగాలు దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ప్రయోగించిన ఎఫ్పీ-5 ఫ్లెమింగో దీర్ఘశ్రేణి క్షిపణి దాదాపు 900 కి.మీ. ప్రయాణించి, చువాషియా ప్రాంతంలోని చెబోక్సరిలో ఉన్న సైనిక కర్మాగారాన్ని ధ్వంసం చేసిందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా అధికారులు ఈ దాడిని ధ్రువీకరించినప్పటికీ.. ఇతర వివరాలను తెలపలేదు. ఈ దాడిలో రష్యాలోని ఒక రిఫైనరీ సహా పలు పరిశ్రమలు దెబ్బతిన్నాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.




నౌకపై అమెరికా దాడి..

# ముగ్గురు భారతీయులు మృతి

- మృతుల్లో విశాఖ వాసి
- ధ్రువీకరించిన కేంద్ర మంత్రి

**వాషింగ్టన్/ఢిల్లీ, జూన్ 11:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా బుధవారం జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్గా గుర్తించారు.

తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా ఢిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది.



ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారం రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ''ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం'' అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవీర్ అని తెలుస్తోంది. ఒమన్ తీరంలో భారతీయప్రయాణిస్తున్న నౌకపై అమెరికా చేసిన దాడిలో ...మిగతా 2లో

## అప్పుడు గుహలు.. ఇప్పుడు బంకర్లు: ఉగ్రవాదుల కొత్త పన్నాగాలు..!

**శ్రీనగర్, జూన్ 11:** భద్రతా బలగాలకు చిక్కకుండా ఉగ్రవాదులు కొత్తకొత్త పన్నాగాలు పన్నుతున్నారు. ఉగ్రదాడులకు ముందు వారు దాక్కొనేందుకు గుహలకు బదులుగా బంకర్లను వాడుతున్నారు. జమ్మూకశ్మీర్ లోని రాజౌరీలో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు విస్తుపోయే విషయాలను గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

ఉగ్రవాదులు తాము నక్కే ప్రదేశాల విషయంలో మార్పులు చేసుకుంటున్నారు. తమ హైడవుట్స్‌గా గతంలో గుహలను ఉపయోగించుకున్న ఆ మూకలు.. అండర్గ్రౌండ్ బంకర్లను వాడుతున్నారు. గతేడాది కశ్మీర్ లోయలోని కుల్గామ్ అడవుల్లో నిర్వహించిన సెర్చ్ అండ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు ఈ విషయాన్ని గుర్తించాయి. అవన్నీ తాత్కాలిక నిర్మాణాలు. భూమిని తవ్వి, దుంగలతో వాటిని నిర్మించుకున్నారు. చత్రు ప్రాంతంలో 12 వేల అడుగుల ఎత్తులో ఈ ఏడాది ప్రారంభంలో కూడా అలాంటి బంకర్ ఒకటి భద్రతా సిబ్బంది కంటపడింది. ఒకేసారి నలుగురు ఉండేంత విశాలంగా అది ఉంది. కొన్ని నెలల పాటు సరిపడా నిత్యావసరాలను అందులో నిల్వ చేసుకున్నట్లు బలగాలు వెల్లడించాయి.

ఉగ్రవాదులు గుహలు, తాత్కాలిక బంకర్లకే పరిమితం కాకుండా దట్టమైన అడవుల్లో ఎక్కువ కాలం మన్నిక ఉండే పక్కా బంకర్లను నిర్మిస్తున్నారని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఎక్కువకాలం అజ్ఞాతంలో ఉండేందుకు వీలుగా, ఆశ్రయం కోసం స్థానికుల మీద ఆధారపడకుండా ఉండేలా అవి ఉపయోగపడనున్నాయి. ఉగ్రవాదులు నక్కారనే ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా మే 22 నుంచి సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఆపరేషన్ షెరువాలీ పేరిట రాజౌరీలోని అటవీ ప్రాంతంలో గాలింపుచర్యలు చేపట్టారు.

ఈ క్రమంలో ఉగ్రమూకలకు, బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు దట్టమైన అడవిలోకి పారిపోయారు. రాజౌరీలోని గంబీర్ ముగ్లన్, డొరిమల్ ప్రాంతంలో ఉన్న హైడవుట్లో ఆశ్రయం పొందుతూ ఉండొచ్చని భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు. ఈ సెర్చ్ ఆపరేషన్లో భాగంగా సకల సౌకర్యాలతో ఉన్న కాంక్రీట్ బంకర్ను గుర్తించి దానిని పేల్చివేశారు. ఈ అటవీ ప్రాంతంలో అలాంటివి మరికొన్ని ఉండొచ్చని అనుమానిస్తోన్న సిబ్బంది.. వాటికోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

## మేడిన్ ఇండియా ఎయిర్‌బస్

**వడోదరా, జూన్ 11:** భారతీయ విమానయాన, రక్షణ రంగాల్లో సరికొత్త మైలురాయి నమోదైంది. మొట్టమొదటి మేడిన్ ఇండియా ఎయిర్‌బస్ ఇ-295 సైనిక రవాణా విమానం తొలి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. గుజరాత్‌లోని వడోదరాలో ఉన్న ఫైనల్ అసెంబ్లీ లైన్ నుంచి ఈ చరిత్రాత్మక తొలి విమాన ప్రయాణం సాగింది.

## ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు



**(మొదటి పేజీ తరువాయి)**

ఎయిర్‌బేస్‌లపై డ్రోన్లు దాడి చేసినట్లు ఐఆర్జీసీ పేర్కొంది.

**ఈ రాత్రికి భీకర దాడులు చేస్తాం - ట్రంప్**

ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌హెచ్చరించారు. ట్రూత్ సోషల్లో పోస్టు చేసిన ఆయన.. ఈ రోజు రాత్రి ఇరాన్‌పై అత్యంత తీవ్రంగా దాడులు ఉంటాయన్నారు.

''ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతోపాటు రక్షణ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు ఇప్పటికే నాశనమయ్యాయి. సమీప భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు మౌలిక సదుపాయాలను స్వాధీనం చేసుకొని ఆయా మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం. వెనెజువెలాలో చేసిన మాదిరిగానే ఇరాన్‌లో మా ప్రణాళిక ఉంటుంది'' అని పేర్కొన్నారు.

## ముగ్గురు భారతీయులు మృతి

**(మొదటి పేజీ తరువాయి)**

ముగ్గురు భారతీయులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నానికి చెందిన మెరైన్ ఇంజినీర్ సురేష్ పట్నాల (44) ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు, దిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు ధ్రువీకరించారు.

సురేష్‌కు భార్య భార్గవితో పాటు 13, 10 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. త్వరలో (జూన్ 24న) 15వ వివాహ వార్షికోత్సవం అని.. అంతలోనే తన భర్త శాశ్వతంగా దూరమయ్యారని భార్గవి విలపించారు. ఐదు నెలలపాటు విధుల్లో ఉన్న సురేష్.. త్వరలోనే ఇంటికి వచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే అనుమతి కూడా పొందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

**ఏం జరిగిందంటే..!**

''నౌక జనరేటర్‌లో సమస్య తలెత్తడంతో దాన్ని తనిఖీ చేసేందుకు సురేష్ వెళ్లారు. అదే సమయంలో దాడి జరగడంతో తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెప్పారు. వాస్తవానికి మరో చీఫ్ ఇంజినీర్‌కు తోడుగా ఉండేదుకు పది రోజుల డ్యూటీ కోసం సురేష్ వెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల కారణంగా విధులు నిర్వర్తించాల్సిన కాలాన్ని పొడిగించారు. ఈ దాడికి ముందు సుమారు వారం రోజులుగా నౌక ఆ ప్రాంతంలోనే ఉంది. అక్కడ ఆంక్షలు, జామర్ల కారణంగా ఆడియో, వీడియో కాల్స్ చేసుకోవడం కుదరలేదు. కేవలం టెక్స్ట్ మెసేజ్లు మాత్రమే పంపించుకోగలిగాం'' అని భార్గవి వివరించారు.

## బెంగాల్లో అగ్నిప్రమాదం.. 4,000 ఈవీఎంలు దగ్ధం!

**(మొదటి పేజీ తరువాయి)**

అని తెలిపారు. దక్షిణ 24 పరగణాల యంత్రాంగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన వెనుక కుట్ర కోణాన్ని కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ పేర్కొన్నారు. అయితే.. ఫోరెన్సిక్ పరీక్షలు, శాస్త్రీయ ఆధారాలతోనే నిర్ధారణకు వస్తామని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఆ భవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు, మౌలిక సదుపాయాలు, భద్రతా వ్యవస్థలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఫార్మాసిటీకి 17 ఎకరాలు ఇచా

**హైదరాబాద్, జూన్ 11:** ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. ''ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదు. ఫార్మాసిటీ కోసం నేను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా? ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరు?'' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# హైదరాబాద్‌కు ఐఐఎం ఇవ్వండి



**(మొదటి పేజీ తరువాయి)**

రావాల్సి అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి ఎం-6 టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలనీ, ఈ ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేంద్రం ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో ఫేజ్-2, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. తెలంగాణలో నిర్వహించిన కుల సర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందన్నారు. కులాల మధ్య గోడలు కూల్చేందుకే ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తమ రాష్ట్రంలోని తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామన్నారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధస్సు యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి తయారీ రంగం, సేవా రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు సహకరించండి

**(మొదటి పేజీ తరువాయి)**

కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులను వెంటనే ఆమోదం తెలపాలని ప్రధానిని కోరిన సీఎం ఉత్తర భాగంలో భూ సేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని వివరించారు. ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 90 శాతానికి పైగా భూ సేకరణ అవార్డు అయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ప్రధానికి వివరించిన సీఎం చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు.

దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లు ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామనీ, ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి-బందర్ పోర్టు ఎక్స్‌ప్రెస్‌కు కేంద్రం అనుమతి ఇవ్వాలనీ, ఈ మార్గం ద్వారా బందరు పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు. 1200 మీటర్ల రైట్‌వేతో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందనీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్టు పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా సీఎం ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలనీ, ఇందుకు అవసరమైన 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.



# 'టీఆర్ఎస్'లో టైటిల్ వార్

**(మొదటి పేజీ తరువాయి)**

అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలంటూ న్యూస్ పేపర్లలో కవిత ఇచ్చిన యాడ్స్ పై ఇప్పటి వరకు దాదాపు 700 అభ్యంతరాలు అందాయి. ముఖ్యంగా

కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించాడనికి ఒక రోజు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్ కు చెందిన దయానంద్ మహాదేవ్ ''తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే పార్టీ పేరు కోసం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. కవిత ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన, దాయానంద్ దరఖాస్తు చేసుకున్న తెలంగాణ రాష్ట్రసామాజిక సేన రెండు పార్టీల సంక్షిప్త నామం టీఆర్ఎస్ ఒక్కటే కావడంతో ఈసీ వద్ద టైటిల్ వార్ మొదలైందనే చర్చ జరుగుతోంది.

రాష్ట్ర రాజకీయాల్లో సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని గత కొంత కాలంగా కసరత్తు చేసుకున్న కవితకు పార్టీ టీఆర్ఎస్ విషయంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇటీవల టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయంలో కవిత తన నోటితో మన పార్టీ పేరు టీఆర్ఎస్ ప్రకటించడంతో పాటు వేదికపై ఏర్పాటు చేసిన స్క్రీన్లపై మాత్రం తెలంగాణ రాష్ట్ర సేన అని ప్రదర్శించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కవిత తన పార్టీ పేరును తెలంగాణ రక్షణ సేనగా ప్రకటించారు. దీంతో రోజుల వ్యవధిలోనే పార్టీ పేరు మారడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో మరోసారి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' అనే పేరు కొనసాగబోతోందా లేదా అనేది ఉత్కంఠగా మారింది.

టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన)పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్(భారత రాష్ట్ర సమితి) కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. 14 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉందని, ఇప్పటికీ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదుతో పాటు విజ్ఞప్తి చేసింది. అలాగే కవిత పార్టీ పేరు టీఆర్ఎస్‌గా వాడడంపై తెలంగాణ రాజ్య సమితి పార్టీ కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'టీఆర్ఎస్' పేరుతో నమోదైన మరికొన్ని రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో పార్టీ పేరుపై వచ్చిన అభ్యంతరాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చేందుకు కవిత పార్టీ టీఆర్ఎస్ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ఈ వివాదంపై కవిత ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సమాయత్తమౌతున్నారు. టీఆర్ఎస్‌పై భారీ సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో కవిత కొత్త రాజకీయ పార్టీకి 'టీఆర్ఎస్' పేరు దక్కుతుందా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది

# అద్దెకు చెల్లు చీటీ

**(మొదటి పేజీ తరువాయి)**

శిథిలావస్థాలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని ఆయన తెలిపారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పొంగులేటి వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని,ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడలలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు.క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని పొంగులేటి వెల్లడించారు.

# ఆరోగ్యశాఖలో విజయవంతంగా ముగిసిన బదిలీల ప్రక్రియ

**హైదరాబాద్, జూన్ 11:** రాష్ట్ర ఆరోగ్యశాఖలో భారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రభుత్వ వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యతను కాపాడుతూ ప్రభుత్వం 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగులను బదిలీ చేసింది.

ఈ బదిలీల్లో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 2,258 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ హాస్పిటళ్లలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ఎన్ఎంసీ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి మెడికల్ కాలేజీలో అవసరమైన సంఖ్యలో అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా బదిలీలను నిర్వహించింది.

అదే సమయంలో ఒకే హాస్పిటల్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేస్తే రోగులకు అందే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా బదిలీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేసింది.

ఈ ప్రక్రియలో భాగంగా ఒకే స్టేషన్లో నాలుగు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీకి అవకాశం కల్పించింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పిస్తే జిల్లాల్లోని ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ విషయంలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, జిల్లా కేంద్రాల్లోని టీచింగ్ హాస్పిటళ్లను బలోపేతం చేస్తోంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవల్లో దాదాపు 90 శాతం సేవలను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను పెంచుతోంది.

ఇదే వ్యూహంలో భాగంగా ఇటీవల నియామకాలు పొందుతున్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందికి కూడా గ్రామీణ మరియు జిల్లా స్థాయి వైద్య సంస్థల్లోనే పోస్టింగ్లు ఇస్తోంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కొరత తగ్గడంతో పాటు ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించే ప్రయత్నం చేస్తోంది. హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాల్లోని ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చి ట్రీట్మెంట్ తీసుకునే పేషెంట్లకు రవాణా, ఇతర ఖర్చుల భారం ఉంటోంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లోనే అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది.

బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, వైద్య సేవల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించడం ద్వారా రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

బదిలీల్లో దీర్ఘకాలం హైదరాబాద్ వంటి ఒకే స్టేషన్లో పనిచేసిన వారిని బదిలీ చేయడంతో.. జిల్లాల్లో సుదీర్ఘకాలం పని చేసిన డాక్టర్లు, సిబ్బందికి హైదరాబాద్కు వచ్చే అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో పేషెంట్లకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్లు చెబుతున్నారు.

# రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీపై ప్రతిపక్షాల విమర్శలు

**రామచందర్ రావు**

**హైదరాబాద్, జూన్ 11:** గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు బీజేపీ మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు భాజపాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా కుకునూర్పల్లి మండలం మాత్పల్లిలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.



## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మరో ప్రమాదం

**విశాఖపట్నం,జూన్ 11:** విశాఖ ఉక్కు కర్మాగారంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. నిన్న ఎస్ఎంఎస్-2లో ల్యాడిల్ నుంచి ఉక్కు ద్రవం నేలపాలైంది. ఇవాళ ఉదయం ఏ షిఫ్ట్లో ఎస్ఎంఎస్-1 టీపీబేలో ల్యాడిల్‌కు రంధ్రం పడి స్టీల్ మెటల్ నేలపాలైంది. నిన్న, ఇవాళ్టి ప్రమాదాల్లో ప్రాణనష్టం లేకపోవడంతో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. కేంద్రం నియమించిన త్రీమెన్ కమిటీ విచారణ జరుగుతుండగానే మరోసారి ప్రమాదాలు జరుగుతుండటం గమనార్హం.

# చెన్నై విమానాశ్రయంలో కొత్త ప్లాజా

**చెన్నై, జూన్ 11:** చెన్నై విమానాశ్రయంలో కొత్త ప్లాజా త్వరలో అందుబాటులోకి రానుందని విమానాశ్రయ డైరెక్టర్ రాజకిషోర్ తెలిపారు. ఈ విమానాశ్రయం ద్వారా రోజుకు 60వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం 450పైగా విమానాలు తిరుగుతుంటాయి. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు సామగ్రి తీసుకొని బయటకు వెళ్లడానికి గంటకుపైగా వేచి ఉండాలి. చాలామంది పికప్ పాయింట్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కోని నాలుగో అంతస్తునకు సుమారు అర కి.మీ మేర నడవాలి. ఈ నేపథ్యంలో చెన్నై విమానాశ్రయ అథారిటీ భారత విమానాశ్రయ ప్రాధికార సంస్థ సహకారంతో దేశీయ విమానాశ్రయానికి ఎదురుగా కొత్త ప్లాజా పికప్పాయింట్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ పనులు 2023లో ప్రారంభమయ్యాయి. 2024లో పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించినా సుమారు రెండేళ్లు ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో చెన్నై విమానాశ్రయ డైరెక్టర్ రాజకిషోర్ మాట్లాడుతూ.. కొత్త ప్లాజా నుంచి త్వరలో కార్యకలాపాలు ప్రారంభమవనున్నాయి.



రూ.23.5కోట్లతో నిర్మించారు. ఇది కేవలం ప్రయాణీకుల వాహనాల కోసం మాత్రమే ఏర్పాటు చేసిన పికప్ పాయింట్. ప్రయాణీకులు చెన్నై విమానాశ్రయానికి పశ్చిమవైపున ఉన్న బహుళ అంతస్తుల కార్ పార్కింగ్ ప్రాంతానికి నడిచి వెళ్లాలి. లేదా బ్యాటరీతో నడిచే వాహనాల్లో ఎక్కాలి. వృద్ధులు, చిన్నపిల్లలు అధిక లగేజీతో వచ్చే ప్రయాణికులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్త ప్లాజాను నిర్మించారు. ప్లాజాలో దుకాణాలు, చిన్నపాటి హోటళ్లు, విశ్రాంతి గదులు తీసుకొచ్చే ఆలోచన లేదు. ప్రయాణీకులను వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లే ప్రదేశంగా మాత్రమే సిద్ధం చేసినట్లు తెలిపారు.

నిర్మాణం పూర్తయినా గత ఒప్పందాలకు సంబంధించి కొన్ని న్యాయపరమైన ప్రక్రియల కారణంగా ప్రారంభోత్సవంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం న్యాయ సంప్రదింపులు జరుగుతున్నాయి. ఎయిర్పోరట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఆమోదం లభించిన వెంటనే ప్రజల వినియోగం కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రయాణీకులు ఆహారం తినడానికి ప్రత్యేక టేబుళ్లు, సెల్‌ఫోన్ ఛార్జింగ్ పాయింట్, శుద్ధీకరించిన తాగునీటి సౌకర్యం, లగేజీలు ఉంచుకోవడానికి టేబుళ్లు, సీసీటీవీ కెమెరాలు, కుర్చీలు, నాలుగు వైపులా వెంటిలేషన్తో ఆధునీకరించారు. వాహనాలను త్వరగా ఎక్కించుకోవడానికి, దించుకోవడానికి ప్లాజాలో రెండుమార్గలు ఉన్నాయి. ఈ ప్లాజాను ప్రయాణికులకు పూర్తిగా ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ప్రయాణీకులు గరిష్ఠంగా 30నిమిషాల్లోపు బయటకు వెళ్లేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు.

## జంట హత్యల కేసులో ట్విస్ట్

- ప్రధాన నిందితురాలు కరీమాబేగం మృతి..!

హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): మోయినాబాద్ ఫాం హౌస్ జంట హత్యల కేసులోని ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. గత 24 రోజులుగా చికిత్స పొందుతూ కరీమాబేగం మృతి చెందింది. కాగా మొయినాబాద్ మండల పరిధిలో సంచలనం సృష్టించిన తాండూరు జంట మహిళల దారుణ హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న కరీమా బేగం విచారణలో భాగంగా కరణ్ కోట్ పోలీస్టేషన్‌కు తరలించారు. విచారణలో ఉండగా కరీమాభేగం బాత్రూంలోకి వెళ్లి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అదే రోజు పోలీసులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో 24 రోజులుగా చికిత్స పొందుతున్న కరీమాభేగం బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిసింది. మొయినాబాద్ జంట హత్య కేసులో కరీమాబేగంతో పాటు ఆమె భర్త రెహమాన్, నయూం అనే వ్యక్తి కూడా నిందితులుగా ఉన్నారు. ఠాణాలో కరీమాభేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో వికారాబాద్ జిల్లా ఎస్పీ ఇద్దరు కానిస్టేబుళ్ల పై సస్పెన్షన్ వేటు వేశారు.

## ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం

### టీఆర్ఎస్ చీఫ్ కవిత



హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలంపై ప్రభుత్వం తాత్సారం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బంజారాహిల్స్ లో ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. జులై 2న ఉప్పల్ భగాయత్ భూములను భూపోరాటం ద్వారా ఆక్రమించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలపారు. అది అక్రమం కాదని సక్రమమేనని అన్నారు. ఈ భూమి ఉద్యమకారులదేనని, భూమి కోసం కొట్లాడింది తామేనని చెప్పారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం కోసమే ఈ పోరాటం చేస్తున్నామని అన్నారు. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ కు తరలిరావాలని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ వాదంపై దాడులు చేస్తూ, అనేక రకాల శక్తులు, వ్యక్తులు ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అందరి కర్తవ్యంగా భావించి మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

## దేవ్ జీ...ఇంటర్ పాస్

### 'లాసెట్‌లోనూ సత్తచాటిన మాజీ మావో



హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): దండకారణ్యం వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్ట్ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ చదువులోనూ రికార్డులు సృష్టిస్తున్నారు. ఇటీవల లాసెట్‌లో సత్తాచాటిన మాజీ మావోయిస్ట్ అగ్రనేత దేవ్‌జీ తాజాగా ఇంటర్ 614 మార్కులతో పాస్ అయ్యాడు. గతంలో దేవ్ జీ కొన్ని అనివార్య కారణాల వల్ల చదువ మధ్యలోనే ఆగిపోయింది. ముఖ్యంగా తన ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్ష రాసేందుకు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నాడు. తాజాగా విడుదలైన ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాలలో ఆయన తెలుగు సబ్జెక్టులోనే ఏకంగా 72 మార్కులు సాధించి 614 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. న్యాయశాస్త్రం చదివి సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఆయన ఇటీవల రాసిన లాసెట్ పరీక్షలోనూ సంచలన విజయం సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఏకంగా 349వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. గన్ను వదిలో పెన్ను పట్టి విద్యాభ్యాసంలో తనదైన శైలిలో రాణిస్తున్న దేవ్‌జీ విజయాలపై విద్యాశాఖ, పోలీస్ ఉన్నతాధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కక్కుర్తి పడితే?.. భారీ (ఫైన్) పనిష్మెంట్

## మద్యం అమ్మినా.. కొన్నా.. రూ.5 లక్షలు ఫైన్..

### కేసీఆర్ ఇలాఖాలోని గ్రామం తీర్మానం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాఖాలోని ఓ గ్రామం భారీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి.. తమ గ్రామంలో మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా.. వారికి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని తీర్మానం చేసింది. మద్యం మత్తులో యువత, పురుషులు మునిగిపోయి.. వారి ఇళ్లల్లో గొడవలు జరుగుతుండటంతో.. గ్రామస్థులంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ గ్రామస్థులు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**మద్యంతో కుటుంబాలు చిన్నాభిన్నం..**

మద్యం ఎన్నో కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుంది. మద్యం సేవించడం మొదట సరదాగా ప్రారంభమైనప్పటికీ.. క్రమంగా దానికి బానిసైన వారు చాలా మంది ఉన్నారు. ఇలా మద్యానికి బానిసలై ఎంతో మంది.. పనులు చేయకుండా, అప్పుల పాలై, కుటుంబాలను పట్టించుకోకుండా రోడ్డున పడ్డ వారు ఉన్నారు. అంతేకాకుండా మద్యం విపరీతంగా తాగి.. అవయవాలు పనిచేయక.. నూరేళ్లు నిండకుండానే రోగాలతో చనిపోయే వారు కూడా ఉన్నారు. అయితే ఈ మద్యం చేస్తున్న అనర్థాలపై ఆ గ్రామస్థులు పోరాటం చేశారు. తమ గ్రామంలో మద్యం వాసన వినిపించకుండా కఠిన నిబంధనలు తీసుకువచ్చారు. మందు కొన్నా, అమ్మినా భారీగా జరిమానా విధిస్తామంటూ తీర్మానం చేశారు.

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మక్త మాసాన్ పల్లి గ్రామస్తులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. తమ గ్రామంలో రోజురోజుకూ పెరిగిపోతున్న మద్యం మహమ్మారిని అరికట్టేందుకు అక్కడి మహిళలు, గ్రామస్తులు చర్యలు చేపట్టారు. గ్రామంలో మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని మక్త మాసాన్ పల్లి గ్రామం ఏకగ్రీవ తీర్మానం చేసి.. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కింది.

## పేరు మార్చి...చీటింగ్

### క్యూనెట్ కొత్త మోసాలకు అడ్డుకట్ట

### రూ.5వేల కోట్ల మోసానికి సీసీఎస్ పోలీసుల చెక్

హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): గతంలో వేలాది మందిని మోసగించిన క్యూనెట్ సరికొత్త రూపం 'ఇగ్నైట్' పేరిట చీటింగ్‌కు తెరతీసింది. ఈక్రమంలో ఇగ్నైట్ సంస్థ రూ. 5000 కోట్ల అంతర్జాతీయ గొలుసుకట్టు మోసాల గుట్టును సిటీ పోలీసులు రట్టుచేశారు. వివరాల్లోకి వెళితే.. గతంలో నిషేధానికి గురైన 'క్యూనెట్' సంస్థ సరికొత్తగా పేరు మార్చి 'ఇగ్నైట్' పేరుతో అవతారమెత్తింది. ఈక్రమంలో కేరళ, వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలలో విస్తరించి దాదాపు రూ. 5 వేల కోట్ల భారీ మోసానికి కుట్ర చేసింది. ఈ ముఠా గుట్టును పసిగట్టిన హైదరాబాద్ సిటీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం చాకచక్యంగా వ్యవహరించి ఈ సంస్థ ఏర్పాటైన 18 రోజుల్లోనే దాడి చేసింది. భారీ ఎత్తున మోసాలకు తెగబడిన ఈ ముఠాకు చెందిన ఆరుగురిని గురువారం హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్ట్ చేశారు.

**ప్రత్యేక ఆపరేషన్ :**

హైదరాబాద్ నగరంలో ముగ్గురు బాధితులు తమను నమ్మించి రూ. 1.87 లక్షలు కాజేసినట్లు ఈనెల 5.6 తేదీల మధ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా సిటీ పోలీసులు అప్రమత్తమైయ్యారు. ఈ మూడు ఘటనలపై వేర్వేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనప్పటికీ, గతంలో నిషేధానికి గురైన 'క్యూనెట్' సంస్థ కొత్త రూపంలో మళ్లీ మోసాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వెంటనే ఈ కేసు సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు.

ఈ క్రమంలో నిందితులు వాట్సాప్, జూమ్ కాల్స్, షాపింగ్ మాల్స్ వంటి వేర్వేరు మార్గాల్లో ఎర వేసి రూ. 60 వేల చొప్పున వసూలు చేసి, కోల్‌కతాలోని భవానీపూర్ శాఖకు చెందిన 'పారస్నాథ్ మెర్కంటైల్ ప్రైవేట్ లిమిటెడ్' ఖాతాలో నగదు జమ చేయించినట్లు సీసీఎస్ పోలీసుల విచారణలో వెలుగుచూసింది.

**నిందితుల వివరాలు:**

'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరుతో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మెరుపు దాడులు నిర్వహించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు.అరెస్టయిన వారిలో ఒనియల్ గుప్తా, దినేష్ కుమార్ సాహిల్, ప్రియాన్షు సక్సేనా (డైరెక్టర్లు, ఇండి కనెక్ట్ వెంచర్స్-యూపీ), ప్రవీణ్ కుమార్, పరితోష్ కుమార్ (డైరెక్టర్లు, పారస్నాథ్ మెర్కంటైల్-కోల్‌కతా ), రియాజ్ (ఫీల్ రిక్రూటర్-కేరళ) ఉన్నారు. నిందితులపై తెలంగాణ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారులు పత్మన్ సేనాథిరాజా, విజయ్ ఈశ్వరన్‌లపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

## ఏపీ లిక్కర్ స్కాం..

## తెలంగాణలో ఈడీ సోదాలు

### రాజ్ కేశిరెడ్డి అరెస్ట్...రిమాండ్

హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో ఈడీ దూకుడు పెంచింది. ఈ కేసులో ప్రధాన రాజ్ కేశిరెడ్డిని ఈడీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. లిక్కర్ స్కాంలో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ జరుపుతున్న అధికారులు రాజ్ కేశిరెడ్డి తో పాటు వాసురెడ్డిని సైతం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈడీ బృందాలు హైదరాబాద్ జోన్ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. రాజ్ కేశిరెడ్డి, వాసురెడ్డిల నివాసాలతో పాటు వారి కార్యాలయాలలో తనిఖీలు చేపట్టి రూ. 8లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రాజ్ కేశిరెడ్డి ఇంటి నుంచి పలు ఎలక్ట్రానిక్ డివైజ్‌లు, డిజిటల్ రికార్డులను సీజ్ చేశారు. అక్రమ లిక్కర్ రవాణా టెండర్ల కేటాయింపుల ద్వారా ఏపీ ప్రభుత్వానికి సుమారు రూ.195.33 కోట్ల నష్టం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో భారీ స్థాయిలో మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ అధికారులు లిక్కర్ స్కాంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో పాటు వాసురెడ్డిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈడీ కార్యాలయానికి తరలించి సుదీర్ఘంగా విచారించారు. నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో ప్రవేశ పెట్టారు. ధర్మాసనం నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో వారిని చంచల్ గూడ జైలుకు తరలించారు.

## ఉద్యోగ నియమకాలపై సీఎం రేవంత్‌కి బీఆర్ఎస్ సవాల్

### నియామకాలపై రాజీనామాకు సిద్ధం..

### ముఖ్యమంత్రి సిద్ధమా?.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సవాల్



హైదరాబాద్, మనం ప్రతినిధి : రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అన్ని అబద్దాలతో కాలం గడిపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తీవ్రంగా విమర్శించారు. గడిచిన రెండేళ్లలో ఉద్యోగ నియమకాలపై ముఖ్యమంత్రికి సవాలు విసిరారు. ఈ మేరకు... తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి. సుధీర్ రెడ్డి, మాదవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ రాజుతో కలసి విప్ సహ కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ప్రతి ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులందరూ నిరుద్యోగులకు హామీ ఇచ్చారని, నేటికి కేవలం 12 వేల 600 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ హయాం లోనే ఇచ్చిన నోటిఫికేషన్లను మాత్రమే భర్తీ చేశారని ఆరోపించారు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చిన ట్లు రుజువు చేస్తే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేస్తామని, దమ్ముంటే మీరు రాజీనామా చేయాలని ముఖ్యమంత్రికి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క కొత్త నిర్మాణ పనులు చేపట్టలేదని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన చేపట్టిందని కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రజలు నివశిస్తున్న ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, శానిటేషన్ తదితర అభివృద్ధి చేపట్టాలని, జనాలు లేని చోట పనులు చేయడం సరైనది కాదని సూచించారు.



ఢిల్లీ: కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.

## వైద్యరంగంలో మరో మైలురాయి

- అత్యంత క్లిష్టమైన గర్భధారణ చికిత్స
- తల్లి, శిశువులను సురక్షితంగా కాపాడిన మెడికవర్ వైద్యులు



హైదరాబాద్,జూన్11(మనం న్యూస్): వైద్య రంగంలో మరో అరుదైన మైలురాయి నమోదైంది. అత్యంత ప్రమాదకరమైన, సంక్లిష్టమైన పరిస్థితులను అధిగమించి, ఒకేసారి తల్లితో పాటు కవల శిశువుల ప్రాణాలను కాపాడారు హైదరాబాద్‌లోని మెడికవర్ ఉమెన్ చైల్డ్ హాస్పిటల్స్ వైద్యులు. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్, అదుపులో లేని గర్భధారణ,మధుమేహం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న ఓ గర్భిణికి 32 వారాలకే అత్యవసర సిజేరియన్ నిర్వహించి, ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు.

**ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి:**

నాందేడ్‌కు చెందిన 31 ఏళ్ల వై. అల్కా నాగభూషణ్ అనే మహిళ కవల పిల్లలతో 30 వారాల గర్భవతిగా ఉన్న సమయంలో తీవ్రమైన 'అక్యూట్ ప్యాంక్రియాటైటిస్' వ్యాధితో మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. వైద్య శాస్త్రం ప్రకారం.. ఇది ప్రతి 1,000 నుండి 5,000 గర్భధారణల్లో కేవలం ఒకరికి మాత్రమే వచ్చే అత్యంత అరుదైన,ప్రాణాంతకమైన సమస్య. దీనికి తోడు ఆమెకు గర్భధారణ మధుమేహం కూడా అదుపు తప్పడంతో తల్లి, కడుపులోని శిశువుల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లింది.పరిస్థితి తీవ్రతను గమనించిన మెడికవర్ వైద్యులు తక్షణమే స్పందించింది. వేర్వేరు విభాగాల నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక వైద్య బృందాన్ని రంగంలోకి దించింది. ప్రసూతి గైనకాలజీ, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, ఎండోక్రినాలజీ, అనస్థీషియా, నియోనటాలజీ విభాగాల నిపుణులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఆమెకు అత్యున్నత స్థాయి చికిత్స అందించారు.ప్రసూతి గైనకాలజిస్ట్ డా. షాలిని నారాయణ మాట్లాడుతూ, ఇది అత్యంత క్లిష్టమైన కవల గర్భధారణ కేసు అని. సరైన సమయంలో పర్యవేక్షణ, నిపుణుల సమన్వయంతో తల్లి, శిశువులను సురక్షితంగా కాపాడగలిగాం అన్నారు. ప్రస్తుతం తల్లి అల్కా నాగభూషణ్‌తో పాటు కవల శిశువులు ఇద్దరూ పూర్తిగా కోలుకున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా నవ్వుతూ ఇంటికి వెళ్తున్న ఆ కుటుంబ ఆనందానికి అవధులు లేవు. క్లిష్ట సమయాల్లో ముందస్తు నిర్ధారణ, నిపుణులైన వైద్యుల సమన్వయం, అత్యాధునిక మాతృ-శిశు సంరక్షణ మౌలిక వసతులు ఉంటే ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయవచ్చని మెడికవర్ హాస్పిటల్స్ మరోసారి నిరూపించింది.

## అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు

### భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఆధునీకరణ

- తిరుచానూరు ఆలయ క్యూలైన్లను పరిశీలించిన జేఈవో డా. ఎ. శరత్

తిరుపతి రూరల్ జూన్11 మనం న్యూస్: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు కల్పించేందుకు టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ గురువారం ఆలయ క్యూలైన్లను పరిశీలించారు. ఇంజనీరింగ్, ఆలయ అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణంలో గురువారం పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, భక్తులకు క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బ్రాస్ గ్రిల్స్ను పెంచి క్యూలైన్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మంగళవారం, శనివారం రోజుల్లో అధికంగా ఉండే భక్తుల రద్దీతో పాటు ఇతర రోజుల్లో కూడా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.అలాగే తిరుచానూరు ఆలయానికి వచ్చే భక్తులు సులభంగా గుర్తించేలా ప్రధాన ప్రవేశ మార్గాల వద్ద ఆకర్షణీయమైన స్వాగత ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శ్రీ పద్మావతీ అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించడమే టీటీడీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, నరసింహమూర్తి, విజీవో గిరిధర్, ఏవీఎస్వో రాధాకృష్ణ, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంటర్ అడ్వాన్స్‌డ్ పలితాలు విడుదల

- ఒకేషనల్ కోర్సుల ఫలితాలు విడుదల
- సుమారు 3.80 లక్షల మంది పరీక్షలు రాసిన విద్యార్థులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వానస్డ్ సప్లిమెంటరీ పలితాలు గురువారం విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 13 నుంచి 21 వరకు జరిగాయి.

అయితే, ఈ పరీక్షకు సుమారు 3.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ఫలితాలను కూడా ఇంటర్ మీడియట్ బోర్డు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసింది. విడుదల చేసిన పలితాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో చూసకోవచ్చని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్య ద్వారానే సామాజిక సాధికారత

- గురుకుల విద్యలో మరో విప్లవాత్మక అడుగు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ మూడో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో కీలక నిర్ణయాలు



హైదరాబాద్, జూన్ 11(మనం న్యూస్): సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, ప్రపంచ స్థాయి విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధంగా భావిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. గురువారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మూడవ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం అడ్లూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ విద్య, ఉపాధ్యాయ సంక్షేమం, ఉన్నత విద్య అవకాశాల విస్తరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను బోర్డు ఆమోదించింది.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య ద్వారానే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల పిల్లలు ప్రపంచ స్థాయి విద్యను అందుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ఉన్నత విద్య అవకాశాల విస్తరణ, సాంకేతిక విద్య ప్రోత్సాహానికి మరింత ప్రాధాన్యం ఇస్తామని అడ్లూరి స్పష్టం చేశారు.

**కీలక నిర్ణయాలు**

డిగ్రీ కళాశాలల నిర్వహణ కోసం ప్రత్యేక పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేసి,డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు యూజీసీ వేతన స్కేలు అమలుపై సానుకూల నిర్ణయం తీసుకున్నారు.డిగ్రీ కళాశాలలకు న్యాక్ గుర్తింపు సాధించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు, ఉన్నత విద్య కోసం దేశ, విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే ఎస్సీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం అందించేందుకు కమిటి ఆమోదం తెలిపింది. తొమ్మిదవ తరగతి నుంచే నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు మరో తోమ్మిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించా లని, క్రాఫ్ట్ టీచర్లు, ఆర్ట్ టీచర్లను టీజీటీలుగా గుర్తించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేం దుకు 'ఫోన్ మిత్ర' సౌకర్యం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్ ధోత్రే,బోర్డు ఆఫ్ గవర్నర్ కౌన్సెల్ సభ్యులు ప్రొఫెసర్ కాశీం, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి కంభంపాటి శారద, కార్యదర్శి సీతాలక్ష్మి, టీజీఆర్ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ జి. ఉషారాణి, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి అభిలాష అభినవ్, ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, ఓఎస్డీ వై.జె. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నిత్య వెలుగు సినారె!

తెలుగు కవితాకాశానికి
పగలే వెన్నెలను రాసిచ్చిన
'మహాకవి'తా చంద్రుడు!

మాటకు పాటకు
వపువు వాడే వరకు
పట్టాభిషేకం చేసిన కవనశీలి!

సభలో అతనుంటే చాలు
సమయపాలనకు అగ్ర తాంబూలం
సభా సదులకు మృష్టాన్న భోజనం!

పాలనలో శిష్యలాలనలో
అతనే ఇప్పటికీ ఆదర్శం
చెప్పిన పాఠాలన్నీ కంఠోపాఠం!

వెండి తెర మీదే కాదు
కవితా అభిమానుల ఎదలోనూ
నిత్యం వెలిగే కర్పూర దీపం!

అతనే నవరసాల నయాగరా
తెలుగు కవిత చరిత్రకు
ఎన్నడూ వన్నెతరుగని జీవధార!

సినారె అనెడు వర్ణములు మూడే
సాహితీ లోకం ఎదవిచ్చి చూస్తే
విచ్చుకునే వర్ణములు ఏడు!!

( జూన్12 మహాకవి సినారె వర్ధంతి)

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

# రైతన్నకు సాయం కానీ వ్యవసాయం

రాష్ట్రంలో సమృద్ధి గల వర్షపాతం పడడం వల్ల పంట సాగు విస్తీర్ణం పెరిగింది.

వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం ప్రస్తుత యసంగిలో ప్రధాన పంటలైన వరి పంట సగటు సాగు విస్తీర్ణం 52 లక్షల ఎకరాలకు గాను 65 లక్షల విస్తీర్ణంలో సాగు చేశారు. అలాగే మొక్కజొన్న పంట సగటు సాగు విస్తీర్ణం 6 లక్షల ఎకరాలకు గాను 16 లక్షల ఎకరాలు వరకు సాగు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సీజన్లో సుమారు పదముడున్నర లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసింది. అలాగే వరి పంట మే చివరి నాటికి సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. ఈ గణాంకాలు ఘనంగా ఉన్న అన్ని ఖర్చులు పోయి రైతుకు మిగిలేది ఒట్టి చేతులే అన్నది నిజం.

మనిషి జీవన విధానంలో స్వార్థపరమైన చర్యలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. అతివృష్టి అయిన అనావృష్టి అయిన కరువు కాటకలకు వాతావరణంలో మార్పులకు మొదట బలి అయ్యేది వ్యవసాయ రంగమే. రాష్ట్రంలో సుమారు 70 లక్షల పైన కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రైతులు అప్పైన సప్పైన కష్టమైన నష్టమైన భూమిని నమ్మి సాగు చేయడం తప్ప వేరే ప్రత్యామ్నాయం వెదకరు. సాగు భూమితో రైతులకు ఉండే అనుబంధం అటువంటిది. వ్యవసాయానికి రైతు బానిసన్నది నిజం.

సాగు ప్రారంభం నుండి పంట చేతికొచ్చే వరకు క్షేత్రస్థాయిలో పెట్టుబడి ఖర్చులూ గమనిస్తే దుక్కి దున్నడానికి, వరి పంటకు నారు మడి అలికి పొలం దున్నడానికి మరియు విత్తనాలకు సుమారు ఎకరాకు 8 నుండి 10 వేలా దాకా ఖర్చవుతుంది. దున్నిన వెంటనే విత్తనాలు నాటలి కానీ రైతుకు ప్రకృతి విపత్తులు ఒక ఎత్తు అయితే మానవ విపత్తులు మరో ఎత్తు. కొందరు తమ స్వార్థానికి కల్తీ విత్తనాలు తయారుచేసి అమ్ముతున్నారు. దీంతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడవల్సివస్తుంది. వరి నాట్లు వేయడానికి ఎకరాకు 5 వేలా దాకా ఖర్చు అవుతుంది. మొక్క దశలనే పంటకు నీరు అందితే సరే లేదంటే పంట కాలం మొత్తం మొక్కలు బలహీనమవుతాయి. ఇవన్నీ దాటుకొని పెరిగే దశలో కలుపు తీయడానికి కూలీల ఖర్చు, క్రిమి కీటకాలు నివారణ మరియు పూత కోసం మందులను కొనడం పిచికారి కోసం కూలీ ఖర్చులు ఒక పంట కాలంలో ఇలా 3 నుండి 4 సార్లు కలుపు తీత, మందుల పిచికారికి ఒక ఎకరన పది నుండి పన్నెండు వేలా వరకు ఖర్చు వస్తుంది. దీంతో పాటు నెలలో పోషకాలు, నత్రజని, భూసారాన్ని పెంచడానికి చేనును ఎరుపు రంగు నుండి పచ్చటి రంగుకు తీసుకు రావడానికి యూరియా పొటాష్ డి ఎ పి వంటివి నేలకు చల్లడానికి సరాసరిన ఆరు వేలా వరకు ఖర్చు వస్తుంది.

నీటి వసతుల లేని వారు నీటిని సైతం కొని పంటకు పారిస్తుంటారు. వీటితో పాటు విద్యుత్ మోటార్లు, స్టాటర్ల మరమ్మత్తులు, నీటిని పారించే పైపుల ఖర్చులు అదనం. ఇక కోత దశకు వచ్చేసరికి వరి కోతకు గంటకు రెండు నుండి మూడు వేలు, కోసిన ధాన్యాన్ని ఐకేపీ సెంటర్లకు తరలించడానికి ట్రాక్టర్ ట్రిప్పుకు వేయి వరకు, ఐకేపీ సెంటర్లో తేమ శాతం వచ్చే వరకు నిరీక్షణ, అకాల వర్షాల నుండి కాపాడుకోడానికి తాడిపత్రి, పరదాల ఖర్చులు, అనంతరం బార్ధన్ బస్తలకు ఒక్కో బస్తాకు ముప్పై రూపాయలు, హమాలీ ఖర్చులు, తాలు ఉందని బస్తాకు ఒక కిలో అదనపు తూకం, ఇక తూకం అయిన బస్తాల



గోదాములుకు తరలింపులో ప్రభుత్వం ఇచ్చే లారీలు అందుబాటులో లేకుంటే రైతులు ఒక్కో బస్తాకు ముప్పై రూపాయలు చెల్లిస్తూ ప్రైవేటు వాహనాలు పెట్టుకోవడం ఇలా పంట చేతికొచ్చే దశలో ఎకరాకు సుమారు పది వేల వరకు ఖర్చు వస్తుంది. ఇలా మొత్తంగా ఒక ఎకరాన ప్రస్తుతం 35 వేలా నుండి 40 వేలా వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఇంత పెట్టుబడి పెట్టిన ఎకరాకు వచ్చే ఆదాయం 60 నుండి 70 వేలు మాత్రమే. ఇది ప్రధాన పంటలైన పత్తి వరి మొక్కజొన్న సాగుచేస్తే, ఇవికాక కందులు, పెసల్లు, వేరుశనగ లాంటి పప్పు ధాన్యాలు పండిస్తే పంట దిగుబడి సగటున తగ్గుతుంది. వచ్చే ఆధాయంలో ప్రస్తుత పెట్టుబడి తీసేస్తే మిగిలిన దాంట్లో వచ్చే పంట పెట్టుబడికి దాచాలి. లేదంటే అప్పులే శరణ్యం అవుతుంది. ఈ వృత్తాంతంలో రైతు వెల కట్టుకోలేనిది రైతు శ్రమ. పైన వివరించిన పెట్టుబడులలో రైతు శ్రమ మినహాహింపే. ఆరుగాలం కష్టపడి పైరును కంటికి రెప్పల కాపాడుకుంటూ పండగ, పబ్బం, ఆదివారం అని విరామం లేకుండా అసలు సెలవంటూ ఎరుగని రైతు చిందించే శ్రమకు విలువ కడితే అన్ని ఆదాయ వ్యయాలు పోను రైతు శ్రమ దేశానికి ఉచిత పెట్టుబడి అవుతుంది అనడంలో ఆశ్చర్యం లేదు. నేను పంటను పర్యవేక్షిస్తున్నాను ప్రతి రోజు పంట కోసం చెమట చిందిస్తున్నాను పంట కోసం ఆరటపడుతున్నాను అని తనకు తాను రైతు రోజుకి కూలీ కట్టుకుంటే పెదోళ్ళ నుండి ఉన్నల్ల వరకు ఆకలి తీర్చడానికి కంచంలోకి వచ్చే నాలుగు మెతుకులు మరింత ప్రియం అయ్యే అవకాశం ఉంది. పెట్టుబడి పెట్టడం తప్ప తన శ్రమకు ఎప్పుడు విలవకట్టాడు రైతున్న అందుకే సాయం కానీ వ్యవసాయం రైతును రాజును చేయలేక పోతుంది. అదేమిటోగాని రైతు ప్రభుత్వాలు, రైతు పాలకులు, రైతులకు సేవలందించే అధికారులు, ఎరువుల కంపెనీలు, విత్తన కంపెనీలకు ఉన్న స్థిరత్వం రైతుకు లేకపాయే. సాగు మొదలు నుంచి అతివృష్టి, అనావృష్టి, కల్తీ విత్తనాలు, ఎరువుల కొరత, విద్యుత్ సమస్యలు, అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లు, దళారుల సమస్య ఇలా ఒక్కో గండాన్ని దాటి పంటను కాపాడుకునే రైతుకు మిగిలేది శూన్యమే.

- బైరబోయిన వెంకటేశ్వర్లు

# అన్నం అమృతమా... విషమా?



ప్రతి మనిషి జీవనానికి ఆహారం మూలాధారం. నేడు మనం తింటున్న ఆహారం నిజంగా పోషకాహారమా? లేక నెమ్మదిగా శరీరాన్ని కృశింపజేసే విషమా? అనే ప్రశ్న ప్రతి కుటుంబాన్ని వెంటాడుతోంది. కల్తీలు, రసాయన అవశేషాలు, యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం, అపరిశుభ్రత, ప్లాస్టిక్ కాలుష్యం వంటి సమస్యలు ఆహార భద్రతను అత్యంత కీలకమైన ప్రజారోగ్య అంశంగా మార్చేశాయి. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే సురక్షితమైన ఆహారమే మొదటి మెట్టు అని గుర్తు చేసే సందర్భం.

హరిత విప్లవం ద్వారా భారత్ ఆహార కొరతను అధిగమించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారుల్లో ఒకటిగా ఎదిగింది. కానీ ఎక్కువ ఆహారం పండించడంపై చూపిన శ్రద్ధ, నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహారం అందించడంపై చూపలేకపోయింది. నేడు రైతు పండించిన పంట నుంచి వినియోగదారుడి పళ్ళెం వరకు ప్రయాణించే ప్రతి దశలో భద్రతా లోపాలు కనిపిస్తున్నాయి. మనం తినే చికెన్, గుడ్లు, పాలు వంటి ఆహార పదార్థాల్లో యాంటీబయాటిక్స్ అవశేషాలు పెరుగుతున్నాయన్న ఆందోళనలు వైద్య రంగాన్ని కలవరపెడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య నిపుణులు దీన్ని రాబోయే దశాబ్దాల్లో అతిపెద్ద ఆరోగ్య సంక్షోభాల్లో ఒకటిగా హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో పంటలపై విచక్షణారహితంగా వాడుతున్న కలుపు నాశకాలు, పురుగుమందులు కూడా ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. డిజిటల్ యుగంలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలు లక్షలాది కుటుంబాల దైనందిన జీవితంలో భాగమయ్యాయి.

కానీ మనం ఆర్డర్ చేస్తున్న ఆహారం ఏ వంట గదిలో తయారవుతోంది? అక్కడ పరిశుభ్రత ప్రమాణాలు ఎలా ఉన్నాయి? వాడుతున్న నూనెలు ఎన్ని సార్లు తిరిగి ఉపయోగిస్తున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చాలా సందర్భాల్లో ఉండవు.

మన దేశంలో వేడి ఆహారాన్ని నేరుగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేయడం సాధారణ



దృశ్యం. వేడి తగలగానే ప్లాస్టిక్‌లోని కొన్ని రసాయనాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో ఇవి హార్మోన్ల అసమతుల్యత, సంతానోత్పత్తి సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లకు కూడా కారణమయ్యే అవకాశాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. భారతదేశంలో కోట్లాది మంది ప్రజలు రోజూ వీధి ఆహారంపై ఆధారపడుతున్నారు. అయితే పరిశుభ్రమైన నీరు, సరైన నిల్వ విధానాలు, శుభ్రత ప్రమాణాలు లేకపోవడం వల్ల అనేక అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. టైఫాయిడ్, కలరా, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధులకు కలుషిత ఆహారం, నీరే ప్రధాన కారణాలు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కలుషిత ఆహారం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారు. భారతదేశంలో చిన్నారుల్లో పోషకాహార లోపానికి కేవలం ఆహార కొరత మాత్రమే కారణం కాదు. తరచూ వచ్చే విరేచనాలు, ఆహార సంబంధిత ఇన్ఫెక్షన్లు కూడా శరీరం పోషకాలను గ్రహించకుండా అడ్డుకుం టున్నాయి. అంటే సురక్షితం కాని ఆహారం, పోషకాహారాన్ని కూడా నిరుపయోగంగా మార్చేస్తోంది.

ఈ సమస్యకు పరిష్కారం ఒకే శాఖ లేదా ఒకే సంస్థ చేతిలో లేదు. ప్రభుత్వం, ఆహార నియంత్రణ సంస్థలు కఠిన తనిఖీలు, ఆధునిక ప్రయోగశాలలు, వేగవంతమైన శిక్షా విధానాలను అమలు చేయాలి. రైతాంగం, పశుసంవర్ధక రంగం రసాయనాలు, యాంటీబయాటిక్స్‌పై ఆధారపడే విధానాలను తగ్గించాలి.

భారతదేశం ఆర్థికంగా ఎంత అభివృద్ధి చెందినా, ప్రజల ఆరోగ్యం క్షీణిస్తే ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. కలుషిత ఆహారం వల్ల దేశ ఉత్పాదకత, వైద్య వ్యయం, మానవ వనరుల నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆహార భద్రత అనేది ప్రయోగశాలల్లో జరిగే పరీక్షలకే పరిమితమైన అంశం కాదు. అది పొలంలో విత్తనం నాటిన క్షణం నుంచి మొదలై, పంట కోత, నిల్వ, రవాణా, ప్రాసెసింగ్, మార్కెటింగ్, వంటగది మీదుగా మన పళ్ళెం వరకు సాగే నిరంతర బాధ్యత. సురక్షితమైన ఆహారం లేకుండా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం కాదు. ఆరోగ్యవంతమైన సమాజం లేకుండా అభివృద్ధి చెందిన భారతదేశం అసాధ్యం. 'సురక్షిత ఆహారం ప్రతి పౌరుడి హక్కు... దానిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.'

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

# యువతపై సోషల్ మీడియా ప్రభావం

21వ శతాబ్దంలో సమాచార సాంకేతిక రంగం విపరీతంగా అభివృద్ధి చెందడంతో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. ఈ మార్పులో సోషల్ మీడియా అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి సంప్రదాయ మాధ్యమాలపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ నేడు మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతుందో క్షణాల్లో తెలుసుకునే అవకాశం కలిగింది. ఫేస్బుక్, వాట్సాప్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు ప్రజల జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే సోషల్ మీడియా సమాజానికి వరమా, శాపమా అనే చర్చ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఇది సామాజిక చైతన్యాన్ని పెంచుతున్నదా? లేక సమాజంలో విభేదాలు, విద్వేషాలు పెంచడానికి కారణమవుతున్నదా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.



సోషల్ మీడియా సామాజిక చైతన్యానికి ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. గతంలో ప్రజలకు తెలియని అనేక సామాజిక సమస్యలు ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. ఎక్కడైనా అన్యాయం జరిగినా, అవినీతి జరిగినా, ప్రజల హక్కులు ఉల్లంఘించబడినా క్షణాల్లో లక్షల మందికి సమాచారం చేరుతోంది. దీంతో ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి సోషల్ మీడియా మంచి వేదికగా నిలిచింది. ఒకప్పుడు ప్రధాన మీడియా ప్రాధాన్యం ఇవ్వని అంశాలు కూడా సోషల్ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో కూడా సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, ప్రజా సమస్యలపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. అనేక సందర్భాల్లో ప్రజల స్పందనను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు నిర్ణయాలు మార్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సామాజిక ఉద్యమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాలు సోషల్ మీడియా ద్వారా మరింత బలపడుతున్నాయి. ఒక ప్రాంతంలో ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా ప్రధాన కారణంగా నిలుస్తోంది.

సోషల్ మీడియాకు మరో ముఖం కూడా ఉంది. అదే దుర్వినియోగం. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, వదంతులు సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఏ సమాచారం నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోవడం సాధారణ ప్రజలకు కష్టంగా మారుతోంది. కొందరు వ్యక్తులు, సంస్థలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్నారు. దీనివల్ల సమాజంలో గందరగోళం ఏర్పడటమే కాకుండా కొన్నిసార్లు హింసాత్మక సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడంలో కూడా సోషల్ మీడియా కొంతమేర ప్రతికూల పాత్ర పోషిస్తోంది. ద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు సమాజంలో సామరస్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఒక చిన్న సంఘటనను వక్రీకరించి ప్రచారం చేయడం వల్ల పెద్ద ఎత్తున ఉద్రిక్తతలు ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా యువతపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. సమాచారాన్ని పొందడానికి ఉపయోగపడుతున్నప్పటికీ, అధిక వినియోగం వ్యసనంగా మారుతోంది. గంటల తరబడి మొబైల్ ఫోన్లలో గడపడం వల్ల చదువులు, ఉద్యోగాలు, కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకొని నిరాశకు గురయ్యే పరిస్థితులు కూడా పెరుగుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలకు కూడా సోషల్ మీడియా అధిక వినియోగం ఒక కారణంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు.


రాజకీయ రంగంలో సోషల్ మీడియా ప్రభావం అత్యంత ఎక్కువగా ఉంది. రాజకీయ పార్టీలు ప్రజలకు చేరువ కావడానికి దీనిని విస్తృతంగా వినియోగిస్తున్నాయి. అయితే కొన్నిసార్లు వాస్తవ చర్చల కంటే ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు, ద్వేషపూరిత వ్యాఖ్యలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో విభేదాలను శత్రుత్వంగా మార్చే ధోరణి పెరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకు కూడా సవాలుగా మారుతోంది. సోషల్ మీడియా మంచిదా చెడ్డదా అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. అది పూర్తిగా దానిని ఉపయోగించే వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. కత్తితో పండును కోయవచ్చు, అదే కత్తితో హాని కూడా చేయవచ్చు. అలాగే సోషల్ మీడియా ద్వారా జ్ఞానాన్ని పంచవచ్చు, సమాజాన్ని చైతన్యవంతం చేయవచ్చు. అదే సమయంలో అసత్యాలు, విద్వేషాలు కూడా వ్యాప్తి చేయవచ్చు. కాబట్టి సమస్య వేదికలో కాదు, దాని వినియోగంలో ఉంది.

ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం అత్యంత అవసరం. ఏ సమాచారాన్ని అయినా నమ్మే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. ద్వేషపూరిత ప్రచారాలకు దూరంగా ఉండాలి. సమాజంలో ఐక్యత, సామరస్యం, అవగాహన పెంచే సందేశాలను ప్రోత్సహించాలి. ముఖ్యంగా యువత సోషల్ మీడియాను జ్ఞానార్జన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక చైతన్యం కోసం ఉపయోగించాలి.

మొత్తంగా చూస్తే సోషల్ మీడియా ఒక శక్తివంతమైన సాధనం. అది సామాజిక చైతన్యానికి గొప్ప వేదికగా మారగలదు. అదే సమయంలో దుర్వినియోగం చేస్తే సమాజంలో విభేదాలు, విద్వేషాలు పెంచే ప్రమాదం కూడా ఉంది. సోషల్ మీడియాను బాధ్యతతో, వివేకంతో వినియోగించినప్పుడే అది సమాజ పురోగతికి దోహదపడే సాధనంగా నిలుస్తుంది.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్
9866170384

# విశ్వ మానవుడు సినారె



డా. సి. నారాయణరెడ్డి అవిభక్త కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజిపేటలో 29.7.31 నాడు జన్మించారు. 1948లో కరీంనగర్ లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. సినారెలో సహజంగా సృజనాత్మకశక్తి, లయాత్మకత, చిన్ననాటి నుండే ఉన్నాయి. చిన్నప్పటినుండి మట్టిలో పుట్టిన జానపదగీతాలను ఆలపించే వారు. హరికథలు, బుర్రకథలంటే చెవి కోసుకునే వారు. హరికథా కథనాన్ని ఆశువుగా, సంగీతాత్మకంగా అనుకరించే వారు. వేములవాడ వాస్తవ్యులు చౌటి నరసయ్య హరికథా గానం ఆయనకు ఛందస్సు పట్ల మక్కువ, అభిరుచి కలగడానికి ప్రేరకమైంది. ఆరేడు తరగతుల నుండే కవితలు వ్రాయడం మొదలు పెట్టారు. ఛందస్సంటే తెలియని దశ అది. ఏడవ తరగతిలో సీస పద్యమని తెలియని దశలో 'ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో పొట్ట కోసర మెటో పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం వ్రాస్తే - అది సీసపద్యమని తెలిసి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను తెలిపారు దూపాటి వేంకట రమణాచార్యులు. తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు వ్రాసిన-'మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో' అనేది సినారె తొలి గేయం. పదవ తరగతిలో ఉన్నప్పుడు -'వెన్నవంటి మనసున్నవానికి, అన్నమేమొ కరువాయె/ఉన్నవాని కింతన్న వీడుదా/మన్న గుండె లేదాయె' వంటి పాటలు రాశారు. కరీంనగర్ విద్యార్థి మహాసభలో - 'విజయంబు సాధించినావా - విద్యార్థి, నీ వీర భావాలు నింగి వ్యాపించగా; నీ వైరి చిత్తాల నేల కంపించగా' వంటి గేయాలు రచించి పాడారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉర్దూ మాధ్యమం లోనే 'బి.ఏ.' (1952) చదివారు. బి.ఏ. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక - 'శోభ'కు సంపాదకత్వం నిర్వహించారు. 1954లో ఎం.ఏ. పట్టా పొందారు. ఎం.ఏ. పూర్తి చేసి, 1954-55లో కొంతకాలం, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం ఆరంభించారు. 1958-59లో నిజాం కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేస్తునే 1957 నుండి 1962 వరకు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సూచనను అనుసరించి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో - 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు' అనే పరిశోధనకు 1962లో పిహెచ్.డి. పట్టాను పొందారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆ తరువాత 1997 జులై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేశారు. రాజ్యసభ సభ్యునిగా 27.8.1997 నుండి 26.8.2003 వరకు కొనసాగారు. దక్షిణ భారతం నుండి రాజ్యసభ సభ్యులుగా నియమింప బడిన ప్రథమకవి ఆయనే కావడం విశేషం. 'నవ్వని పువ్వు' (1953) మొదలుకొని, - 'అలలెత్తే అడుగులు' (2013), నింగికెగిరే చెట్లు (2014) వరకు 18 ప్రక్రియలలో సుమారు 90 గ్రంథాలు రచించారు. మాకందా'లను అందించడంలో, వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో 'ప్ర'పంచ పదులను నిర్మించడంలో - తెలుగు గజళ్ళకు మానవీయ దృక్పథాన్ని అనుసంధించడంలో, ప్రతీకాత్మకంగా వచన కవితలో 'ఇతిహాస కావ్యాన్ని'-'విశ్వంభర'ను నిర్మించడంలో, 'మట్టీ - మనిషీ - ఆకాశం' వంటి వచన కవితా 'కావ్యేతి హాసాన్ని' సంవిధాన సంపన్నంగా సృజించడంలో, 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' వంటి స్వీయ చలన చిత్ర గీతికా వ్యాఖ్యా రచనలో, ఋతు వర్ణనలను జీవితానికి సమన్వయిస్తూ 'ఋతుచక్రం' వంటి కావ్య రచనలో, గేయ కావ్యాలకు పద్య కావ్య ప్రౌఢిని, ప్రామాణికతనూ సంతరించడంలో, శతాధిక నూతన పదబంధ కల్పనంలో మహాకవి సినారె ప్రయోగశీలం ప్రస్ఫుట మవుతుంది. 1962లో ఎన్టీ రామారావు ఆహ్వానంపై చలనచిత్ర రంగంలో ప్రవేశించారు. తొలి సినీ గీతం-'నన్ను దోచుకొందువటే'. 'గులేబకావళి కథ' చిత్రంలోని పాటలన్నీ ఆయన వ్రాసినవే. ఆనాటి 'గులేబకావళి కథ' చిత్రం నుండి ఇటీవలి 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు, మూడున్నర వేలకు పైగా సినిమా పాటలు రచించి, చలన చిత్ర జగత్తులో తమ ప్రత్యేక స్థానాన్ని భద్రపరచు కున్నారు. 'ఏకవీర', 'అక్బర్ సలీమ్ అనార్కలీ' అనే రెండు చిత్రాలకు సంభాషణలు కూడా రచించారు. తెలుగువారే కాక శంకర్ జైకిషన్, సి. రామచంద్ర, ఓ.పి. నయ్యర్, రవీంద్ర జైన్, ఉషా ఖన్నా, బప్పీ లహరి - వంటి ప్రముఖ హిందీ సంగీత దర్శకులు 50 మందికి పైగా కలిసి పనిచేశారు. ఘంటసాల గళం నుండి సినారె గీతాలధికంగా జాలు వారాయి. మూగజీవులు, శభాష్ పాపన్న, మొగుడా పెళ్ళామా, తూర్పు పడమర చిత్రాలలో కావ్య సంబంధమైన పాత్రలలో ఆయన కనిపించారు. సి.నా.రె అనే మూడక్షరాలు తెలుగు, ఉర్దూ, సంస్కృతం మూడు భాషల సంగమం. సాహిత్య లోకం, సినీ లోకం, అధ్యాపక లోకం అనే మూడు లోకాల మిశ్రమం. నారాయణ రెడ్డి, హైదరాబాద్ లోని కేర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ 2017, జూన్ 12 సోమవారం రోజున ఉదయం ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494



- రైతుల ఖాతాల్లో రూ.1,018 కోట్లు
- చివరి గింజ వరకు కొనుగోలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**పెద్దపల్లి, జూన్ 11 (మనం ప్రతినిధి):** రబీ సీజన్లో పెద్దపల్లి జిల్లాలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 334 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 4.29 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ ధాన్యానికి సంబంధించిన రూ.1,018.62 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సుమారు 29 వేల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 5,800 మంది రైతుల నుంచి 26,443 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా మార్కెట్ యార్డుల ద్వారా కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినా, రంగు మారినా రైతులు నష్టపోకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని కొనుగోళ్లు నిర్వహించిందని స్పష్టం చేశారు. 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసేందుకు పెద్దపల్లి నియోజకవర్గంలో 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎలిగేడు మండలం లాలపల్లిలో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. అలాగే ఓదెల, శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో కొత్త గోదాముల నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. విపక్షాల విమర్శలపై స్పందన ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీల విమర్శలను ఆయన ఖండించారు. పెద్దపల్లి ప్రాంతంలో సాగునీరు ప్రధానంగా ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారానే అందిందని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎంత మేర ప్రయోజనం కలిగిందో ప్రజలకు వివరించాలని విపక్షాలకు సవాల్ విసిరారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. అధికారులకు అభినందనలు ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా కలెక్టర్, ఐకేపీ మహిళా సంఘాలు, వ్యవసాయ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జూన్ 11(మనం ప్రతినిధి):** జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఈరోజు మల్యాల పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు.అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ..... ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పి వెంట మల్యాల సి.ఐ రవి, ఎస్.ఐ నరేష్ సిబ్బంది ఉన్నారు.

# నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పి

## గంజాయి నిర్మూలనే లక్ష్యం.. గ్రామాల వారీగా ప్రత్యేక నిఘా

## నేర నియంత్రణలో రాజీపడొద్దు పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

## ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్



**ములుగు, జూన్ 11, మనం ప్రతినిధి:** ములుగు జిల్లా ఎస్ పి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రధానంగా గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణపై ఎస్ పి చర్చించారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో బలమైన సమాచార వ్యవస్థ (ఇన్ఫార్మర్ నెట్వర్క్) ఏర్పాటు చేయాలని, గంజాయి సరఫరా గొలుసును (సప్లై చైన్) పూర్తిగా ఛేదించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి గ్రామంలో గంజాయి సంబంధిత సమాచారాన్ని సేకరించేందుకు సమాచారా అందించే సరి అయిన వ్యక్తులను గుర్తించి, వారి ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి రవాణాను అడ్డుకోవాలని, యువత గంజాయి వినియోగానికి అలవాటు పడుతున్న ప్రాంతాలను (హాట్స్పాట్స్) గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ములుగు జిల్లా పోలీసు శాఖ యొక్క అంతిమ లక్ష్యం గంజాయి నిర్మూలనతో పాటు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటమేనని స్పష్టం చేశారు. ఇవే కాకుండా సమావేశంలో అక్రమ మద్యం (ఐడీ లిక్కర్), బ్లాక్ జాగరీ(నల్ల బెల్లం ) తయారీ మరియు రవాణా నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరితగతిన విచారణ పూర్తి చేయడం, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. మాదకద్రవ్యాలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సహకరించాలని, సమాచారం అందించిన వారికీ ప్రభుత్వం తరపున నగదు బహుమతి తో పాటు వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. రానున్నది వర్షాకాలం అయినందున తగు విధమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఏ ఎస్ పి ఏటూరునాగారం మనన్ బట్ ఐ పి ఎస్, అదనపు ఎస్ పి సదానందం,డి ఎస్ పి ములుగు రవీందర్, డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్, జిల్లా సి ఐ మరియు ఎస్ ఐ లు పాల్గొన్నారు.

# చివరి దశ ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, జూన్ 11(మనం ప్రతినిధి):** జిల్లాలో చివరి దశలో ఉన్న వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా బీర్ పూర్ మండల కేంద్రం, నరసింహుల పల్లి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసి వెను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. వర్షాలకు కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్.డి.వో మధుసూదన్, తహసిల్దార్, ఎంపిడివో, ఎంపివో, సివిల్ సప్లై అధికారులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్‌కు కృతజ్ఞతలు



**జగిత్యాల జూన్ 11(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా వర్కింగ్ జర్నలిస్టులకు 2026 - 28 సంవత్సరాల కాలపరిమితిగాను జారీ చేయనున్న అక్రిడిటేషన్ కార్డుల జారీకి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుల సూచన మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ (జిల్లా కలెక్టర్) కన్వీనర్(డి పి ఆర్ ఓ) లకు తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ద్యావర సంజీవ రాజు కృతజ్ఞతలు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో నిర్విరామంగా కృషి చేస్తుండడం హర్షణీయం. ఇలాగే మరికొంత సమయం కేటాయించి సభ్యులు సాధ్యమైనంత త్వరగా జిల్లా జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు అందేలా కలిసికట్టుగా పని చేయాలని సంజీవరాజు ఆకాంక్షించారు.

# హుస్నాబాద్ బస్ స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- వర్షాకాలంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు



**హుస్నాబాద్ జూన్ 11 మనం న్యూస్** హుస్నాబాద్ బస్ స్టేషన్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి హుస్నాబాద్ బస్ స్టేషన్ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్లోని ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన మంత్రి, బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల సమయంలో వరద ప్రభావంతో బస్ స్టేషన్లో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న నాలాను ప్రధాన డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేసేలా అండర్గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీర్లు, ఆర్టీసీ అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చేసి ప్రయాణికుల కు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రజలు వర్షాకాలంలో బస్ స్టేషన్ సమస్యలపై తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆర్టీసీ ఎండీ, అధికారులతో కలిసి పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. రోజుకు సుమారు 35 వేల మంది ప్రయాణికులు ఈ బస్ స్టేషన్ను వినియోగిస్తున్నారని, రెవెన్యూ పరంగా రాష్ట్రంలో ప్రముఖ బస్ స్టేషన్లలో ఇది ఒకటని చెప్పారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు, పర్యాటక రంగం, మెడికల్ కళాశాలలు, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతోందన్నారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్లేన్ రహదారులతో అనుసంధానం కలిగిన హుస్నాబాద్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాలతో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా సమర్థవంతమైన ప్రణాళికలతో పనులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ, హుస్నాబాద్ బస్ స్టేషన్లో ప్రధాన సమస్య వర్షాకాలంలో నీరు చేరడమేనని అన్నారు. మంత్రి సూచనల మేరకు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఖాళీ స్థలాలు, వ్యాపార వర్గాల సహకారం లభిస్తే బస్ స్టేషన్ను ఆధునికీకరించి, పెద్ద షాపింగ్ మాల్ను తలపించే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రెవెన్యూ పరంగా అత్యధిక ఆదాయం వచ్చే ఏ-క్లాస్ కమర్షియల్ బస్ స్టేషన్లలో హుస్నాబాద్ ఒకటని పేర్కొన్న ఆయన, రోజుకు 35 వేల మందికి పైగా ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బస్ స్టేషన్ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్పర్సన్ చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో పెన్షనర్లకు సత్వర సేవలు అందిస్తాం

- జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.పద్మ



**జగిత్యాల జూన్ 11(మనం న్యూస్):** జిల్లా లోని పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సత్వర సేవలు అందిస్తామని జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారిణి ఎస్.పద్మ అన్నారు. జిల్లా ట్రెజరీ అధికారిణిగా ఎస్.పద్మ పదవీ భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్, మండలాల పెన్షనర్ల, సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పుష్ప గుచ్చాలు, సంఘాల మెమొంటోలు అందించి ఆమెను పట్టు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారి పద్మ మాట్లాడుతూ గతం లో టీఎన్జీవో, రెవిన్యూ ఉద్యోగుల నేతగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ప్రస్తుతం పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షులుగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్ ను, వారి సంఘాల ప్రతినిధులను అభినందించారు. అనంతరం పెన్షనర్ల, సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గతంలో జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారిణి గా విశిష్ట సేవలు అందించిన పద్మ నే మళ్ళీ జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారిణిగా భాధ్యత లు స్వీకరించడంతో జిల్లాలోని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు,పెన్షనర్ల కు త్వరితగతిన పనులు జరుగుతాయన్నారు.ఏ. టి. వో. ఎస్. మధు కుమార్, ఎస్. టి. వో. లావణ్య, అసిస్టెంట్ రవి లు ఉద్యోగులకు, పెన్షనర్ల కు విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, ఏటివో ఎస్. మధు కుమార్, ఎస్టీవో లావణ్య, అసిస్టెంట్ రవి,, సంఘాల నాయకులు బొల్లం విజయ్, వెల్ముల ప్రకాష్ రావు, గౌరిశెట్టి విశ్వనాథం,కే.సత్యానారాయణ,ఎం. డి. యాకూబ్,చంద్ర ప్రకాష్,సయ్యద్ యూసుఫ్,,పబ్బా శివానందం,కుందేళ్ల మురళి, బి.రాజేశ్వర్,, ఎం.డి.ఎక్బల్, కండ్లె గంగాధర్, దుబ్బేశం, బత్తుల శంకర్, వేణు గోపాల్, వజీర్,బొబ్బాటి కరుణ, అరిగెల విజయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# నేడు రామచంద్రపూర్‌లో ప్రజా దర్బార్



- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు, జూన్ 11, మనం ప్రతినిధి:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలోని రైతు వేదిక లో గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 8:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మల్లంపల్లి మండలం లోని గుర్తుర్ తండా, కొడిశలకుంట, ముద్దనూరు తండా, రామచంద్రపూర్, భూపాల్ నగర్, శివ తండ గ్రామ పంచాయతీల పరిధి గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

- జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**సిద్దిపేట రిపోర్టర్, జూన్11 మనం న్యూస్** భూంపల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ లో దుబ్బాక నియోజకవర్గంలోనీ మండలాల సంబంధించి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/శాదిముబారక్ చెక్కుల పంపిణీ చేసిన రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.దుబ్బాక నియోజకవర్గం సంబంధించి దుబ్బాక, మీరుదొడ్డి, రాయపోల్, తోగుట, దౌల్తాబాద్, అక్బర్ పేట భూంపల్లి మండలాలకు 594 లబ్ధిదారులకు 5కోట్ల 94 లక్షల 68వేల 904 రూపాయల కళ్యాణ లక్ష్మీ శాదిముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.... మా ప్రభుత్వం తెలిపిన 6 గ్యారెంటీ లను అమలుకు చేస్తుందని తెలిపారు. పేద వాళ్లకు ఒక ఇల్లు ఉండాలని ఆనాడు ఇందిరా గాంధీ చేపట్టిన గొప్ప కార్యక్రమం సొంతింటి కళా నెరవేర్చడానికి జిల్లాలో దాదాపు 10వేల ఇండ్లు మంజూరు చెయ్యగా, 80 శాతం గ్రౌండింగ్ అయ్యాయని, 5వేలు ఇండ్లు స్లాప్ లు పడ్డాయని నిర్మాణం వేగంగా కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఈ సంవత్సరం కూడా ఇండ్లు శాంక్షన్ చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలిపారు. ఇల్లు కట్టకున్నాక ఇంటి సభ్యుల సౌలభ్యం కోసం కరెంట్ కసం 200 యూనిట్లు గల లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఇప్పటివరకు 158 కోట్ల రూపాయలు డిస్కౌంట్ విద్యుత్ శాఖకు ప్రభుత్వం కట్టడం జరిగింది. మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కోసం జిల్లాలో ప్రయాణించిన మహిళలకు గాను 300 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 45వేల పైగా మంజూరుతో పాటు కుటుంబ సభ్యుల చేరికలు సైతం చేశామని, అలాగే ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లు విద్యార్థులకు మంచి నైపుణ్యాలు తో ఉపాధి అందించడం జరుగుతుంది. రాష్ట్రం లో 56 కొత్త అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 4వేల కోట్ల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను సౌకర్యాలు మెరుగుపరుస్తూ ఒక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అందించి, రాష్ట్రంలోనే కాకుండా బయటి దేశాలకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కోసం మీ యొక్క స్కిల్, భాష ప్రతిదీ నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సీజన్ లో వచ్చే దానికంటే 30 శాతం వరి ధాన్యం అధికంగా పండడం మూలంగా కొనుగోలు జాప్యం జరిగిందని ఎవ్వరు కూడా అధైర్య పడవద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యూరియా, డిఏపి కొరత లేదని అధునాతన యాప్ ద్వారా కొనుగోలు సులభంగా చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోడానికి సిద్ధంగా ఉందని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలోనే గొప్ప కార్యక్రమం కళ్యాణ లక్ష్మీ శాదిముబారక్ చెక్కుల పంపిణీ దీనివల్ల లక్షలాది మందికి లబ్ది పొందుతున్నారు. మల్లన్న సాగర్ లో మెయిన్ కెనాల్ పూర్తి, సబ్ కెనాల్ సంబంధించి భూ సేకరణకు సంబంధించిన బకాయిలను విడుదల చెయ్యాలని, దుబ్బాక నియోజకవర్గం లో గో-డౌన్ నిర్మించుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ 27 ఎకరాలు కేటాయించామని వెంటనే శాంక్షన్ చేసి పనులు ప్రారంభించాలని మంత్రి నీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం, మున్సిపల్ చైర్మన్ శ్రీ రామ్ సంగీత రవీందర్, ఆర్డీఓ సదానందం, ఆయా మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై మంత్రి సానుకూల స్పందన



**గజ్వేలు జూన్ 11 మనం న్యూస్:** కొండపోచమ్మ సాగర్ మరియు మల్లన్న సాగర్ ప్రాజెక్టుల భూనిర్వాసితుల దీర్ఘకాలిక సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. గురువారం రోజున నిర్వాసితుల ప్రతినిధులు మంత్రిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో నిర్వాసితులు ప్రధానంగా అర్హులైన నిర్వాసితులందరికీ తక్షణమే ఇండ్ల స్థలాల (ప్లాట్ల) కేటాయింపు పూర్తి చేయాలని, ప్రాజెక్టుల నోటిఫికేషన్ సమయానికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు రావలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని వెంటనే విడుదల చేయాలని, ఒంటరి మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ మరియు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి, వారికి ప్రాధాన్యత క్రమంలో న్యాయం చేయాలని కోరడం జరిగింది. నిర్వాసితుల సమస్యలను ఓపికగా విన్న మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించారు. సమావేశం జరుగుతుండగానే జిల్లా కలెక్టర్కు ఫోన్ చేసి మాట్లాడారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ భూనిర్వాసితుల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీలు మరియు ప్లాట్లు అందేలా వేగంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వాసితుల పక్షాన ఉంటుందని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని ఈ సందర్భంగా మంత్రి నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందన పట్ల భూనిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ ద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, మామిడాల గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య, ఉమ్మారెడ్డి, బాల్ నర్సు, రామాచారి, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో ములుగు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

**వర్షాకాల అత్యవసర పరిస్థితులకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలి**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు, జూన్ 11, మనం ప్రతినిధిః** వైద్య సేవల్లో ములుగు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, వర్షాకాల అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైద్యశాఖ ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్గా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు నిర్వహించిన సమావేశానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల విస్తరణ, వర్షాకాల ఆరోగ్య సన్నద్ధతపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, మందుల లభ్యత, అత్యవసర సేవలు, రోగులకు సౌకర్యాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ములుగు జిల్లాను ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ, క్షేత్రస్థాయి మానిటరింగ్తో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని, ఇదే స్ఫూర్తితో వైద్యరంగంలోనూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు. విద్యారంగంలో జిల్లాకు ఇప్పటికే విశిష్ట ఫలితాలు వచ్చాయని గుర్తు చేస్తూ, ఆరోగ్యరంగంలోనూ నాణ్యమైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, ప్రజాసేవలో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వర్షాకాలంలో ఎదురయ్యే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నివారణ, అత్యవసర వైద్య సేవలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గర్భిణీలు, డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులు, ఉబ్బసం, గుండె, మూత్రపిండాలు తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో వాగులు, వంకలు దాటి ఆసుపత్రులకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, అటువంటి రోగుల వివరాలను ముందుగానే సేకరించి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు, అత్యవసర పరికరాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్యశాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అభివృద్ధి పనులు, సిబ్బంది కేటాయింపు, నిర్మాణ పనులు తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మెగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, డీఎంహెచ్వో గోపాలరావు, వైద్యాధికారులు, మున్సిపాలిటీ కమిషనర్, ఇండియన్ రెడ్క్రాస్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీపీడీపీ ప్రణాళికలు వేగవంతం చేయాలి

- ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ, వర్షాకాల సన్నద్ధతపై కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్ష
- గ్రామా అవసరాలు, ప్రజ ప్రాధాన్యతల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి
- చేయూత పథకంలో జాప్యం లేకుండా అర్హులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశం



**కామారెడ్డి, జూన్ 11 (మనంప్రతినిధి):** గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026-27 రూపకల్పన, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పూరి గుడిసెల గుర్తింపు, ఉపాధి హామీ పథకం ద్వారా గృహ నిర్మాణ అంచనాలు, వనమహోత్సవం, ఎన్ఎఫ్బీఎస్, చేయూత పథకాల అమలు, వర్షాకాల సన్నద్ధత, ఘన వ్యర్థాల నిర్వహణ, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థ వినియోగం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జీపీడీపీ ప్రణాళికలు సమగ్రంగా రూపొందించాలి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో గ్రామాల అవసరాలు, స్థానిక వనరులు, ప్రజల ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించి తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, పచ్చదనం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లకు పూరి గుడిసెల గుర్తింపు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన నిరుపేదలకు గృహాలు మంజూరు చేసేందుకు గ్రామాల్లో ఉన్న పూరి గుడిసెలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభల ద్వారా అర్హులైన కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ ద్వారా గృహ నిర్మాణ అంచనాలు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అవసరమైన అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో సాంకేతిక అనుమతులు, అంచనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో క్షేత్ర పరిశీలనలు నిర్వహించి నిర్మాణ అవసరాలకు అనుగుణంగా అంచనాలు రూపొందించాలని తెలిపారు. వనమహోత్సవ ఏర్పాట్లపై దృష్టి. జిల్లాలో నిర్వహించనున్న వనమహోత్సవ కార్యక్రమాల కోసం అవసరమైన అంచనాలను ముందస్తుగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కల నాటడం, సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని సూచించారు. ఎన్ఎఫ్బీఎస్, చేయూత అమలు వేగవంతం. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ప్రయోజనాలు అందించాలని సూచించారు. చేయూత పథకం అమలులోనూ ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకం ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతకు ప్రాధాన్యం. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా. గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటి నుంచి చెత్తను ప్రతిరోజూ సేకరించి డంపింగ్ యార్డులకు తరలించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల లక్ష్యంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వినియోగం. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వ్యవస్థ వినియోగంపై పూర్తి అవగాహనతో నిర్దేశిత మార్గదర్శకాల మేరకు అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (ఇన్చార్జి) ఎన్వీ గిరి, పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, డీపీఓ మురళి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, జడ్పీ సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బదిలీల కోసం వెబ్ ఆప్షన్లు కల్పించాలి



- మంత్రి దామోదరకు వినతి

**హైదరాబాద్, జూన్ 11(మనంన్యూస్):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డాక్టర్స్ ఫోరం అధ్యక్షులు డా. కత్తి జనార్ధన్ ఆధ్వర్యంలో, వైద్యారోగ్య శాఖలోని వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల బృందం గౌరవ వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీల కోసం వెబ్ ఆప్షన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా స్పౌజ్ కేసులు, అనారోగ్య కారణాలు, వితంతువుల అంశాలకు సంబంధించిన అసంపూర్తిగా ఉన్న బదిలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రి ప్రతినిధుల వినతులను సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డాక్టర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు డా .వంశీ డా. వెంకట్ యాదవ్, డా.అభిరామ్ , డ్రగ్ ఇన్స్పెక్టర్స్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బాలకృష్ణ ,ఆయుష్ ఫోరం అధ్యక్షులు డా.రవి కుమార్ ,నర్సింగ్ ఫోరమ్ అధ్యక్షులు సుజాత పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి బిజెపి వెన్నెముక

- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై దుష్ప్రచారం ప్రతిపక్షాలు మానుకోవాలి
- హైదరాబాద్లో రోహింగ్యాలు ఓటర్లుగా నమోదుకు ప్రయత్నాలు
- తెలంగాణ బిల్లుపై మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు లేదు
- ఎన్. రామచంద్రరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు



**సిద్దిపేట, జూన్ 11మనం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు వక్రీకరించడం సరికాదన్నారు. సిద్దిపేట జిల్లా మాత్ పల్లి ప్రైవేట్ రిసార్ట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచంద్ర రావు ప్రసంగించారు. 1952 నుంచి 2022 వరకు దేశవ్యాప్తంగా పది సార్లు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిర్వహించబడింది న్నారు. ఓటరు జాబితాలో చనిపోయినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారినవారి పేర్లు, నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఉన్న ఓటర్ల నమోదులను తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యగా ఆయన పేర్కొన్నారు. దేశంలోని పలు నగరాల మాదిరిగానే హైదరాబాద్లో కూడా అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు ఓటర్లుగా నమోదు కావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయన్నారు. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా ఇదే విధమైన ఓటరు జాబితా సవరణలు జరిగాయని, అక్కడ బీజేపీ అధికారంలో లేకపోయినా ఈ ప్రక్రియ కొనసాగిందని రామచంద్ర రావు గుర్తు చేశారు. తెలంగాణలో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే అయినప్పటికీ బీజేపీపై ఆరోపణలు చేయడం రాజకీయ దివాళాకోరుతనమని విమర్శించారు.

**ఎన్నికల ప్రక్రియ పై ప్రతిపక్షాలను ద్వంద వైఖరి....**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల వ్యవస్థపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని రామచంద్ర రావు పేర్కొన్నారు. గెలిచినప్పుడు వ్యవస్థపై నమ్మకం వ్యక్తం చేసి, ఓడినప్పుడు మాత్రం ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. జనసంఘ్ కాలం నుంచే బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవిస్తోందని, ఎన్నికల ప్రక్రియను ఎప్పుడూ వ్యతిరేకించలేదని వివరించారు. ఆస్తులు, భూములు, సంక్షేమ పథకాలకు ఓటరు జాబితా సవరణకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలను భయాందోళనలకు గురిచేసే ప్రయత్నాలను కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మానుకోవాలని సూచించారు.

ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. జమిలి ఎన్నికలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అసలు వైఖరి ప్రజలకు తెలుసని అన్నారు. పార్లమెంట్లో ఒకే టేబుల్ వద్ద భోజనం చేస్తూ బయటకు వచ్చి రాజకీయ నాటకాలు ఆడటం కాంగ్రెస్, బీఆర్ఎస్లకు అలవాటైందని విమర్శించారు.

**తెలంగాణ ప్రజల ఆకాంక్షను వాడుకుంటున్న ప్రతిపక్షాలు...**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు వాడుకున్నాయని బిజెపి రాష్ట్ర బాస్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, రైతులకు భరోసా లేకుండా అప్పుల భారం మాత్రమే మిగిలిందని అన్నారు. తెలంగాణ ప్రజలకు నష్టం చేసి ఒక కుటుంబానికి మాత్రమే లబ్ధి పొందిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తే ప్రక్రియ -రఘునందన్ రావు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రతి చర్యకు బీజేపీ మద్దతుగా నిలుస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళనను రాజకీయ కోణంలో చూడకుండా ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను పెంచే చర్యగా ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు, భయాందోళనలు అవసరం లేదని, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేష్ గౌడ్తో, రాష్ట్ర నాయకులు విబీషన్ రెడ్డిలతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు గర్నెపల్లి కృష్ణమూర్తి, ఐలయ్య, తడుపునూరు వెంకటేశం, విద్యాసాగర్, లక్ష్మణ్ గౌడ్, మనోహర్ యాదవ్, వెంకట్ రెడ్డి, కుడికెల రాములు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్‌లో చాలా సమస్యలు ఉన్నాయి

- వాటిని పరిష్కరించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్

**నిజామాబాద్, జూన్ 11(మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్‌లో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ., బుకింగ్ యాప్‌లో మండల స్థాయిని ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. స్థానిక సొసైటీలు, ఫర్టిలైజర్ షాపులను అందుబాటులోకి తీసుకువస్తే యాప్‌లో యూరియాను బుకింగ్ చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. మండల కేంద్రం లేదా యాప్‌లో సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉన్నాయన్నారు. దీంతో బుక్ చేసుకున్న అనంతరం యూరియా బస్తాల కోసం రైతులు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులపై అదనపు రవాణా చార్జీలు కూడా పడుతున్నాయని వ్యయప్రయాసలకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్య పరిష్కారానికి యాప్‌లో మండల యూనిట్‌కు బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్యాక్స్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాలను చేర్చాలని ఆయన కోరారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతులు ఇప్పటికే వరినట్లు వేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారని దినేష్ తెలియజేశారు.

కానీ ఇప్పటివరకు ఒక ఎకరానికి ఎన్ని బస్తాల యూరియా కేటాయిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. దీంతో రైతాంగంలో తీవ్ర అయోమయానికి రైతాంగం అయోమయానికి గురవుతుందని ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇస్తే రైతులు దానికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకుంటారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం యూరియా కేటాయింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండాలి.. వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, జూన్ 11(మనం ప్రతినిధి):** వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల సుందరయ్య నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)లో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీ, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏ ఎన్ సీ నమోదు, ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ సెంటర్ లలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# ఆరు మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి సీతక్క



**గోవిందరావుపేట, జూన్ 11 ,మనం ప్రతినిధిః** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని గౌరవ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 6 గ్రామైక్య సంఘాలకు గాను ఒక్కో మహిళా భవన నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున మంజూరైన నిధులతో నూతన భవనాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయని పేర్కొంటూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,మండల పార్టీ అధ్యక్షుడు పాలడుగుల వెంకటకృష్ణ,స్థానిక సర్పంచ్ జోగా నాయక్,ఉప సర్పంచ్ శ్రీకాంత్,జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, మద్దాలి నాగమణి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటన
# అత్యంత క్రూరం

- ఇలాంటి మృగాన్ని సమాజం క్షమించదు?
- చిన్నారికి.. కార్పొరేట్ వైద్యం అందించాలి?
- బాధితురాలి కుటుంబానికి.. ప్రభుత్వం అండగా నిలవాలి : దేశపతి డిమాండ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఖమ్మంలో మైనర్ బాలికపై మహమ్మద్ గౌస్ జరిపిన అమానుష దాడి, హత్యాయత్నం అత్యంత హేయం, క్రూరం అని ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఇలాంటి మృగాన్ని సమాజం క్షమించదు. నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా అత్యంత కఠినమైన శిక్ష పడేలా వేగంగా విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారికి.. ఆరోగ్యం పూర్తిగా నయమయ్యేవరకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఖర్చులతో అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోసారి నేరం చేయాలంటేనే నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టేలా చట్టం చేఆయలని, అ దిశగా అధికారయాత్రాంగం అంత కదలాలని సూచించారు. బాధితురాలి కుటుంబానికి.. ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని దేశపతి డిమాండ్ చేశారు.



## శ్రీవారిని దర్శించుకున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్

**తిరుమల,జూన్ 11,మనం న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయ మహా ద్వారం వద్ద టీటీడీ ఈవో ఎం.రవిచంద్ర,అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో మూలవిరాట్టు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, వకుళమాతను, ఆనంద నిలయ విమాన వేంకటేశ్వరుని, భాష్యకార్ల సన్నిధిని, యోగ నరసింహ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు రాష్ట్ర గవర్నర్ కు వేదాశీర్వచనం అందించగా ఈవో ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, వీజీవోలు సురేంద్ర, గిరిధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సర్కారీ బడులను బతికిద్దాం?
# బడి చదువుల కోసం మేలుకొలుపు
### మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చేరికల కోసం టీచర్ ప్రచారం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, వాటిలో విద్యార్థుల నమోదును పెంచే లక్ష్యంతో ఓ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లా పాటిమీది గూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వి. గోపీనాథ్, నూతన విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరుతూ డప్పు చప్పుళ్లతో గ్రామమంతా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

గ్రామంలో ఉన్న కొంతమంది యువత, వాలంటీర్లతో కలిసి గ్రామ వీధుల్లో పర్యటిస్తూ, ఖరీదైన ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆయన తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యార్థుల విద్యాభ్యాసం, పోషకాహారం కోసం చేపడుతున్న నూతన చర్యలను ఆయన ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.

ఈ ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, పలువురు తమ పిల్లలను ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ... గ్రామానికి గుడి ఎంత ముఖ్యమో, ప్రభుత్వ బడి కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇటువంటి కృషి చేస్తున్నారని, బడిలో పిల్లలను చేర్పించి తమ ఊరి బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఆయన చేపట్టిన ఈ చొరవ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న విస్తృత సంస్కరణలకు అద్దం పడుతోంది. నూతనంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్ వంటి ఆధునిక సాంకేతికతలో శిక్షణ, స్మార్ట్ క్లాస్రూమ్ల ఏర్పాటు వంటి చర్యలతో అధికారులు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారు. గోపీనాథ్ వంటి ఉపాధ్యాయుల నిబద్ధత, ప్రభుత్వ ప్రయత్నాలకు తోడవ్వడం సర్కారీ బడుల పునరుజ్జీవానికి బాటలు వేస్తోంది.

# రిటైర్‌మెంట్ ప్లానింగ్‌తో భవిష్యత్ మీదే..

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఓ వైపు పెరుగుతున్న ద్రవ్యోల్బణం... మరోవైపు వైద్య ఖర్చుల నేపథ్యంలో చాలామందికి పదవీ విరమణ (రిటైర్‌మెంట్) అనంతరం ఆర్థిక భద్రత ఒక పెద్ద సవాలుగా మారుతోంది. రిటైర్‌మెంట్ ప్లానింగ్‌లో చేసే కొన్ని సాధారణ పొరపాట్లు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులకు దారితీస్తాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తుగా అప్రమత్తమై, సరైన ప్రణాళికతో ముందుకు సాగితేనే సురక్షితమైన పదవీ విరమణ జీవితం సాధ్యమవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, రిటైర్‌మెంట్ ప్లానింగ్‌ను వాయిదా వేయడం చాలామంది చేసే అతిపెద్ద తప్పు అని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. సంపాదించడానికి ఇంకా చాలా సమయం ఉందని భావించడం వల్ల 'కాంపౌండింగ్' ద్వారా లభించే ప్రయోజనాన్ని కోల్పోతారు. ఎంత త్వరగా పెట్టుబడులు ప్రారంభిస్తే, అంత ఎక్కువ రాబడిని పొందే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. మరో ప్రధానమైన పొరపాటు ద్రవ్యోల్బణాన్ని విస్మరించడం. ప్రస్తుత కాలంలో కోటి రూపాయలు భారీ మొత్తంగా కనిపించినప్పటికీ, మరో 15-20 ఏళ్ల తర్వాత ద్రవ్యోల్బణం కారణంగా దాని విలువ గణనీయంగా తగ్గుతుందనే విషయాన్ని




గుర్తుంచుకోవాలన్నారు. అలాగే, కేవలం ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా చిన్న మొత్తాల పొదుపు పథకాల వంటి ఏదో ఒకే రకమైన పెట్టుబడిపైనే ఆధారపడటం ప్రమాదకరం. వయసు, రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని బట్టి పెట్టుబడులలో వైవిధ్యం పాటించాలన్నారు. వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఆరోగ్య అవసరాల కోసం ప్రత్యేకంగా ఒక నిధిని కేటాయించుకోవడంతో పాటు, తగిన ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడం తప్పనిసరి అన్నారు. వీటితో పాటు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఏటా తమ ఆర్థిక ప్రణాళికను సమీక్షించుకోవాలన్నారు. రూపే 112 బిజినెస్ హెడ్ కులదీప్ యదువంశీ మాట్లాడుతూ... 'త్వరగా పెట్టుబడులు ప్రారంభించడం, క్రమం తప్పకుండా పొదుపు చేయడం, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం ద్వారానే రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది' అని పేర్కొన్నారు. ఈ పొరపాట్లను సరిదిద్దుకొని, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికను అనుసరిస్తే పదవీ విరమణ జీవితాన్ని హాయిగా గడపవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# 'పెద్ది' చిత్రంతో జతకట్టిన ఓమ్నిజెల్
### క్రీడా-ఆధారిత సినిమా కథనంతో తన ఉనికిని చాటుకున్న ఔషదం

**హైదరాబాద్,జూన్ 11(మనం న్యూస్):** సిప్లా హెల్త్ వారి ప్రముఖ నొప్పి నివారణ బ్రాండ్ అయిన ఓమ్నిజెల్, రామ్ చరణ్,జాన్వీ కపూర్ జంటగా నటించిన, తెలుగు క్రీడా అధారిత చిత్రం 'పెద్ది'తో తన ఇన్-ఫిల్మ్ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. అలనాటి గ్రామీణ నేపథ్యంలో సాగే 'పెద్ది' చిత్రం, క్రీడలు, దృఢత్వం,సమాజం యొక్క శక్తివంతమైన కథను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ ఇతివృత్తాలను ప్రతిబింబిస్తూ, ఓమ్నిజెల్‌ను చిత్ర కథనంలో సందర్భోచితంగా,సహజంగా పొందుపరిచారు. తద్వారా ఈ బ్రాండ్‌ను ప్రదర్శన, కోలుకోవడం,ఓర్పు వంటి అంశాలతో దగ్గరగా అనుసంధానించారు. ఇది ఒక క్రీడా-ఆధారిత నేపథ్యంలో దాని ఉనికిని ప్రతిబింబిస్తుంది. పనితీరు,స్థితిస్థాపకత అనే విస్త ృత ఇతివృత్తాలకు అనుగుణంగా, ఇది చిత్రం యొక్క ప్రధాన క్రీడా సన్నివేశంలో కూడా ఓమ్నిజెల్ కనిపిస్తుంది.సాంప్రదాయ మీడియాకు అతీతంగా కొత్త ఫార్మాట్లను అన్వేషించడానికి సిప్లా హెల్త్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఈ భాగస్వామ్యం మరింత బలాన్ని చేకూరుస్తుంది. ముఖ్యంగా, సాంస్క ృతికంగా, మరింత లోతుగా పాతుకుపోయిన, స్థానిక వేదికలపై ఇది మరింత ద ష్టి పెడుతుంది. 'పెద్ది' విషయంలో, ఒక ప్రాంతీయ, క్రీడా-ఆధారిత చిత్రాన్ని ఎంచుకోవడం వల్ల, సాంప్రదాయ ప్రకటనల ఫార్మాట్ల ద్వారా ప్రచారం చేయడానికి బదులుగా, రోజువారీ స్థైర్యం,పనితీరును ప్రతిబింబించే ఒక కథనంలో బ్రాండ్ భాగం కావడానికి వీలు కలిగింది.

**వ్యూహాత్మక భాగస్వామ్యంః**

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంపై సిప్లా హెల్త్ లిమిటెడ్ ఎండీ సీఈఓ శివమ్ పూరి వ్యాఖ్యానిస్తూ, ప్రజలు తమ దైనందిన జీవితాలను గడిపే విధానంతో, అది క్రీడల ద్వారా అయినా లేదా సాధారణ దినచర్యల ద్వారా అయినా, నొప్పి నుండి కోలుకోవడం అనేవి బలంగా ముడిపడి ఉంటాయి. సిప్లా హెల్త్‌లో, ఓమ్నిజెల్‌తో మా ప్రధాన లక్ష్యం నిరంతర కదలికకు మద్దతు ఇచ్చే పరిష్కారాలను రూపొందించడమేనని శివమ్ పూరి తెలిపారు. క్రీడలు, అత్మ స్థైర్యంలో పాతుకుపోయిన 'పెద్ది', ఈ వాస్తవికతను చాలా సహజమైన రీతిలో ప్రతిబింబిస్తుంది. అందువల్ల, మేము ఇందులో భాగం కావడానికి ఇది ఒక సముచితమైన సందర్భం. ఈ భాగస్వామ్యం ద్వారా, ప్రేక్షకులతో మమేకమవ్వడానికి మేము కొత్త మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని ఆయన తెలిపారు.దీని ద్వారా,ప్రజలు అనుబంధం పెంచుకునే పరిసరాలు,కథలలో ఈ బ్రాండ్ కూడా భాగం కాగలదని అన్నారు. పెద్ది చిత్రంలో క్రీడలు ప్రధానాంశంగా ఉండటంతో, ఓమ్నిజెల్ ఉనికి వాటితో ముడిపడి ఉన్న శారీరక అవసరాలు, కోలుకోవడానికి అనుగుణంగా ఉంటుంది. ఇది రోజువారీ కదలికలు, కార్యకలాపాలలో బ్రాండ్ యొక్క ప్రాముఖ్యతను కూడా ప్రతిబింబిస్తుందని శివమ్ పూరి వెల్లడించారు.

# రూ.1.70 లక్షలకు మగబిడ్డ అక్రమ విక్రయం
### సంతానం లేని దంపతులే లక్ష ్యంగా నగరంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా పసిపిల్లల విక్రయం

- కుల్సుంపురా పీఎస్ పరిధిలో ఘటన..జీరో ఎఫ్ఐఆర్ నమోదు
- మగబిడ్డ విక్రయంపై విచారణ... శిశు విహార్‌కు బాలుడి అప్పగింత

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మే 28న జన్మించిన మగబిడ్డను రూ.1.70 లక్షలకు అక్రమంగా విక్రయించిన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు కథనం ప్రకారం... 18 ఏళ్లుగా సంతానం లేని మధుసూదన్, మీనా దంపతులు ఓ మగ బిడ్డ కోసం అన్వేషిస్తూ హైదరాబాద్ జియాగూడ వాసి పోతరాజు సురేష్‌ను సంప్రదించారు. సురేష్ మధ్యవర్తులైన పద్మ పాల్దియా భర్త గోపి పాల్దియాలు తుక్కుగూడ ప్రైవేట్ ఆసుపత్రిలో




మోహన్, సంధ్య దంపతులకు జన్మించిన మగ శిశువును విక్రయించేందుకు అంగీరించినట్లు విచారణలో వెల్లడైంది. మధ్యవర్తి సురేష్ సమక్షంలో తండ్రి మోహన్, సంధ్య దంపతులు కొత్తూర్ మండలం జేపీ దర్గా వద్ద బాలుడిని మధుసూదన్, మీనా దంపతులకు రూ.1.70 లక్షలకు విక్రయించారు. కాగా.. దత్తతకు చట్టపరమైన విధానాలు పాటించకుండా ఈ లావాదేవీలు జరిగినట్లు తెలిసింది.

ఇదిలాఉంటే, ఘటన స్థలం నందిగామ పీఎస్ పరిధిలోకి రావడంతో కేసును నందిగామ పీఎస్‌కు బదిలీ చేసిన పోలీసులు నగరంలోని శిశు విహార్‌కు సమాచారం అందించారు. ఉన్నాతాధికారుల సూచన మేరకు విచారణ చేపట్టగా... పోలీసులు, చుట్టుపక్కల వారు ఇచ్చిన ఎలా జరిగింది? ఏం జరిగింది? అని శిశు విహార్ అధికారి కోడికంటి రాము ఆరా తీశారు. ఓ మధ్యవర్తి ద్వారా పిల్లాడి కోసం వేతుకుతున్న దంపతులు పసి బాలుడిని సుమారు రూ.1.70 లక్షలకు భేరం కుదుర్చుకోని దత్తత పేరుతో ఎటువంటి చట్టపరమైన విధానాలు పాటించకుండా జరిపిన లావాదేవీల మూలంగానే అక్రమ మార్గంలోనే మగబిడ్డ విక్రయం జరిగినట్లు తెలిసిందని వెల్లడించారు. అనంతరం బాలుడిని నగరంలోని శిశు విహార్‌కు పంపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2 వారాల క్రితం జన్మించిన ఈ పసి బాలుడి విషయంలో అక్రమ విక్రయం దందా కేసులో ఎవరెవరు ఉన్నారో? దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు.

# ఏఐ వాడితే?
# పీహెచ్‌డీ గోవిందా?
### ఓయూలో కొత్త సాఫ్ట్ వేర్.. విద్యార్థులకు స్ట్రాంగ్ వార్నింగ్
### ఏఐ ద్వారా పరిశోధన పూర్తి చేసి రికార్డులు సమర్పిస్తున్న విద్యార్థులు
### పీహెచ్‌డీ సీటు రాకుండా చేస్తాం.. స్టూడెంట్స్‌కు అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఓయూ పరిధిలోని పీహెచ్‌డీ విద్యార్థులు.. తమ పరిశోధనలకు సంబంధించిన పత్రాలను ఏఐ ద్వారా రూపొందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఈ ఏఐ సాయంతో తయారు చేసిన రికార్డులను గుర్తించేందుకు కొత్త సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా ఏఐ కంటెంట్‌ను గుర్తించనున్నారు. ఇలా ఏఐ ద్వారా పరిశోధన పూర్తి చేసి రికార్డులు సమర్పించిన విద్యార్థులకు.. ఎక్కడా పీహెచ్‌డీ సీటు రాకుండా చేస్తామని అధికారులు గట్టి హెచ్చరికలు చేస్తున్నారు. ప్రస్తుతం గత కొంత కాలంగా అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగం నడుస్తోంది. ఎక్కడ చూసినా, ఏ రంగంలో అయినా ఏఐ పేరు బాగా వినిపిస్తోంది. అయితే ఇదే ఏఐ కొన్నిసార్లు పక్కదారి పడుతోంది. ఏఐని ఉపయోగించుకుని.. మన జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవడం సంగతి పక్కన పెడితే.. జ్ఞానం లేకుండానే ఏఐని వినియోగించి.. పనులను సులువు చేసుకుని, షార్ట్‌కట్స్ వెతుక్కుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్డీ చదివే.. పరిశోధక విద్యార్థులు (పీహెచ్‌డీ స్కాలర్స్).. ఏఐ సాయంతో పరిశోధనలు పూర్తిగా చేయకుండానే.. ప్రాజెక్టు రిపోర్ట్స్ సమర్పిస్తున్నట్లు గుర్తించిన ఓయూ అధికారులు.. వారి ఆట కట్టించేందుకు సరికొత్త ఏఐ చెకింగ్ సాఫ్ట్వేర్ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పీహెచ్‌డీ స్కాలర్లు.. చాట జీపీటీ, జెమినై సహా ఇతర ఏఐ టూల్స్ ఉపయోగించి.. పరిశోధన పత్రాలను సమర్పిస్తున్నారని.. వారు సమర్పించిన పీహెచ్‌డీ థీసిస్లను స్పెషల్ సాఫ్ట్ వేర్‌తో టెస్ట్ చేసి.. అవి సొంతంగా చేసిన పరిశోధనలు కావని గుర్తిస్తున్నారు. గత 2 ఏళ్లలో 600 థీసిస్లను పరిశీలించిన అధికారులు వాటిల్లో మార్పులు, చేర్పులు చేయాలంటూ సంబంధిత స్కాలర్లకు సూచిస్తున్నారు. పీహెచ్‌డీ విద్యార్థులు సమర్పిస్తున్న థీసిస్లలో అసలైన, వారు చేసిన పరిశోధనలను గుర్తించేందుకు.. ఉస్మానియా యూనివర్సిటీలో ఈ ప్రత్యేక సాఫ్ట్ వేర్‌ను గతేడాది జులై నుంచి ఉపయోగిస్తున్నారు. ఆ థీసిస్‌లో ఎంత శాతం వారు కాపీ కొట్టారు అనేది తెలుసుకునేందుకు అత్యాధునిక టర్నిటిన్ సాఫ్ట్వేర్ సాయంతో గుర్తిస్తున్నారు. చాట్జీపీటీ ద్వారా పరిశోధనలు చేశారా.. జెమినై ద్వారా వాటి అంశాలను తెలుసుకున్నారా అనే సమగ్ర సమాచారాన్ని కేవలం 10 నిమిషాల్లో ఈ సాఫ్ట్ వేర్ గుర్తిస్తోంది. ఉస్మానియా యూనివర్సిటీతోపాటు.. జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రతీ సంవత్సరం సగటున 1700 మంది విద్యార్థులు పలు అంశాలపై పీహెచ్‌డీ థీసిస్లను సమర్పిస్తున్నారు. ఇందులో టర్నిటిన్ సాఫ్ట్ వేర్ సాయంతో పరీక్షించగా.. 40 శాతం వరకు అవన్నీ చాట్ జీపీటీ సాయంతో తయారు చేసినవే ఉండగా.. మరో 5 శాతం వివిధ థీసిస్ల నుంచి సేకరించినవే ఉంటున్నట్లు వెల్లడి కావడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇకపై ఇలా ఏఐ సాయంతో పీహెచ్‌డీ థీసిస్‌లు తయారు చేస్తే 3 ఏళ్ల పాటు ఎక్కడా.. ఎలాంటి పీహెచ్‌డీ సీటు రాకుండా చేస్తామంటూ యూనివర్సిటీ అధికారులు ఇటీవలే విద్యార్థులకు గట్టిగా సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇంగ్లీస్‌లో పదాలను కూర్పు చేయడం కోసం ఏఐని వినియోగిస్తే కాపీ శాతం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. వర్సిటీ తాజా ఆదేశాలతో విద్యార్థుల్లో సరికొత్త భయం నెలకొందని విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున గుసగుసలు వినిపిస్తున్నాయి.

# అక్టోబర్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్..
# డిసెంబర్లో పరీక్షలుఅభ్యర్థులు సన్నద్ధం కావాలి
### 'డిఎస్సీ ఎంపికల్లో ఎలాంటి అక్రమాలు లేవు పూర్తి పారదర్శకతతోనే నియామక ప్రక్రియ నిర్వహించాం
### రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్



**అమరావతి, జూన్ 11(పి.మీరాహుస్సేన్ మనం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ నెలలో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ-2025 నియామకాలపై మరొక సారి సమగ్ర వివరణ ఇచ్చారు.

డీఎస్సీ-2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

**2024లో నోటిఫై చేసిన పోస్టులను భర్తీ చేయకపోవడానికి కారణం.**

2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమలులో పూర్తి చట్టబద్ధత, స్పష్టత, నిబంధనల అనుసరణను నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడటంతో పాటు, టెట్-డిఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో నియామక ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సి రావడంతో పోస్టుల భర్తీ ఆలస్యమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ ప్రక్రియలో పేపర్ లీకేజీకి అవకాశమే లేదు**

డిఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని కోన శశిధర్ తెలిపారు. సిస్టమ్కు పరిమిత సంఖ్యలో మాత్రమే అధికారిక యాక్సెస్ ఉంటుందని, కేవలం ఇద్దరు నియమిత శాశ్వత ఉద్యోగులు మాత్రమే డేటా అప్లోడ్ చేసే అధికారం కలిగి ఉంటారని తెలిపారు. పాస్వర్డులు నిరంతరం మార్చబడుతూ ఉంటాయని, అనధికార ప్రవేశానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. అందువల్ల డేటా లీకేజీ లేదా పేపర్ లీకేజీకి ఎటు వంటి అవకాశం ఉందన్నారు.

**మెరిట్ లిస్ట్ తయారీ పూర్తిగా నిబంధనల ప్రకారం**

డిఎస్సీ ఎంపికల్లో టెట్ మార్కులకు 20 శాతం, డిఎస్సీ మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్ రావడం అంటే అభ్యర్థి ఎంపికైనట్లుగా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ తదితర అంశాల ఆధారంగా తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినప్పటికీ, వెరిఫికేషన్ సమయంలో అనర్హత తేలితే తదుపరి అభ్యర్థికి అవకాశం దక్కవచ్చని వివరించారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి మూడు స్థాయిల వ్యవస్థ**

అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం కోసం ప్రభుత్వం మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది పరిశీలనతో అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కరించడం జరుగుచున్నదన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలపై పూర్తి వివరణ**

స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనలు, జీఓల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపికలు నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు.

ఇంటర్-కాలేజియేట్ పోటీలకు ప్రస్తుత నియామకాల్లో ప్రాధాన్యం లేదు ప్రస్తుతం అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం.4 ప్రకారం ఇంటర్-కాలేజియేట్ పోటీల్లో పాల్గొనడం లేదా సాధించిన విజయాలను ఉద్యోగాల కోసం అర్హతగా పరిగణించలేదని ఆయన తెలిపారు. అయితే 2012 ఆగస్టు 9న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.74 ప్రకారం నిర్వహించిన గత నియామకాలలో ఇంటర్-కాలేజియేట్ పోటీలు, ఇంటర్-డిస్ట్రిక్ట్ పోటీలు, రూరల్ స్పోర్ట్స్, మహిళా క్రీడా ఉత్సవాలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఖిఎఊఐ) పోటీలు వంటి విభాగాల్లో పాల్గొనడం లేదా పతకాలు సాధించడం కూడా ఉద్యోగ అర్హతకు పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. అదే విధానం 2019లో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సుమారు 1.20 లక్షల నియామకాలలో కూడా అమలులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**జీఓ-4 ప్రకారం అత్యున్నత క్రీడా విజయాలకే ప్రాధాన్యం**

ప్రస్తుత నియామకాల్లో జాతీయ క్రీడలు (ౄబజ్ఞ్ఛీజూ ఎ్చఝ్ఛట), జాతీయ ఛాంపియన్షిప్లు, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్షిప్లు, అంతర్జాతీయ స్థాయి పోటీలలో సాధించిన విజయాల ఆధారంగా మాత్రమే ప్రాధాన్యత కేటాయించినట్లు ఆయన తెలిపారు.

**382 మంది స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల వివరాలు ఆన్లైన్లోనే ఉన్నాయి**

డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా కింద మొత్తం 382 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో భాగమయ్యారని ఆయన తెలిపారు. వీరిలో 22 మంది బంగారు పతక విజేతలు, 40 మంది రజత పతక విజేతలు, 43 మంది కాంస్య పతక విజేతలు మరియు 275 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, జూడో, సాఫ్టబాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్బాల్, హాకీ తదితర 34 క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో భాగమయ్యారని ఆయన తెలిపారు.

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

# రాష్ట్ర పునర్నిర్మాణానికి రెండేళ్లలోనే బలమైన పునాది

**జూన్ 12 న తిరుపతిలో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహణ**

**జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్**



**తిరుపతి, జూన్ 11 మనం న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాలు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరు, రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు జూన్ 12న తిరుపతిలో విజయోత్సవ సభను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా దామినేడు సమీపంలో జరగనున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మాట్లాడుతూ. రాష్ట్ర విభజన అనంతరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్, గత ప్రభుత్వ పాలనలో అనేక రంగాల్లో వెనుకబడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు ప్రమాణ స్వీకారం అనంతరం చేసిన కీలక నిర్ణయాలను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేసిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించిన ఈ నియామక ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం విజయవంతమైందని, దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్కు రావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, భూముల హక్కులను రక్షించే చర్యలు, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వివరించారు.మహిళా సాధికారత, యువత అభ్యున్నతి, సామాజిక న్యాయం, పారదర్శక పరిపాలనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ స్థిరమైన అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కంట్రీ ఫస్ట్' సిద్ధాంతంతో పనిచేస్తుండగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ 'స్టేట్ ఫస్ట్' లక్ష్యంతో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.రాష్ట్ర పునర్వైభవం, తెలుగు జాతి గౌరవ ప్రతిష్టతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ రెండేళ్ల విజయాలను ప్రజలతో పంచుకునేందుకు నిర్వహిస్తున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని తెలిపారు.

## విజయోత్సవ సభను దిగ్విజయం చేద్దాం



- **శ్రీకాళహస్తి టిడిపి నాయకులు**

**శ్రీకాళహస్తి జూన్ 11మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విధ్వంసాన్ని, అరాచకాన్ని పరిచయం చేసి,వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసిపిని చారిత్రాత్మక ప్రజా తీర్పుతో ఓడించి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి రెండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గతిని విధ్వంసం నుండి వికాసానికి తీసుకెళ్ళి, నేడు ఎన్డీయే కూటమి పక్షాలు నిర్వహిస్తున్న విజయోత్సవ సభను దిగ్విజయం చేద్దాం అని తెలుగుదేశం పార్టీ,శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు.తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద ఎన్డీయే కూటమి పార్టీలు నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ సభను విజయవంతం చేయడానికి ఉద్దేశించి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బాలగురుస్వామి శ్రీకాళహస్తి రూరల్ మండలం పరిశీలకునిగా విచ్చేసి నాయకులతో సమావేశం నిర్వహించి, రేపటి సభ విజయవంతం చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై మండల నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,నాయీ బ్రాహ్మణ సోదరులు కలిసి బాలగురుస్వామిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

## బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు



- **మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు**

**మంత్రాలయం జూన్ 11, మనం న్యూస్:** బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని మంత్రాలయం సిఐ దస్తగిరి బాబు హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మహిళలపై అత్యాచారాలు ,బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలు వాటికి వున్న శిక్షల గురించి తెలియజేయడమైనది. బాల్య వివాహాలు చేయరాదు..అలా చేస్తే బాల్య వివాహాలు చట్టం కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి తెలియజేసి హెల్మెట్ ధరించి వాహనాలు నడపలన్నారు.మద్యం సేవించి వాహనాలునడపరాదనీ. అలా చేస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష , జరిమానా విధించబడుతాయన్నారు.. గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను ఎక్కించరాదు. అలా చేస్తే వాహనాలు సీజ్ చేయడం జరుగుతున్నారు. గూడ్స్ వాహనాలలో పలకలు అమర్చి వాటిపై ప్రయాణికులను ఎక్కించి రవాణా చేయరాదు..అట్లు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం ఎస్ఐ విజయ కుమార్ , పోలీసు సిబ్బంది ఉన్నారు.

# యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం

- **జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**
- **ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్‌లో యోగాంధ్ర-2026 జిల్లాస్థాయి కార్యక్రమం**
- **అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా సాధన వందల సంఖ్యలో పాల్గొన్న అభ్యాసకులు**

**మదనపల్లె జూన్ 11 మనం న్యూస్:** యోగాంధ్ర 2026 జిల్లాస్థాయి కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలోవందల మందితో అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.అనంతరం యోగా శిక్షకులు డా పాల్ బ్రహ్మకుమార్ ఆధ్వర్యంలో దాదాపు గంట పాటు పాల్గొన్న వారందరూ యోగాసనాలు వేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని అన్నారు. యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు.ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగకు కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ యోగను అలవాటు చేసుకోవడంద్వారాఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈనెల 14న పర్యాటక ప్రాంతమైన బోయకొండ మరియు 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, పర్యాటక రీజనల్ డైరెక్టరు డా. రమణప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, సమాచార శాఖ ఏడి పురుషోత్తం, ఏపీటీడీసి శ్రీనివాసరావు, డీఈఓ సుబ్రమణ్యం, డిపిఒ రాధమ్మ, డిఆర్డిఓ పీడీ నాగేశ్వరరావు, డిడిఓ లక్ష్మీపతి, తహసిల్దార్, ఎంపీడీవో, మండల అధికారులు, అంగన్వాడి మరియు హెల్త్ వర్కర్లు, ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి బాటలో చెన్నంపల్లి

**తుగ్గలి, జూన్ 12(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి శరవేగంగా దూసుకుపోతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు పి.వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్ అన్నారు. గురువారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ చెన్నంపల్లి గ్రామ పంచాయతీలో కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత దాదాపు రూ.4 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. చెన్నంపల్లి గ్రామపంచాయతీలో సరికొత్త రోడ్లు, నీటి సదుపాయాలు, విద్యుత్,ఆత్యధునిక డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణముతో ప్రజల కల సహకారం అయిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, టిడిపి నేతలు రాజేంద్ర గౌడ్, లక్ష్మీనారాయణ,చౌదరి, అక్బర్ బాషా, కోటేష్ గౌడ్, రామయ్య, సంజీవ చౌదరి తదితరులు పాల్గొన్నారు. సమస్యలన్నిటికీ పరిష్కారం లభించడంతో చెన్నంపల్లి పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు కలెక్టర్ బృందం పర్యటన

**తుగ్గలి జూన్ 11(మనం న్యూస్):** తుగ్గలిలో 12న( శుక్రవారం ) పీజీఆర్ఎస్ ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించునున్నట్లు కలెక్టర్ వారి కార్యాలయం నుండి గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు తుగ్గలి మండలం,తుగ్గలి గ్రామంలో జిల్లా కలెక్టర్ బృందం పర్యటించి ఫిర్యాదులను పరిష్కరించునున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మండల అధికారులు, సంబంధిత గ్రామస్థాయి అధికారులు గ్రామమునందు వచ్చి ఫిర్యాదుల సమీక్షించి గ్రామ సమస్యల ప్రజలతో సమస్యలపై విచారించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు.



## రెండేళ్ల పాలనా కానుకగా చంద్రబాబు పార్కు



- **ఎమ్మెల్యే కాలవ**

**రాయదుర్గం జూన్ 11 మనం న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనకు రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆయన పేరిట పార్కును పారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బళ్లారిరోడ్డులోని శాంతినగరులో రూ.40 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన చంద్రబాబు నాయుడు పార్కును గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుమారు 30 సంవత్సరాల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ పూజారి జితేంద్రప్ప ఆధ్వర్యంలో ఈ పార్కును ఏర్పాటు చేశారన్నారు. తరువాత సరైన నిర్వహణ లేక పార్కు ఆనవాళ్లు మాయమయ్యాయన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ పార్కును తిరిగి అభివృద్ధి చేయాలని నిర్ణయించి, అధికారంలోకి వచ్చిన తరువాత రూ.40 లక్షలతో సమగ్రంగా ఆధునికీకరించినట్లు చెప్పారు. పార్కుకు కొత్త రూపు తీసుకువచ్చి, పిల్లలు ఆడుకునేందుకు, కుటుంబాలు ఆహ్లాదకర వాతావరణంలో సమయం గడపడానికి అనుకూలంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ముఖ్యంగా శాంతినగర్ పరిసర కాలనీల ప్రజలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోండి



**చిత్తూరు జూన్ 11మనం న్యూస్:** జిల్లాలో రాబోవు వర్షాకాలంలో అంటువ్యాధుల ప్రవరకొండ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ జూన్ మీటింగులో జూమ్ సమావేశంలో తెలిపారు గురువారం రాష్ట్రవ్యాప్తంగా డిఎంఅండ్ హెచ్ఒలు, ప్రోగ్రాం అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు వర్షాకాలంలో డయేరియల్ వ్యాధులు పై ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి నీరు కలుషితం కాకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ప్రతి పిహెచ్సి, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలలో విరివిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు,అవగాహన కార్యక్రమాలు ,డేమాండ్ స్టేషన్ చేపట్టాలన్నారు.ఎక్కడ మరణాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.ఈనెల 28వ తారీఖున ప్రత్యేక కార్యక్రమం 0-5 సంవత్సరంలో లోపల పిల్లలందరికీ అదనంగా రెండు పోలియో డ్రాప్స్ తప్పక తల్లిదండ్రులకు వేయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు అందరూ 100% విజయవంతం చేయాలన్నారు.-ఐ వి ఆర్ ఎస్ లలో కొన్ని జిల్లాలు తక్కువ స్కోర్లో ఉన్నందున ప్రజల మన్న నలను పొందాలంటే టైం ప్రకారం డాక్టర్ తప్పనిసరిగా పీహెచ్సీ నందు ఉండి వైద్య సేవలు అందిస్తూ, క్షేత్రస్థాయిలో ఆరోగ్య చికిత్స కార్యక్రమాలపై విపులంగా ఎమ్మెల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి 100%ఇంప్రూవ్ చేయాలన్నారు. ఐ హెచ్ ఐ పి కార్యక్రమం నందు ప్రతిరోజు పిహెచ్సి వారు పి ఫాంలో, ల్యాబ్ వాళ్ళు ఎల్ ఫారం లో, క్షేత్రస్థాయి వారు ఎస్ ఫారం లో తప్పక వ్యాధుల రిపోర్ట్ పంపాలన్నారు.ప్రతి జిల్లాలో సంజీవిని ప్రోగ్రాం స్టార్ట్ అయినందున ఓపి కి వచ్చే ప్రతి కేసుకు అభ ఐడి కచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ నాగశివభూషన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ గిరి, డాక్టర్ నవీన్ తేజ్ రాయల్, డాక్టర్ అనూష,జార్జ్, గిరిధర్ రెడ్డి, రామ్మోహన్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- **రోడ్ల విస్తరణ పనులు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**




**చిత్తూరుజూన్11మనం న్యూస్ :** చిత్తూరు నగర పరిధిలో జరుగుతున్న రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ, ఎన్.హెచ్, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి నగరంలోని పలమనేరు రోడ్డు, కట్టమంచి రోడ్డు, సాంబయ్య కండిగ రోడ్డులను పరిశీలించారు. మొదటగా దర్గా సర్కిల్ నుంచి ఇరువారం బైపాస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. దర్గా సర్కిల్ నుండి న్యూట్రిన్ ఫ్యాక్టరీ వరకు 80 అడుగుల మేర, న్యూట్రిన్ ఫ్యాక్టరీ నుండి ఇరువారం బైపాస్ వరకు 100 అడుగుల మేర రోడ్డు నిర్మాణానికి అనువుగా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. మిగిలి ఉన్న భవన యజమానులతో చర్చించి, వారిని ఒప్పించి అవసరమైన స్థలాన్ని సేకరించాలన్నారు. ఎమ్మెస్సార్ సర్కిల్ నుండి మురుకంబట్టు వరకు ఉన్న కట్టమంచి రోడ్డును 80 అడుగుల మేర విస్తరించడానికి నిధులు మంజూరైన నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కట్టమంచి - సాంబయ్య కండిగ రోడ్డు పనులను పరిశీలించారు. స్థానికంగా ఉన్న ఆలయానికి ప్రత్యామ్నాయంగా స్థలం చూపించి రోడ్డు విస్తరణకు ఇబ్బందు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై శ్రీరామచంద్ర స్వరూపంలో గోకులానందుని దివ్య విహారం

**భక్తులపై కరుణాకటాక్షాలు కురిపించిన శ్రీ వేణుగోపాలస్వామి**

**గోవింద నామస్మరణలు, కర్పూరహారతులతో మారుమోగిన కార్వేటినగరం**

**తిరుపతి జూన్11 మనం న్యూస్:** కార్వేటినగరం శ్రీ రుక్మిణి-సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం జరిగిన హనుమంత వాహనసేవ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. స్వామివారు శ్రీరామచంద్రుని అలంకారంలో హనుమంత వాహనంపై విరాజిల్లుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల ఆరో రోజు సందర్భంగా హనుమంతునిపై ఆసీనులైన శ్రీవేణుగోపాలస్వామివారు త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు శ్రీరాముడిగా అవతరించిన మహోన్నత ఘట్టాన్ని స్మరింపజేశారు. స్వామివారి దివ్య మంగళ విగ్రహాన్ని దర్శించిన భక్తులు ఆనంద భాష్పాలతో పరవశించి పోయారు. వాహనసేవ మార్గమంతా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామసంకీర్తనలు, మంగళవాయిద్యాలు ఉత్సవానికి విశేష శోభను చేకూర్చాయి. ఆగమ శాస్త్రాల ప్రకారం హనుమంత వాహనంపై శ్రీరామ స్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారిని సేవించడం ద్వారా భోగమోక్షాలు, జ్ఞానవిజ్ఞానాలు, అభయం, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గజవాహనంపై స్వామి వారు భక్తులను కటాక్షిస్తారు. 7వ రోజు శుక్రవారం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగి భక్తులనుఆశీర్వదించనున్నారు.ఈవాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నేడు తిరుపతిలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు

**తిరుపతి జూన్11 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,కేంద్ర మంత్రివర్యులు ఇతర ప్రముఖులు ,శుక్రవారంతిరుపతి నగరంలో నిర్వహించబడనున్న '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో, ప్రజల భద్రత, సౌకర్యం మరియు ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయబడనున్నవి.ప్రజలు, ప్రయాణికులు మరియు వాహనదారులు క్రింది ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసు శాఖకు సహకరించవలసిందిగా కోరడమైనది. చిత్తూరు వైపు నుండి వచ్చే వాహనాలు. ఒమేగా హాస్పిటల్ - చెర్లోపల్లి - జూపార్క్ - గరుడ సర్కిల్ - నంది సర్కిల్ - లీలామహల్ - కరకంబాడి మార్గం ద్వారా ప్రయాణించవలెను. మదనపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు. పీలేరు - రంగంపేట - శ్రీనివాస మంగాపురం - చెర్లోపల్లి - జూపార్క్ - గరుడ సర్కిల్ - నంది సర్కిల్ - ఫ్లైఓవర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్కు చేరుకోవలెను. ఆర్టీసీ బస్టాండ్ నుండి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు. ఫ్లైఓవర్ - నంది సర్కిల్ - గరుడ సర్కిల్ - జూపార్క్ - చెర్లోపల్లి - ఒమేగా హాస్పిటల్ మార్గం ద్వారా ప్రయాణించవలెను. కడప వైపు నుండి వచ్చే వాహనాలు. కట్టపుట్టాలమ్మ దేవాలయం - కరకంబాడి - మంగళం - లీలామహల్ మార్గం ద్వారా ఆర్టీసీ బస్టాండ్కు చేరుకోవలెను. నెల్లూరు, నాయుడుపేట వైపు నుండి వచ్చే వాహనాలు. వాజ్పేయి జంక్షన్ - ఓల్ రేణిగుంట చెక్పోస్ట్ - రమణ విలాస్ సర్కిల్ - కట్టపుట్టాలమ్మ దేవాలయం - కరకంబాడి - మంగళం - లీలామహల్ - ఆర్టీసీ బస్టాండ్ మార్గం ద్వారా ప్రయాణించవలెను. చెన్నై, పుత్తూరు వైపు నుండి వచ్చే వాహనాలు. గాజులమండ్యం సర్కిల్ - ఓల్ రేణిగుంట చెక్పోస్ట్ - నారాయణాద్రి హాస్పిటల్ - బ్లిస్ సర్కిల్ మార్గం ద్వారా తిరుపతి నగరంలోకి ప్రవేశించవలెను. ప్రజలకు విజ్ఞప్తి వాహనదారులు ముందస్తుగా తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకొని సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలి. ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి.ప్రజల సౌకర్యార్థం అమలు చేస్తున్న ఈ ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించి కార్యక్రమం విజయవంతానికి తోడ్పడాలి. అత్యవసర సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర సేవల వాహనాలకు పై ట్రాఫిక్ మళ్లింపులు వర్తించవు.

# హర్మూజ్లో చమురు రవాణాకు 'సీక్రెట్ మిషన్'

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 11:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రంగా మారాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కానీ, ఈ జలమార్గం తమ నియంత్రణలోనే ఉందని అగ్రరాజ్యం చెబుతోంది. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్లో చమురు రవాణా కోసం తాము రహస్య ఆపరేషన్ను నిర్వహించినట్లు వెల్లడించారు.

వైట్హౌస్లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''మీకెవరికీ తెలియని ఓ విషయం చెబుతాను. మేం సీక్రెట్ మిషన్ చేపట్టి హర్మూజ్ మీదుగా లక్షలాది బ్యారెళ్ల చమురును తరలించాం. ఈ విషయాన్ని ఇరాన్ కూడా ఇప్పుడే తెలుసుకుంటుంది. ఒక్క రాత్రే 22 నౌకలను తరలించాం. చిమ్మచీకట్లో లైట్లు లేకుండా రాడార్లకు చిక్కకుండా వాటిని సురక్షితంగా పంపించాం'' అని అమెరికా అధ్యక్షుడు వివరించారు.

దీంతో ట్రంప్ వ్యాఖ్యలు గందరగోళానికి దారితీశాయి. అవి ఏ దేశ నౌకలు, ఎక్కడినుంచి వెళ్లాయన్న వివరాలపై కూడా స్పష్టత లేదు. ఈ క్రమంలోనే అమెరికా సీనియర్ మిలిటరీ అధికారి ఒకరు దీనిపై స్పందించారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు అమెరికా ఎస్కార్ట్ ఇచ్చిన విషయాన్నే ట్రంప్ ప్రస్తావించినట్లు తెలిపారు. అగ్రరాజ్య మిషన్లో భాగంగా చమురు, వాణిజ్య నౌకలు హర్మూజ్ను దాటేందుకు అమెరికా గైడెడ్ నౌకలు భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. గత నెలలో దాదాపు 70 నౌకలకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎస్కార్ట్గా వ్యవహరించినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ఉద్రిక్తతలు తగ్గడంతో హర్మూజ్లో నౌకల రవాణా పెరిగిన సంగతి తెలిసిందే. నెల రోజుల వ్యవధిలో దాదాపు 200 నౌకలు ఈ జలసంధిని దాటినట్లు అమెరికా మిలిటరీ అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు నెలకు దాదాపు 3వేల నౌకలు ఈ మార్గం మీదుగా ప్రయాణించేవి.

# టీఎంసీ విలీనం వార్తలు నిరాధారం..

## కేంద్రం తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు

## ప్రజాస్వామం దుస్థితిలో ఉంది:కాంగ్రెస్

## సుప్రీం కోర్టుకు మీనాక్షీ నటరాజన్



ఢిల్లీ, జూన్ 11: కాంగ్రెస్లోకి మమత బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ విలీనం కానుందన్న వార్తలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. అయితే, ఈ కథనాలను కాంగ్రెస్ ఖండించింది. అవన్నీ నిరాధారమైనవేనని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'ఇండియా' కూటమిని బలోపేతం చేయడంపైనే తమ చర్చలు సాగినట్లు వెల్లడించారు. ఇటీవల మధ్యప్రదేశ్లో కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి నామినేషన్ను తిరస్కరించి.. బీజేపీ మద్దతు ఉన్న అభ్యర్థి నామినేషన్ను అంగీకరించడం ప్రజాస్వామ్య దుస్థితిని చాటుతోందన్నారు. ఈ వ్యవహారంపై రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని తెలిపారు.

**దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు..**

ఇతర పార్టీల ఎంపీలతో రాజీనామా చేయించి బీజేపీలో చేర్చుకోవడం సీట్ చోరీ లాంటిదేనని కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ, రాష్ట్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దేశ ఆర్థిక దుస్థితి, ధరల పెరుగుదల, పరీక్షల సంక్షోభం వంటి వాటికి ప్రధాని నరేంద్ర మోడీనే బాధ్యులని ఆరోపించారు. జూన్ నెలాఖరు నుంచి ఆందోళన కార్యక్రమాలు ప్రారంభిస్తామని, దేశవ్యాప్తంగా 2-3 నెలల పాటు కొనసాగుతాయన్నారు. 'ఓటు చోరీ', 'సీటు చోరీ' అనే డబుల్ ఇంజిన్ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్చార్జిలు, రాష్ట్రాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించినట్లు సమాచారం. కేవలం రాజకీయ పోరాటమే కాకుండా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడం కూడా పార్టీ బాధ్యతని అగ్రనేతలు ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి

రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి మధ్యప్రదేశ్లో తన నామినేషన్ తిరస్కరణకు గురైన అంశంపై కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే.. ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఈ పిటిషన్ ఎలా విచారణకు అర్హమైనదని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కనీసం రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశమున్న క్రిమినల్ కేసును అభ్యర్థి వెల్లడించాల్సి ఉంటుందని, కానీ ప్రస్తుత వ్యవహారంలో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. పిటిషన్ ప్రతిని తమకు అందజేయలేదని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది డీఎస్ నాయుడు పేర్కొన్నారు. ఈ పిటిషన్పై శుక్రవారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది.

# సీబీఎస్ఈ లోపాలను బయటపెట్టిన

## 19 ఏళ్ల కుర్రాడికి ఐఐటీ కాన్పూర్లో ఉద్యోగం




**లఖ్నవూ, జూన్ 11:** సీబీఎస్ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ లోపాలను బయటపెట్టిన యువతలో 19 ఏళ్ల నిసర్గ అధికారి కూడా ఒకరు. తాజాగా అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తమ సైబర్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ సి3ఐ హబ్లో నిసర్గ అధికారిని ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, థ్రెట్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్గా నియమిస్తున్నట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. దీనిపై ఈ విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర అగర్వాల్ మాట్లాడుతూ.. ''నిసర్గ అధికారి ఎంతో నైపుణ్యం ఉన్న యువ ఇంజినీర్. అతడికి చిన్న వయసులోనే అద్భుతమైన సాంకేతిక సామర్థ్యాలున్నాయి. ఈ నియామకంతో సైబర్ సెక్యూరిటీ రంగంలో అతడికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. దీంతోపాటు మా విభాగం కూడా బలోపేతం అవుతుందని భావిస్తున్నాం. గతంలోనూ మా సైబర్ విభాగంలో ఇలా యువ ఇంజినీర్లను నియమించుకున్నాం'' అని వెల్లడించారు. కాంట్రాక్టు విధానంలో అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. అయితే, అతడి వేతనం, ఇతర వివరాలను విద్యాసంస్థ వెల్లడించలేదు.

నిసర్గ అధికారి ఈ ఏడాదే 12వ తరగతి పూర్తిచేశాడు. అతడి కుటుంబంలో ఎవరూ సైబర్ సెక్యూరిటీ రంగంలో లేరు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తున్నారు. కోడింగ్ మీదున్న ఆసక్తితో ఆరేళ్ల వయసు నుంచే దాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఆరోతరగతికి వచ్చాక సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాడు. 'క్యాప్చర్ ది ఫ్లాగ్' వంటి హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నాడు. ఇటీవల సీబీఎస్ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్లో లోపాలను గుర్తించిన నిసర్గ ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్-ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగింది. తాజా నియామకంపై నిసర్గ మాట్లాడుతూ.. ''ఫుల్టైమ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేయడం ఆనందంగా ఉంది. అయితే, వేతనం నేను అనుకున్న దానికంటే తక్కువగానే ఉంది'' అని పేర్కొన్నాడు.



# రూ.200కోట్ల కేసులో

# జాక్వెలిన్ పిటిషన్..

## విచారణ నుంచి వైదొలిగిన న్యాయమూర్తి

**ఢిల్లీ, జూన్ 11:** ఆర్థిక మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్కు సంబంధించిన రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భాగంగా నటి జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వేసిన పిటిషన్ విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా వైదొలిగారు.

మనీలాండరింగ్ కేసులో జాక్వెలిన్పై అభియోగాలు మోపాలని దర్యాప్తు సంస్థ ఈడీని ఢిల్లీ కోర్టు ఇటీవల ఆదేశించింది. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఆమె పిటిషన్ వేశారు. అయితే ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం తరపున న్యాయబృందంలో జస్టిస్ మిశ్రా కుమారుడు ఉన్నారు. పారదర్శకత కోసం విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. దాంతో వేరే ధర్మాసనం ఈ పిటిషన్ను విచారించనుంది.

తనపై అభియోగాలు మోపాలంటూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలంటూ జాక్వెలిన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అందుకు హైకోర్టు నిరాకరించడంతో ఆమె సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ను దాఖలు చేశారు. ఇదిలా ఉంటే ఈ మనీలాండరింగ్ కేసులో అప్రూవర్గా మారేందుకు జాక్వెలిన్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ అభ్యర్థనను ఈడీ వ్యతిరేకించింది. ఇక, జూన్ 3న ఢిల్లీ కోర్టులో జరిగిన విచారణలో భాగంగా తనపై నమోదైన అభియోగాలను ఆమె తోసిపుచ్చారు.

# మాతో ఉంటారా..? అభిషేక్ వెంటనా..?

## మమతాబెనర్జీకి కల్యాణ్ బెనర్జీ అల్టిమేటం




**కోల్కతా, జూన్ 11:** తృణమూల్ కాంగ్రెస్లో తీవ్ర అసమ్మతి నెలకొంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పార్టీపై పట్టు కోల్పోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఎదురుదెబ్బ తర్వాత నుంచి ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై ఇంతకాలం నెలకొన్న అసంతృప్తిని నేతలు వెళ్లగక్కుతుండటంతో ఈ పరిస్థితి ఎదురైంది. తాజాగా అభిషేక్ బెనర్జీపై తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు.

సంతకాల ఫోర్జరీ కేసులో చివరి నిమిషంలో అభిషేక్ తనను న్యాయవాదిగా తొలగించి, అవమానించారని వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీకి అల్టిమేటం జారీ చేశారు. 'మాతో ఉంటారా..? లేక అభిషేక్ వెంట ఉంటారా..?'' అని అడిగారు. ''నేను మమతాబెనర్జీ వెంటే ఉన్నాను. కానీ, ఆమె ఎవరి పక్షంలో ఉన్నారో తేల్చుకోవాలి'' అని కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. సీనియర్లను గౌరవించడం రాని అభిషేక్ వల్లే పార్టీ ధ్వంసమవుతోందని చెప్పారు. అహంకారంతో తనకు తాను కింగ్లా అనుకోవడం వల్లే ఇదంతా జరుగుతోందన్నారు. కాగా...రాజ్యసభ సభ్యత్వానికి టీఎంసీ ఎంపీ ప్రకాశ్ బరైక్ రాజీనామా చేశారు. వారం రోజుల వ్యవధిలో రాజ్యసభకు రాజీనామా చేసిన మూడో టీఎంసీ ఎంపీ ఈయన. దీంతో ఎగువసభలో తృణమూల్ ఎంపీల బలం పదికి తగ్గింది. ఇటీవల టీఎంసీ అసమ్మతి ఎంపీలు లోక్సభ స్పీకర్కు సమర్పించిన లేఖలో ఎంపీ శత్రుఘ్న సిన్హా సంతకం కూడా ఉందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సిన్హా స్పందించారు. ''నా గురించి ఎన్నో కథనాలు ప్రచారం అవుతున్నాయి. నేను తిరుగుబాటు గ్రూప్లో భాగం అని కొందరు చెప్తున్నారు. అవన్నీ అవాస్తవం. నేను గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు మమతబెనర్జీ నాకు అండగా నిలిచారు. ఈ కష్టసమయంలో నేను ఆమెకు అండగా ఉంటాను'' అని సిన్హా స్పష్టం చేశారు.

# ఎప్స్టీన్ను కలవడమే పొరపాటు: బిల్ గేట్స్



**వాషింగ్టన్,జూన్ 11:** పలువురు ప్రపంచ ప్రముఖులకు బాలికల్ని ఎరగావేసి వారి నుంచి అనేక ప్రయోజనాలు పొందినట్టు అభియోగాలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్స్టీన్ను కలవడమే తాను చేసిన పెద్ద పొరపాటని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ విచారం వ్యక్తం చేశారు. ''అసలు నేనతణ్ని కలవకుండా ఉండాల్సింది. అతని నేర నేపథ్యం తెలియకపోవడం వల్లే అలా జరిగింది'' అని బిల్గేట్స్ అమెరికా చట్టసభలకు చెందిన హౌస్ ఓవ్సట్ కమిటీ ముందు వాంగ్మూలమిచ్చారు. తాను స్వచ్ఛందంగా వాంగ్మూలమిచ్చేందుకు వచ్చాననీ, తన ప్రకటన ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. ఎప్స్టీన్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన లక్షల పత్రాల్లో పలుచోట్ల బిల్గేట్స్ ప్రస్తావన ఉండటంతో ఓవ్సట్ కమిటీ ఛైర్మన్, రిపబ్లికన్ పార్టీ సభ్యుడు జేమ్స్ కామర్...వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా ఆయనను కోరారు. బిల్ గేట్స్ తప్పు చేసినట్టు ఎవరూ ఆరోపించడం లేదని కామర్ స్పష్టం చేశారు. వృత్తిపరమైన, దాతృత్వ సంబంధ కార్యకలాపాలతో సంబంధం ఉన్న వ్యక్తులు కొందరు తనను ఎప్స్టీన్కు పరిచయం చేశారని బిల్గేట్స్ కమిటీకి తెలిపారు. ప్రపంచానికి ప్రయోజనం కలిగించే తన ఆరోగ్య పథకాలకు బిలియన్ల కొద్దీ డాలర్ల విరాళాలు సమకూర్చడంలో సాయమందిస్తానని ఎప్స్టీన్ తనకు హామీ ఇచ్చాడని గేట్స్ అన్నారు. ఎప్స్టీన్వి వట్టిమాటలేనని తేలిపోవడంతో 2014లో అతనితో సంబంధాలు తెంచుకున్నానని తెలిపారు. ఎప్స్టీన్కు చెందిన దీవినిగానీ, అతని ఇతర అపఖ్యాత ఆస్తులను గానీ తాను సందర్శించలేదని స్పష్టం చేశారు. బిల్గేట్స్, ఎప్స్టీన్ల అనుబంధం 2011లో ప్రారంభమైంది. అంతకు మూడేళ్ల ముందే ఒక మైనర్ బాలికను పడుపు రొంపిలోకి లాగినట్టు ఎప్స్టీన్ నేరాన్ని అంగీకరించాడు. 2019 ఆగస్టులో అతడు న్యూయార్క్ జైలులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# భారతీయులున్న నౌకలపై అమెరికా దాడులువెంటనే ఆపాలి

## విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్



**ఢిల్లీ, జూన్ 11:** ఒమన్ తీరానికి సమీపంలో భారతీయులున్న నౌకలపై వరుసగా అమెరికా దాడులు చేస్తోంది. వారం రోజుల వ్యవధిలో మన దేశీయులున్న నౌకలను మూడుసార్లు లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ దాడులు తీవ్ర ఆందోళనకరమని, తక్షణమే వాటిని ఆపేయాలని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు.

''కొన్నిరోజులుగా పశ్చిమాసియాలో భారత నావికులు లక్ష్యంగా కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒమన్ తీరంలో ఒక నౌకపై నిన్న జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాం. ఆ ఘటనలో ముగ్గురు భారతీయుల్ని కోల్పోయాం. ఢిల్లీలో అమెరికా దౌత్యాధికారిని పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశాం. ఈ ప్రాంతంలో నౌకలపై నిరంతరం జరుగుతోన్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితమే ఈ ఘటనలు. ఈ దాడులు వెంటనే ఆపివేయాలి. చర్చలు, దౌత్యంతో ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయాలి'' అని జయస్వాల్ పిలుపునిచ్చారు. దాడులకు సంబంధించిన వివరాలను షిప్పింగ్ మినిస్ట్రీ అడిషనల్ సెక్రటరీ ముకేశ్ మంగళ్ వెల్లడించారు. జూన్ 8 నుంచి ఈ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఆరోజున మారివెక్స్ నౌకలో మంటలు చెలరేగాయి. అందులోని 24 మంది భారతీయులు సురక్షితంగా బయటపడ్డారు. జూన్ 10న సెటెబె వాణిజ్య నౌకను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. అందులో 21 మంది భారతీయుల్ని కాపాడగా.. ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. జూన్ 11న ఎంటీ జలవీర్ టార్గెట్ అయింది. దానిలోని 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం హర్మూజ్లో ఉన్న 13 భారత పతాక నౌకల్లో.. 562 మంది భారత సిబ్బంది ఉన్నారు.

# సోదాల్లో రూ.కోట్లు గుర్తింపు

## భార్య కుట్టుమిషన్ ఆదాయమట!




**ఇండోర్, జూన్ 11:** మధ్యప్రదేశ్లో ఓ ప్రభుత్వ ఉద్యోగి నివాసంలో లోకాయుక్త పోలీసుల సోదాల సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోదాల్లో భాగంగా దాదాపు రూ.11 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు గుర్తించారు. అయితే, వీటికి సంబంధించి ఉద్యోగి ఇచ్చిన సమాధానంతో దర్యాప్తు అధికారులు కంగుతిన్నారు. తన భార్య కుట్టు మిషన్, అల్లికలు చేస్తూ సంపాదించినవని చెప్పడం గమనార్హం. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్గా ఉన్న లక్ష్మీనారాయణ్ కండ్వాల్పై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇండోర్లోని ఆయన నివాసంలో లోకాయుక్త పోలీసులు బుధవారం సోదాలు చేపట్టారు. ఆయన జీతభత్యాలు, వ్యవసాయ వనరుల నుంచి వచ్చే ఆదాయం మొత్తం కలిపి రూ.2.8 కోట్లుగా అంచనా వేశారు. కానీ, సోదాల్లో మాత్రం ఆయనకు మొత్తం రూ.10.83 కోట్ల ఆస్తులు ఉన్నట్లు లెక్కగట్టారు. ఈ అక్రమ ఆస్తులపై లక్ష్మీనారాయణను అధికారులు ప్రశ్నించగా.. తన భార్య కుట్టు మిషన్, అల్లికల పని ద్వారా డబ్బు సంపాదిస్తోందని చెప్పడం గమనార్హం. కండ్వాల్ కుటుంబ సభ్యుల బ్యాంకు అకౌంట్లను స్తంభింపజేశామని, బ్యాంకుల నుంచి పూర్తి వివరాలు అందిన తర్వాత ఆయన మొత్తం ఆస్తులపై పూర్తి స్థాయిలో అంచనాకు వస్తామన్నారు. ఇదిలాఉంటే, మరో ఆరు నెలల్లో కండ్వాల్ పదవీ విరమణ చేయనున్నట్లు తెలిసింది.

# లేపాక్షి శిల్ప వైభవం..



- **కియా సాంకేతిక అద్భుతం**
- **ఐఏఎస్ ట్రైనీల క్షేత్రస్థాయి అధ్యయనం**

**పుట్టపర్తి, జూన్ 11 మనం న్యూస్:** భారత పరిపాలనా సేవ (ఐఏఎస్) ట్రైనీ అధికారులు శ్రీ సత్యసాయి జిల్లాలో చారిత్రక వారసత్వం, పారిశ్రామిక అభివృద్ధిని ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన పర్యటనలో భాగంగా వారు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని, అనంతరం పెనుకొండ సమీపంలోని కియా మోటార్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

లేపాక్షి ఆలయంలోని విజయనగర శిల్పకళా వైభవం, ఆసియాలోనే అతిపెద్ద వీరభద్రస్వామి కుడ్యచిత్రం, ప్రసిద్ధ వేలాడే స్తంభం ప్రత్యేకతలను అధికారులు ఆసక్తిగా పరిశీలించారు. ఆలయ చారిత్రక నేపథ్యం, శిల్ప సంపద, పర్యాటక ప్రాధాన్యంపై సంబంధిత అధికారులు వారికి వివరించారు. అనంతరం కియా మోటార్స్ పరిశ్రమను సందర్శించిన ఐఏఎస్ ట్రైనీలు కార్ల తయారీ ప్రక్రియ, రోబోటిక్ సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, ఎగుమతి విధానం, స్థానిక యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాల గురించి తెలుసుకున్నారు. పరిశ్రమలో అమలవుతున్న ఆధునిక సాంకేతిక విధానాలను పరిశీలించి అభినందించారు. జిల్లాలో ఒకవైపు చారిత్రక, సాంస్కృతిక వారసత్వం.. మరోవైపు ప్రపంచ స్థాయి పారిశ్రామిక ప్రగతి కలిసి అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయని ట్రైనీ అధికారులు పేర్కొన్నారు

# ద్రవ్యోల్బణం లెక్కలు బాగున్నాయి.. ఐ లవ్'

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు



**వాషింగ్టన్, జూన్ 11:** పశ్చిమాసియా ఘర్షణలతో అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణ భయాలు ముసురుకున్నాయి. ఇప్పటికే భారత్తో సహా పలు దేశాల్లో ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు మంటలతో అమెరికాలో మే నెల ద్రవ్యోల్బణ గణాంకాలు మూడేళ్ల గరిష్ఠానికి చేరిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అసలు ఆ భయాలే అవసరం లేదన్నట్టుగా ఆయన మాట్లాడారు. ''గణాంకాలు బాగున్నాయి. ద్రవ్యోల్బణం అంటే నాకు చాలా ఇష్టం'' అని మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికాలో కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ 4.2 శాతానికి పెరిగింది. ఏప్రిల్ 2023 తర్వాత ఇదే అత్యధికస్థాయి. ఇలాంటి సమయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికన్లు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలను లెక్కచేయని విధంగా ఆయన మాటలు ఉన్నాయని డెమోక్రాట్లు మండిపడుతున్నారు. ''ద్రవ్యోల్బణాన్ని ప్రేమిస్తున్నానని ట్రంప్ చెప్తున్నారు. ఆయన మాటలు ప్రతిఒక్కరూ చూడాలి'' అని డెమోక్రాటిక్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రచారం మొదలుపెట్టింది. నవంబర్లో మధ్యంతర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధ్యక్షుడి వ్యాఖ్యలు ప్రతిపక్ష పార్టీకి అస్త్రంగా మారాయి. ఆయన మాటలను విపక్ష నేతలు వక్రీకరించారంటూ రిపబ్లికన్ పార్టీ నేత మైక్ జాన్సన్ నష్టనివారణకు దిగినా ప్రయోజనం లేకపోయింది. ఇదిలాఉంటే.. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. దాంతో పలు దేశాలు స్థానికంగా చమురు, గ్యాస్ ధరలను పెంచుతుండటంతో సామాన్యులపై భారం పడుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇరాన్పై అమెరికా మరోసారి విరుచుకుపడటంతో బ్రెంట్ క్రూడ్ ఓ బ్యారెల్కు 2.47 శాతం పెరిగి, 95.40కు ఎగబాకింది.

# స్థలం సర్కారుది...భవనం ప్రైవేటుది ...?






పేట మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు

కళ్ళుండి కబోదులైన మున్సిపల్ అధికార గణం

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణంతో అంతా పరేషాన్

ఈ తతంగం వెనక హస్తం ఎవరిది...?

సర్కార్ భూముల ఆక్రమణకు చెక్ పడేనా


G.N.K. Mani
7660813914.

**సూర్యాపేట, జూన్ 11 (మనం ప్రతినిధి):** సర్కార్ స్థలం కనిపిస్తే చాలు.... అంతో ఇంతో రాజకీయ పలుకుబడి కలిగిన వారే కాదు... డబ్బు దండిగా ఉన్న బడా బాబులు సైతం... తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంటారు. అవకాశం ఉండాలే కానీ... ప్రభుత్వ స్థలమే కాదు... ప్రైవేటు స్థలం అయినా వారి కన్ను పడిందంటే 'రూబాబు' చేసైనా దాన్ని కబ్జా చేయక మానరు,... ఇలాంటి సంఘటనలు జిల్లా కేంద్రమైన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిత్యం జరుగుతూ స్థానిక ప్రజలను సడలింప చేస్తూ... విస్తూ పోయేలా చేస్తున్నాయి.. ఇటీవల కాలంలో అలాంటి సంఘటనలు పెద్ద ఎత్తున వెలుగులోకి వస్తున్న తీరు మున్సిపల్ అధికారుల బాధ్యతరాహిత్యాన్ని ఒకటొకటిగా బహిరంగ పరుస్తున్నాయి. ఒకరు బాహాటంగా మున్సిపల్ పార్కు స్థలాన్ని ఆక్రమించుకొని... ఆ స్థలంలో ఏకంగా పక్క భవనాన్ని నిర్మిస్తే.. మరొకరు రహదారిని తన సొంత 'జాగా' చెప్పుకుంటూ ప్రహరీ నిర్మించి అందరిని... ఔరా! అనిపించిన సంఘటన చూసి స్థానికులు అంతా ముక్కు మీద వేలు వేసుకున్నారు. ఇక విషయంలోకి వెళితే.... సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఈ 'కబ్జా'వ్యవహారంత ఆ నోట... ఈ నోట వినిపిస్తూ పట్టణంలో దావణంలో వ్యాపించింది.. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్న ఆ నాయకులు కొందరు ఆ పార్టీలో కొనసాగుతూ కబ్జాల పర్వం మాత్రం వదలక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.. మున్సిపల్ పాలకవర్గాలు ఎప్పటికప్పుడు మారుతున్న ఆ నాయకుల పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం...ఇటీవల నూతన మున్సిపల్ పాలకవర్గం కొలువుతీరి నాలుగు మాసాలు కావస్తున్న... ఎంత మాత్రం అభివృద్ధి ఊసే లేదు. ఈ విషయం పక్కనబెడదాం... ఇక అక్రమల తంతు అంటారా... సరే సరి ... అవినీతి తంతు మాత్రం యదేచ్ఛగా కొనసాగుతూనే ఉంటుంది. అధికారులు వివరిస్తున్న తీరు పట్టణ పుర ప్రజలకు విసుగు తెప్పిస్తుంది... ఈ నేపథ్యంలో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న.. 'పేట' మున్సిపల్ పరిధిలోని వివిఎన్ క్లా.. టౌన్షిప్ లో ఒక ఇంటి అక్రమ నిర్మాణం.. వెలుగులోకి రావడం... అధికార ప్రతిపక్ష పార్టీలతో పాటు.. పట్టణ ప్రజల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది... ఇలా కూడా నిర్మాణం చేయొచ్చా ..! అనే కొత్త ఆలోచన ప్రజల నుండి వ్యక్తం అవుతుంది... సాధారణంగా ప్రభుత్వ అనుమతితో వ్యవసాయ భూములను రెవిన్యూ నుండి నాలా పరిమిషన్ తో లేఅవుట్ నిర్మాణం చేపడతారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలో నూతనంగా లేఅవుట్ నిర్మాణం చేయాలంటే... మొత్తం భూమి వెంచర్ నిర్మాణంలో పుర నిబంధన ప్రకారం.. 10 శాతం భూమిని నిర్మాణ దారుడు మున్సిపాలిటీకి గిఫ్ట్ డిడి కింద రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.. ఆ భూమి కాస్త మున్సిపల్ పరిధిలోకి వస్తుంది.. దీంతో చిల్డ్రన్స్ పార్కు మొక్కల పెంపకం ఇతర డెవలప్మెంట్ కోసం ఉపయోగించాల్సి ఉంటుంది... కానీ కొందరు స్వార్థపరులు రాజకీయ అండదండలతో... ఏకంగా మున్సిపాలిటీ కేటాయించిన ప్రభుత్వ స్థలంలో.. ఇంటి నిర్మాణం చేయడం.. ప్రజల్ని విశ్వయానికి గురిచేస్తుంది... మున్సిపల్ పరిధిలో నిర్మాణదారుడు నూతనంగా ఎక్కడ వెంచర్ చేసిన పది శాతం మున్సిపాలిటీకి కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం ఇలా కూడా చేయొచ్చా అనే ఆలోచన కొంతమంది జనాల నుండి తలెత్తుతున్న ప్రశ్న... ఇది ఇలా ఉండగా ప్రభుత్వ స్థలంలో ఏకంగా నూతన బిల్డింగ్ నిర్మాణాన్ని చేపట్టిన తీరు చూస్తే.. అధికారపార్టీ నాయకుల.అండదండలతో.. ఈ నిర్మాణం చేపట్టాడని ఆరోపణలు గుప్పుమంటున్నాయి...ఇంత జరుగుతున్న..మున్సిపల్ అధికారుల..వ్యవహార శైలి చూస్తే అటువైపుగా కన్నెత్తి చూడకపోవడం... వెనుక మత్తులబు ఏంటో మరి మున్సిపల్ అధికారులకే తెలియాలి.. కనీసం అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోవడం.. తీవ్ర విమర్శలకు గురి చేస్తున్న నేపథ్యంలో.. కనీసం మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాన్ని సైతం కాపాడుకోలేని దుస్థితి సూర్యాపేట మున్సిపాలిటీకి దాపరించిందని విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తం అవుతున్నాయి.. ఇది ఇలా ఉండగా... పట్టణంలోని తాళ్లగడ్డ ఏరియా హాస్పిటల్ సమీపంలో.. . 780.. సర్వే నెంబర్లు దాదాపు 7 నుండి 8 ఎకరాల వ్యవసాయ భూమిని 1998. 2000 సంవత్సరం మధ్య కాలంలో ప్లాట్లుగా మార్చి విక్రయించడం జరిగింది. ఈ నేపథ్యంలో అప్పటి లేఅవుట్ మ్యాప్ ప్రకారం 30 ఫీట్ల రోడ్డుగా ఉంది... అంతేకాకుండా తాజాగా తీసిన ఈసీలో సైతం 30 ఫీట్ల రోడ్డుగా చూపిస్తుండటం గమనార్హం.. ఇదే రోడ్డు స్థలాన్ని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు.. ప్రహరీ గోడ ఏర్పాటుచేసి సుమారు 600 గజాల భూమిని ఆక్రమించినట్లు ఇదే లేఔట్ లో భూమిని కొని ఇంటి నిర్మాణం చేసుకొని నివాసం ఏర్పాటు చేసుకొని ప్రాంతంలో నివసించే ప్రజలు బాటంగానే చెబుతున్నారు... దీంతో తాము నడిచే రోడ్డు బాట సైతం కబ్జాకు గురైందని గగ్గోలు పెడుతున్నారు.. దీనిపై... ఇప్పటికే మున్సిపాలిటీ కమిషనర్.. జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ కు అప్పటి డాక్యుమెంట్స్ లేఅవుట్ పత్రాలు రోడ్డు మ్యాప్ ఈసీ కాపీతో జతపరచి.. ఈ ఆక్రమణపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## ఆక్రమణలు పరిశీలిస్తాం: కమిషనర్....



జిల్లా కేంద్రంలోని వివిఎన్క్ల్యా టౌన్షిప్ లోని 10శాతం మున్సిపల్ స్థానంలో జరిగే ఇంటి నిర్మాణం పై వివరణ కోరగా మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ... అక్కడ మున్సిపల్ సంబంధించిన ప్రభుత్వ స్థలం ఏది లేదని వెల్లడించారు. అయినా ఈ విషయమై పూర్తి స్థాయి సమాచారం తెలుసుకుంటామని ఆయన తెలిపారు... అలాగే 780 సర్వే నెంబర్ లో గతంలో జరిగిన ఎనిమిది ఎకరాల వెంచర్ నిర్మాణానికి సంబంధించి... ఇందులో 30 ఫీట్ల రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం జరిగిన విషయం.. ఇటీవల ఓ మాజీ కౌన్సిలర్.. ఆ ప్రాంత ప్రజలతో కలిసి తన దృష్టికి తీసుకువచ్చారని.. ఇదే విషయమై కలెక్టర్ కూడా ఫిర్యాదు అందిందని కమిషన్ గుర్తు చేశారు... దీనిపై కూడా పూర్తిస్థాయిలో అధికారులు ఇచ్చే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మనం ప్రతినిధికి స్పష్టం చేశారు.

# సీఎం జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ,జూన్ 11 (మనం ప్రతినిధి):** సుమారు 14,500 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన నిమిత్తం ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, కనగల్ వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం,బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. హ్యాం రోడ్లతోపాటు, మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చే ఇక్కడ నుండే శంకుస్థాపనలు నిర్వహించే విషయమై సమావేశంలో మంత్రి అధికారులతో చర్చించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి తో ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం చేయించి ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నందున అవకాశం ఉంటే దేవాలయ ఆధునికరణ పనులకు కూడా ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు. శిలాఫలకం, ఇతర ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కొరారు. అనంతరం హ్యాం రోడ్ల శంకుస్థాపన, బహిరంగ సభకు హాజరయ్యే విధంగా ప్రాథమికంగా ఏర్పాట్లు చేసేలా మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు.

అంతేకాక సభకు హాజరయ్యే ప్రజల కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడ లోపం లేకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ , జిల్లా అధికారులతో కలిసి గురువారమే కనగల్ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు,హ్యాం రోడ్ల శంకుస్థాపనకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే పైలాన్ ఏర్పాటు చేసే స్థలం , బందోబస్తుతో సహా పరిశీలించి నట్లు వెల్లడించారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డి ఈ గణేష్, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు .



# 2029 రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమిద్దాం

**సూర్యాపేట టౌన్, జూన్ 11, మనం న్యూస్:** రాష్ట్రంలో 2029 లో జరిగే ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై అగ్ర కులాలపై పోరాటం చేసి రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని టి ఆర్ పి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 5 న భువనగిరి లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాడానికై బహుజనులంతా ఏకమై కలిసి రావాలన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలైందని, ఆ పార్టీ లోని కార్యకర్తలు వారి సమస్యలు ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. బిసి వర్గానికి చెందిన తనపై కక్షపూరితంగా, దురుద్దేశంతో ఎదగనీయకుండా అగ్రకులాల వారు, దొరలు అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అడ్డగోలుగా భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారని, అగ్రకుల అహంకారంతో పేద బడుగు బలహీన వర్గాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎలాంటి పదవులు లేకున్నా కొందరు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు డాక్యుమెంట్లలను సృష్టించి వివిఎన్ క్లైవ్ లోని పార్క్ స్థలంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని అన్నారు. ఇకనైనా అగ్ర కులాల పెత్తనాన్ని ఇటు నియోజకవర్గం, అటు రాష్ట్రంలో లేకుండా చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్ టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లే సైదులు, మహిళ అధ్యక్షురాలు కొన్నే మంజుల పాల్గొన్నారు.



## అత్యాధునిక సాంకేతికతతో కూడిన

# విద్య ఆదిత్య స్కూల్ ప్రత్యేకత



**సూర్యాపేట టౌన్, జూన్ 11, మనం న్యూస్:** నేటి తరం విద్యార్థులకు అణుగుణంగా అర్థవంతమైన విజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతతో కూడిన విద్య ఆదిత్య స్కూల్ విత్ ఏఐ టెక్నాలజీ అందిస్తుందని ఆ పాఠశాల డైరెక్టర్ చింతమల్ల రమేష్ అన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే చిన్నతనం నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించారు కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో సిసి కెమెరాలు, ఎంపరింగ్ యంగ్ మైండ్స్ విత్ ఏఐ, నీవ్ పాత్ర యాప్ తో పిల్లలకు విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్ కాలనీ నందు బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలను చైర్మన్ చింతమల్ల సుజాతనిర్మల్ కుమార్లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కట్కోజు విద్యా భారతి, కరస్పాండెంట్ కట్కోజు భరత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఐ వినియోగంతో వేగం సామర్థ్యం పెరుగుతుంది

ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి

సాంకేతిక పరిజ్ఞానంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలి

శిక్షణలను సద్వినియోగం చేసుకుని పనిలో ప్రతిఫలింపజేయాలి

ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా అందించాలి



**సూర్యాపేట, జూన్ 11 (మనం ప్రతినిధి):** ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు , కలెక్టరేట్ పరిపాలన అధికారి సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# వర్షపు నీటిని ఒడిసి పట్టండి

- ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించండి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ, జూన్ 11 ( మనం ప్రతి నిధి):** ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వర్షం ద్వారా కురిసిన నీటిని వడిసిపట్టాలని, అంతేకాక ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జల శక్తి అభియాన్ కింద జల్ సంచాయ్, జన్ భాగీదారి ప్రచార కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్ జి కళాశాల మైదానం నుండి నిర్వహించిన బైక్ ర్యాలీని నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఈ సంవత్సరం వర్షాలు నిరంతరం కురిసే అవకాశం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, అవసరం ఉన్నప్పుడు వర్షం రాకపోవడం, అవసరం లేనప్పుడు రావడం వంటి పరిస్థితులు నెలకొంటాయని , దీనిని దృష్టిలో ఉంచుకొని వర్షం కురిసినప్పుడు వాన నీటిని వడిసిపటాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే ఇంటింటికి ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ లు కూడా నిర్మించుకోవాలని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణం చేపట్టాలని, ఎక్కడైనా కమ్యూనిటీ సోక్ పిట్లు మంజూరు కానట్లయితే తక్షణమే వాటిని మంజూరు చేసి కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణం చేపట్టాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరూ నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని, ప్రత్యేకించి మిషన్ భగీరథ ద్వారా గ్రామాలలో సరఫరా చేస్తున్న తాగునీటిని వృధా చేయకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమయం ప్రకారం తాగునీటిని సరఫరా చేస్తున్నందున నీరు వృధా బయటికి పోకుండా నల్లాలు బిగించాలని, ఎట్టి పరిస్థితులలో నీటిని వృధా చేయవద్దని అన్నారు .ఆగస్టు మొదటి వారం వరకు జల్ సంచాయ్, జన్ భాగీదారి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని, జిల్లాలో అందరి సహకారంతో నీటి కొరత లేకుండా వాన నీటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈ విషయంపై మండల స్థాయిలో పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి వాన నీటి సంరక్షణ కట్టడాలు, ప్రత్యేకించి కమ్యూనిటీ సోక్ పిట్లు, వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు, ఇంకుడు గుంతలపై దృష్టి సారించాలని, ఈ అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని వాన నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ శంకర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై

# మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష



**హుస్నాబాద్, జూన్ 11 మనం న్యూస్ :** హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. గతంలో భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పురోగతి, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు, పట్టణంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్పర్సన్ చిత్తరి పద్మ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి



- **రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు సాధించాలి**
- **మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు, జూన్ 11, మనం ప్రతినిధిః** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు సాధించాలని, పంటల మార్పిడి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్ వద్ద పీఎస్ఆర్ గార్డెన్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల మార్పిడి విధానం, నూతన వంగడాల వినియోగం, ఎరువుల వినియోగాన్ని తగ్గించే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ సాగు విధానాలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, పంటల మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సాగులో అధిక రసాయనాలు ఉపయోగిస్తే అనేక అనర్థాలకు దారి తీస్తుంది సేంద్రియ వ్యవసాయాలతో ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతు రుణమాఫీ ద్వారా రూ.21 వేల కోట్లను విడుదల చేసి దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు.రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతుల పంటను కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లాలో తొలి దశలో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు ప్రస్తుతం వేలాది ఎకరాలకు విస్తరించిందని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే పంటగా రైతులు దీనిని స్వీకరించాలని సూచించారు. పోడు, బీడు భూముల్లో కూడా ఆయిల్ పామ్తో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని కోరారు. వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేని రైతులకు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు వంటి అంశాల్లో ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.జ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో మెగా రైతు మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నూతన సాగు పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వ్యవసాయ ఉత్తమ రైతులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సన్మానించి అభినందించారు. రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ స్టాల్స్ను మంత్రి సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సందర్శించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన వరి నాటు యంత్రాన్ని మంత్రి సీతక్క స్వయంగా నడిపి దాని పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్,ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు,జిల్లా అధికారులు,ములుగు,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ చైమెన్లు రవీందర్ రెడ్డి,కర్ల అరుణ, చల్వాయి,గోవిందరావు పేట గ్రామాల సర్పంచ్ లు,సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ సీట్లకు డ్రా

- **పారదర్శకంగా అర్హుల ఎంపిక చేసాం**
- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, జూన్ 11(మనంన్యూష్)ః** వరంగల్ జిల్లా కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల ఎంపిక కోసం డ్రా కార్యక్రమం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించబడింది. జిల్లాలోని 8 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్లో మొత్తం 122 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో 60 నాన్-రెసిడెన్షియల్, 62 రెసిడెన్షియల్ సీట్లు ఉన్నాయి. 1వ తరగతి సీట్లకు 60 సీట్లకు గాను 103 దరఖాస్తులు రావడంతో పారదర్శకంగా డ్రా పద్ధతిలో ఎంపిక చేపట్టగా, 5వ తరగతికి 62 సీట్లకు 44 దరఖాస్తులు మాత్రమే రావడంతో అందరూ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వం పేద, అర్హులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించామని, ప్రతి అర్హ విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉత్తమంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆమె ఆకాంక్షించారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు, 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు హాస్టల్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపిక జాబితాలను పాఠశాలల నోటీసు బోర్డులు, జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా విద్యాధికారి, ఎంఈఓలు, కమిటీ సభ్యులు, ఎస్సీ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రధాన లక్ష్యం



**హనుమకొండ, జూన్ 11: (మనం ప్రతినిధి)ః** పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య, ప్రతిరోజూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు, నెలవారీ ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య, మందుల నిల్వలు, నూతన ఆసుపత్రికి అవసరమైన అదనపు పరికరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలు, ఆసుపత్రి పరిధిలోని మండలాల వివరాలను ఎమ్మెల్యే సూపరింటెండెంట్ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల ఏరియా ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని మందులు ఆసుపత్రిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు గత నెలలో నూతన ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ప్రతి రశీదు, బిల్లు, రికార్డును పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులను సంబంధిత ఏజెన్సీలు వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్కు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల సంఖ్య, శస్త్రచికిత్సలు, ప్రసవాల గణాంకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, నాగరాణి, రాఘవరెడ్డి, పుష్పలత, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పదు



- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**హనుమకొండ, జూన్ 11(మనం ప్రతినిధి)ః** నిర్వహించాల్సిన విధులను నిర్వహించకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు తెలియజేసారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కిట్స్ కళాశాల సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తోలి సారిగా గతంలో ఎన్నడు లేని విధంగా సిసిటిఎనఎస్ అప్లికేషన్ 2.0 ద్వారా పోలీస్ కమిషనర్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమీషనర్ అనలైన్ పద్దతిలో సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుకోవడంతో పాటు, పెండింగ్ కేసుల, కేసుల పురోగతికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులు సూచనలు, సలహాలను అందజేసారు. అనంతరం అధికారులను ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి తనిఖీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యా సంస్థల 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పోగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకోని విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను పాఠశాలలకు తరలించే స్కూల్ బస్ల స్థితిగతులపై స్థానిక పోలీస్ అధికారులు వ్యక్తిగతం వెళ్ళి బస్సులను తనిఖీ చేయాలని. ఇటీవల హైదరాబాద్లో జరిగిన వరుస సంఘటనలను దృష్టిలో వుంచుకోని నగరంలో నేపాల్ దేశానికి చెందిన పౌరులు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎక్కడ నివస్తున్నారు, ముఖ్యంగా ఇండ్లల్లో పనిచేసే వారి వివరాలను సేకరించాలని రాబోవు లోక్ ఆదాలత్ ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని, పెండింగ్ కేసులను పరిష్కరించడంతో పాటు, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, అదనపు డిసిపిలు రవి,బాలస్వామి, ప్రభాకర్ రావు, సురేష్కుమార్తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, సబ్ఇూఇన్స్పెక్టర్లు పాల్గోన్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులుగా రవి పటేల్



**దుగ్గొండి, జూన్ 11 (మనం న్యూస్)ః** తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా అధ్యక్షులు దండ నరేష్ ఆధ్వర్యంలో దుగ్గొండి మండల ఉప సర్పంచుల ఫోరం లో జరిగిన ఎన్నికల్లో దుగ్గొండి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా గుడ్డేలుగుల పల్లె గ్రామానికి చెందిన తొర్రూరు రవి పటేల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది ఎన్నిక అనంతరం జిల్లా అధ్యక్షులు దండ నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉప సర్పంచుల చెక్ పవర్ రద్దు పై వస్తున్న వార్తలను ఖండించి వాస్తవాలను తెలియపరచాలని కోరుకున్నారు అదేవిధంగా ఉప సర్పంచుల హక్కులను కాపాడాలని మాట్లాడారు అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**హనుమకొండ, జూన్ 11:( మనం ప్రతినిధి)ః** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ గురువారం పరకాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్కు పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఇతర అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు అనంతరం మున్సిపల్ చైర్మన్తో కలిసి కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సేవల నిర్వహణను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని పరిశీలించి పచ్చదనం పెంపొందించే చర్యలను పరిశీలించారు. అదేవిధంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దామెర చెరువు కట్ట బండ్, నాలా, కాలువ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. తదుపరి అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, నిర్మాణ పనుల స్థితిగతులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు

**షాపింగ్ కాంప్లెక్స్‌కు సన్నాహం**

**గ్రామీణ ప్రాంతంలో ఆర్టీసీ సేవలబలోపేతానికి కృషి**

**రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై .నాగిరెడ్డి**




**భీమదేవరపల్లి, జూన్ 11 మనం న్యూస్:** ముల్కనూర్ బస్టాండ్ ను అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం రోజున ముల్కనూర్ బస్టాండ్ ను సందర్శించి అనంతరం వారు మాట్లాడుతూ ముల్కనూర్ బస్టాండ్ వ్యాపార కేంద్రంగా ఉండినిరంతరం చుట్టుపక్కల గ్రామాల మహిళలు, రైతులు, విద్యార్థులు, తదితరులతోపాటు 5000 ప్రయాణికులు నిత్యం ప్రయాణిస్తుంటారని పేర్కొన్నారు. ముల్కనూర్ బస్టాండ్ పరిధిలో ప్రయాణికులకు కావలసిన మౌలిక సదుపాయాలైన మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ సేవలు బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో ముల్కనూర్ బస్టాండ్ ఊపు రేఖలు మారుతాయి అని, ఉపాధి కల్పించడానికి తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఊసకుల ప్రకాష్, వార్డు సభ్యులు అశోక్ అనిల్ ముల్కనూర్ ఎస్ట్స రాజు ఆర్టీసీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ రహిత మండలంగా ఏర్పాటుకు కృషి



**మహాదేవపూర్ జూన్ 11మనం న్యూస్ః** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న అశోక్ మటన్ షాప్ ను సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ గ్రామ కార్యదర్శి కల్పన సందర్శించారు, ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి పర్యావరణ హితమైన ఆకుల్లో మాంసం విక్రమిస్తున్న దుకాణ యజమాని అశోకుని అభినందించారు, ఈ సందర్భంగా సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ కు బదులుగా సహజసిద్ధమైన ఆకులను ఉపయోగించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు గ్రామంలోని ఇతర వ్యాపారులు కూడా ఇదే విధానాన్ని అనుసరించి ప్లాస్టిక్ రహిత నిర్మాణానికి సహకరించాలని కోరారు

# రోడ్డు నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **వాణిజ్య వాహనాల పత్రాలు సక్రమంగా ఉండాలి**
- **ప్రజల ప్రాణాల భద్రతే ముఖ్యం**
- **ఏఎమ్‌విఐ అపర్ణ**

**భీమదేవరపల్లి, జూన్ 11 మనం న్యూస్:** రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎంవిఐ అపర్ణ హెచ్చరించారు. గురువారం రోజున రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక విజిలెన్స్ డ్రైవ్ లో భాగంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆర్టిఏ అధికారి అపర్ణ వాణిజ్య వాహనాలఆకస్మిక తనిఖీ చేసి అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ప్రత్యేకంగా మోహరించి వాణిజ్య వాహనాలైన లారీలను గూడ్స్ వాహనాలను పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. వాణిజ్య వాహనదారులు త్రైమాసిక పనులు చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న ఫిట్నెస్ సర్టిఫికెట్ గడువు ముగిసిన వాహనాలు, బీమా, పర్మిట్ నిబంధనలను పాటించిన వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన రహదారుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ప్రజల ప్రాణ భద్రత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంవిఐ వేణుగోపాల్ ఎంవీ శ్రావ్య హోమ్ గార్డు శ్రీధర్ నరేందర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు



# ఈ కేవైసీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్

**మహాదేవపూర్, జూన్ 11మనం న్యూస్ ః** ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పెన్షన్ల ఈ-కేవైసీ ప్రక్రియను గ్రామ సర్పంచ్ హసీనా బానో త్యేకచొరవతో పర్యవేక్షిస్తున్నారు వికలాంగులు వృద్ధులుమరియుఅనారోగ్యంతోబాధపడుతూబయ టకురావడానికిఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షన్లబ్ధిదారుల ఇళ్లవద్దకేస్వయంగావెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. పెన్షన్ల లబ్ధిదారులు కార్యాలయాలచుట్టూ తిరగకుండావారి ఇంటి వద్దనే సేవలుఅందేలా చర్యలుచేపట్టారు. సందర్భంగా లబ్ధిదారులుమరియు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమపథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారుప్రజలకు చేరువగా ఉంటూ ముఖ్యంగా వికలాంగులు మరియు అనారోగ్య బాధితులకు అవసరమైన సేవలను వారి గడప వద్దకే తీసుకెళ్లడం అభినందనీయమని గ్రామస్తులుపేర్కొన్నారు. సర్పంచ్ నాబానో సేవాదృక్పథాన్ని గ్రామప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు నల్ల బుగ్గ సమ్మయ్య మహమ్మద్ బిన్ అలీ కొండపల్లి రాములుచీర్లవంచ చంద్రశేఖర్ గడ్డం స్వామిజిపి సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

# భారత్-ఎపై అఫ్గాన్-ఎ విజయం

## అండర్ 19 స్క్వాడ్‌లో ద్రవిడ్ కొడుకు



భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ అండర్ 19 స్క్వాడ్ లో చోటు దక్కించుకున్నాడు. శ్రీలంక పర్యటనలో జులై 4 నుంచి జులై 23 మధ్య భారత్ మూడు వన్డే మ్యాచ్ లు, రెండు మల్టీడే మ్యాచ్ లు ఆడనుంది. ఈక్రమంలో గురువారం ప్రకటించిన వన్డే స్క్వాడ్ లో అన్వయ్ ద్రవిడ్ కు చోటు దక్కింది. మరోవైపు హైదరాబాద్ కు చెందిన యశ్వీర్ గౌడ్ కు కూడా ఇందులో చోటు లభించింది. యశ్వీర్ గౌడ్ను ఇటీవల టీజీ20 వేలంలో ‘హైదరాబాద్ ఈ ఛాంపియన్స్’ జట్టు కొనుగోలు చేసింది. అండర్ 19 వన్డే, మల్టీడే మ్యాచ్ లకు యశ్ వర్ధన్ సింగ్ చౌహాన్ కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు.

ముక్కోణపు సిరీస్ లో భాగంగా భారత్-ఎతో జరిగిన వన్డే మ్యాచ్లో అఫ్గానిస్థాన్-ఎ జట్టు గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ నిర్ణీత 49 ఓవర్లలో(వర్షం కారణంగా కుదింపు) 349/9 పరుగులు చేసింది. వర్షం కారణంగా అఫ్గాన్-ఎ ఇన్నింగ్స్ను 38 ఓవర్లకు కుదించి.. టార్గెట్ను 294గా నిర్ణయించారు. ఛేదనలో అఫ్గాన్-ఎ 25.5 ఓవర్లకు 177/2 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడంతో డీఎల్ఎస్ విధానం ప్రకారం 4 పరుగుల తేడాతో అఫ్గాన్-ఎ విజయం సాధించింది. ఇమ్రాన్ 75*, బషీర్ షా 51*, హసన్ 34 రన్స్ చేశారు. భారత-ఎ బౌలర్లలో అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్ చెరో వికెట్ తీశారు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన టీమ్ఇండియా 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ప్రభ్ సిమ్రన్ సింగ్ (84), రుతురాజ్ గైక్వాడ్ (66), తిలక్ వర్మ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. వైభవ్ సూర్యవంశీ 44 రన్స్ చేశాడు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్లా 5, సాఫి 3, ఇమ్రాన్ ఒక వికెట్ తీశారు.







## తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన భీష్మాచార్యుడు : చిరంజీవి

తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు భీష్మాచార్యుడని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం ‘సింగ్ గీతం’. నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించారు. జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్ కు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు.

‘‘సింగీతం శ్రీనివాసరావు.. తెలుగు సినిమా పరిశ్రమకు ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో రూపొందిన ‘సింగ్ గీతం’ ఈనెల 12న విడుదల కానుంది. ఇది ఇండియన్ సినిమాలో మరొక మైలురాయిగా నిలవాలని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్తతరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఒకవైపు ఆనాటితరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం, మరోవైపు ఈతరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్.. వీరి కాంబో ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది’’ అని చిరంజీవి తన పోస్ట్ లో రాసుకొచ్చారు. ఇందులోభాగమైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం ‘సింగ్ గీతం’. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే కథ. కొన్ని అనూహ్య పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థుల గందరగోళాన్ని.. తమ వింత పరిస్థితికి సమాధానం వెతికే ప్రయత్నాల్ని ఇందులో వినోదాత్మకంగా ఆవిష్కరించారు.

## మా ఆయనకు కోచ్‌గా ప్రమోషన్ ఇచ్చా: సింధు

పీవీ సింధు భర్త వెంకట దత్తసాయి కాసేపు కోచ్ గా మారారు. వృత్తిరీత్యా ఆయన స్పోర్ట్స్ డేటా సైంటిస్ట్. కానీ, సింధు కోసం కొద్దిసేపు కోచ్ గా మారి తన భార్యకు మనోధైర్యం కల్పించారు. ఇదే మాటను పీవీ సింధు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఆమె రెండో రౌండ్లో మరో భారత షట్లర్ ఇషారాణి బారువాపై 22-20, 21-12 తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన అనుభవాన్ని సింధు తెలియజేసింది.

‘‘నాకు ఉదయం నుంచి ఒంట్లో అంతగా బాగోలేదు. నొప్పితో బాధపడుతున్నా. ఆ సమయంలో భావోద్వేగమైన మద్దతు అవసరం అనిపించింది. నాకు తెలిసిన వారిలో అత్యంత గొప్ప ఎనలిస్ట్ను పిలిచాను. మా ఇద్దరికి ఒకరే కోచ్. నేను కోచ్ను పిలిచి ఇషాను ఇబ్బందిపెట్టాలని అనుకోలేదు. దీంతో నా భర్త దత్తసాయికి ప్రమోషన్ ఇచ్చి.. ఆయనను కోచ్గా పరిచయం చేశా. నిజం చెప్పాలంటే.. నాకు వద్దు బాబోయ్ అనేంతగా బాగా ప్రోత్సహించారు (నవ్వుతున్న ఎమోజీలు). అయితే, రిఫరీ నుంచి రెండు వార్నింగ్లు అందుకొన్నా. కార్డు లేకుండానే ఎలాగోలా దీన్నుంచి బయటపడ్డాం. రెండో గేమ్ నాటికి ఇషాను సరిగ్గా అంచనా వేయగలిగా. భర్త క్రీడాభిమాని అయితే.. కొన్నిసార్లు ఎంతగానో సాయపడుతుంది’’ అని పీవీ సింధు పెట్టిన పోస్టు వైరల్గా మారింది.





## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ వన్డే జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. డిఫెండింగ్ ఛాంపియన్స్, ఆరు సార్లు వరల్ ఛాంపియన్స్ అయిన ఆస్ట్రేలియాపై తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ లో విజయం సాధించింది. స్వదేశంలో మూడు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా ఇవాళ (జూన్ 11) జరిగిన రెండో మ్యాచ్ లో విజయం సాధించడంతో ఈ ఘనత సొంతం చేసుకుంది.

బంగ్లాదేశ్ వన్డే జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. డిఫెండింగ్ ఛాంపియన్స్, ఆరు సార్లు వరల్ ఛాంపియన్స్ అయిన ఆస్ట్రేలియాపై తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ లో విజయం సాధించింది. స్వదేశంలో మూడు మ్యాచ్ల సిరీస్ లో భాగంగా ఇవాళ (జూన్ 11) జరిగిన రెండో మ్యాచ్ లో విజయం సాధించడంతో ఈ ఘనత సొంతం చేసుకుంది.

## భారత్-ఎ జట్టుకి గుంటూరు కుర్రోడు ఎంపిక

గుంటూరు జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ భారత్-ఎ జట్టులో స్థానం సంపాదించాడు. ఈనెల 24 నుంచి శ్రీలంకలో జరిగే మల్టీ డే టోర్నీలో భారత్-ఎ జట్టు తరఫున ఆడనున్నాడు. 2019లో రషీద్ అండర్-19 వరల్ కప్ వైస్ కెప్టెన్ గా వ్యవహరించాడు. భారత్ వరల్ కప్ విజేతగా నిలవడంలోనూ కీలకపాత్ర పోషించాడు. ఐపీఎల్లో సీఎస్కే జట్టుకు ఎంపికయ్యాడు. గతేడాది రంజీ మ్యాచ్లో అద్భుత ప్రతిభ కనబరచడం ద్వారా భారత్-ఎ జట్టులో స్థానం సంపాదించాడు. చిన్నతనం నుంచి రషీద్ పట్టుదల, క్రమశిక్షణతో ఈ స్థాయి వరకు వచ్చాడని.. భవిష్యత్తులో సీనియర్ జట్టులోనూ స్థానం దక్కించుకుంటాడని త్రీమెన్ కమిటీ సభ్యులు జీవీ శరత్ బాబు, టీవీ శివరామకృష్ణ, సీహెచ్ నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.



### అండర్-19 మహిళా జట్టుకు దీక్ష

ఇదే జిల్లాకు చెందిన కాట్రగడ్డ దీక్ష అండర్-19 భారత మహిళా జట్టులో చోటు దక్కించుకుంది. వికెట్ కీపర్, ఓపెనర్గా రాష్ట్రస్థాయిలో అద్భుతంగా రాణించింది. ఎన్సీఏకు ఎంపికై అక్కడా మంచి ప్రతిభ కనబరచడంతో అండర్-19 జట్టుకి ఎంపికైంది. ఆమెకు త్రీమెన్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. గతేడాది అండర్-15 రాష్ట్రస్థాయి పోటీల్లో ఓపెనర్గా 105 పరుగులతో అజేయంగా నిలిచిందని.. 249 పరుగుల భాగస్వామ్యంతో రికార్డు నెలకొల్పిందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.



## పాన్ ఇండియా..
# భయపడిపోతున్న హీరోయిన్లు!



ప్రస్తుతం టాలీవుడ్ తో పాటు సౌత్ సినిమా అంతా ‘పాన్ ఇండియా’ మంత్రం జపిస్తోంది. వందల కోట్ల బడ్జెట్, భారీ క్యాస్టింగ్, కళ్ళు చెదిరే విజువల్స్ తో ఈ సినిమాలు బాక్సాఫీస్ ను షేక్ చేస్తున్నాయి. అయితే, ఈ పాన్ ఇండియా జోరు టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో మాత్రం ఒక కొత్త భయాన్ని పుట్టిస్తోంది. సినిమా స్కేల్ ఎంత పెద్దదైనా, అందులో తమ పాత్రల నిడివి చాలా తక్కువగా ఉండడం, ప్రాధాన్యత లోపించడం, పైగా ఆ చిన్న పాత్రల వల్ల అనవసర వివాదాలు చుట్టుముట్టడంతో... ఇప్పుడు పాన్ ఇండియా ఆఫర్ వస్తేనే హీరోయిన్లు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

రామ్ చరణ్ హీరోగా నటించిన పాన్ ఇండియా సినిమా పెద్ది ఇటీవల ప్రేక్షకుల ముందుకురాగా, అందులో జాన్వీ కపూర్ పాత్రపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. తెరపై ఆమెను చూపించిన తీరుపై సినీ తారలు సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెప్పి, ఆ సీన్లను తొలగించాడు. అయినా కూడా ఈ వివాదం సాగుతూనే ఉంది.


జాన్వీ పాత్రపై ఇలా విమర్శలు రావడం రెండోసారి. అంతకు ముందు ఎన్టీఆర్ తో కలిసి నటించిన ‘దేవర’లోనూ ఆమె పాత్ర నిడివి తక్కువే ఉంది. అంతేకాదు నటన కంటే అందాల ప్రదర్శనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు విమర్శలు వచ్చాయి.

ఇక ఆర్ఆర్ఆర్ రిలీజ్ సమయంలో అలియా భట్ పాత్రపై కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయి. సినిమా అనౌన్స్ చేసినప్పుడు అలియా రేంజ్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని ఫ్యాన్స్ ఆశించారు. కానీ, సినిమాలో ఆమె పాత్ర నిడివి చాలా తక్కువ. కేవలం కొన్ని నిమిషాలకే పరిమితం కావడంతో అలియా ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. చివరకు ఈ పాత్ర నిడివి విషయంలో సోషల్ మీడియాలో పెద్ద వివాదమే నడిచింది. రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్ లో వచ్చిన ‘గేమ్ ఛేంజర్’ పొలిటికల్ థ్రిల్లర్. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్. శంకర్ సినిమాల్లో హీరోయిన్ల పాటలు రిచ్ గా ఉంటాయి కానీ, కథ పరంగా చూస్తే హీరో డామినేషన్ ఎక్కువ. ఈ సినిమాలోనూ కియారా పాత్రకు కథను మలుపు తిప్పేంత ప్రాధాన్యత లేకపోవడం, కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కావడంతో బాలీవుడ్ మీడియాలోనూ దీనిపై చర్చ జరిగింది. ’కల్కి’లో దీపికా పాత్ర కథకు కీలకమే అయినప్పటికీ, యాక్షన్ అంతా హీరోల చుట్టూనే తిరిగింది. ఇక భారీ అంచనాలతో వచ్చిన డిజాస్టర్ గా నిలిచిన ప్రభాస్ ‘ది రాజాసాబ్’లోనూ హీరోయిన్ల పాత్రకు అంత ప్రాధాన్యత లేదు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ ఈ సినిమా కోసం చాలా రోజులు కేటాయించారు. చివరకు ‘గ్లామర్ షో’కే పరిమితం అయ్యారంటూ విమర్శల పాలయ్యారు.

పాన్ ఇండియా సినిమాలు భారీ విజయం సాధించినా హీరోయిన్లకు క్రెడిట్ రావడం లేదు, ఒకవేళ క్యారెక్టర్ బాలేకపోతే మాత్రం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. అందుకే ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ భామలు కేవలం ’పాన్ ఇండియా’ ట్యాగ్ చూసి మోసపోకుండా, క్యారెక్టర్ గ్రాఫ్ ఎలా ఉందో చూసుకున్నాకే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు.

## గ్లింప్స్‌పై సాలిడ్ అప్డేట్ ఇచ్చిన మ్యాచో స్టార్..!

మ్యాచో స్టార్ గోపీచంద్ తన అభిమానులకు క్రేజీ అప్డేట్ ఇచ్చాడు. ఆయన నటిస్తున్న 34వ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ మరియు ఫస్ట్ గ్లింప్స్ను రేపు(జూన్ 12) సాయంత్రం 5:45 గంటలకు అధికారికంగా విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.




ఈ గ్లింప్స్ తో గోపీచంద్ తన అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇవ్వడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. యాక్షన్ మాస్టర్ వెంకట్ ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్నాడు. ఇక ఈ అప్డేట్ కు సంబంధించిన అనౌన్స్మెంట్ పోస్టర్ ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెంచింది. ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ ను 70ఎమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ప్రొడ్యూస్ చేస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి రేపు రాబోయే గ్లింప్స్ ఎలాంటి రెస్పాన్స్ దక్కించుకుంటుందో వేచి చూడాలి.

## అల్లు అరవింద్ తో సినిమాపై మాస్ కా దాస్ కామెంట్స్ వైరల్!

మన టాలీవుడ్ మాస్ కా దాస్ యువ హీరో విశ్వక్ సేన్ ఇప్పుడు మంచి కంబ్యాక్ కోసం చూస్తున్నాడు. ప్రస్తుతం పలు సినిమాలలో బిజీగా ఉన్న తాను లేటెస్ట్ గా ‘దీవానా’ అనే యూత్ ఫుల్ సినిమా ప్రమోషనల్ ఈవెంట్ లో గెస్ట్ గా పాల్గొన్నాడు. అల్లు అర్జున్ ట్రిపుల్ ఏ థియేటర్స్ లో జరిగిన ఇదే ఈవెంట్ కి దిగ్గజ నిర్మాత అల్లు అరవింద్ కూడా హాజరు కాగా తనతో విశ్వక్ సేన్ సంభాషణ వైరల్ గా మారింది.



నా మీద పగేమన్నా ఉందా సర్ అంటూ స్టార్ట్ చేసి అల్లు అరవింద్ గారితో సినిమా అంటే ఇప్పుడు అయినా సరే తన మొదటి సినిమాకి ఎలా వెళ్ళానో అలా వెళ్లి ఆడిషన్ ఇస్తాను అని తెలిపాడు. అన్ని డబ్బులు ఏం చేసుకుంటారు సార్, ఈ థియేటర్ మీదే, కూర్చున్న సీట్ కూడా మీదే మాలాంటోళ్ళకి పంచిపెట్టండి సార్ అంటూ తమలాంటి యువ నటీనటులని తమ బ్యానర్ లో సినిమాలు చేయాలనే రీతిలో చేసిన కామెంట్స్ ఇపుడు సినీ వర్గాల్లో వైరల్ గా మారాయి. అలాగే అల్లు అరవింద్ కూడా ఎప్పుడు నుంచో విశ్వక్ తో సినిమా చేయాలి అనే అనుకున్నాం కానీ కుదరలేదు అని తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.